ఆంధ్రసచిత్ర వారపత్రిక

తాజ్‌మహల్‌ను మించిన కట్టడం



10-6-59

25 నయాపైసలు

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



తులసిపూజ

—చిత్రకారుడు: కేశినీడి భాస్కరరావు (౧౨౬౬౪౪౪౦)



ఆంధ్రదేశమంతా
దిగ్విజయముగా
ప్రదర్శింపబడుచున్నది
భానూ ఫిలిమ్సు సమర్పించు
యంజియార్ పిక్చర్సు ప్రైవేట లిమిటెడ్ వారి
అనగా అనగా
ఒక రాజు
డైరెక్షన్: యం.జి.ఆర్
చమ్రియ రిలీజ్

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 53
సంచిక 36
10-6-59

Founder : K. NAGESWARA RAO

వికారి జ్యేష్ఠ శుద్ధ చతుర్థీ బుధవారం

విషయానుక్రమణిక

ముఖ చిత్రం:
పి. ఎ. పి. వారి
'ఇల్లరికం'లో
జమున

రాజధాని కబుర్లు

ప్రవీణ్

పత్రికలు - ప్రభుత్వం - బాధ్యతలు

దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి రాజ్యాంగం నెలకొల్పిన మూడువ్యవస్థల్లో, రెండింటికి బాధ్యతలతోపాటు అధికారాలున్నాయి. ఈ రెండూ న్యాయస్థానాలు, శాసనసభలు. ఈ రెంటికి అధికారాలతోబాటు అవకాశాలున్నాయి. బాధ్యతలే కాని అధికారాలూ, అవకాశాలూ లేని మూడో వ్యవస్థ: వార్తాపత్రిక.

వార్తా పత్రికలు అబద్ధాలు రాస్తాయని ఒక ప్రతీతి. అబద్ధాలే రాస్తాయని మరో ప్రతీతి. పత్రికల్లో పడేవన్నీ అబద్ధం అన్నమాట అబద్ధం. కాని పత్రికల్లో పడినవన్నీ నిజం కావనుకొని చదువుకోవడం శ్రేయస్కరం అందరికీ.

భారతీయ వార్తాపత్రికల్లో కంటె అమెరికన్ వార్తా పత్రికల్లో అబద్ధాలెక్కువుంటాయిట. కాని భారతీయులు తమ పత్రికల్లో పడేవన్ని సత్యాలే అనుకొని చదువుతారు. అమెరికనులు వాళ్ళ పత్రికల్లో పడేవన్నీ అబద్ధాలే అయ్యుంటాయని భావించి చదువుతారట. అదీ మనకీ వాళ్ళకీ ముఖ్యంగా తేడా.

వార్తలను సాధ్యమైనంత త్వరలో పాఠకులకు చేరవేయవలసిన బాధ్యత పత్రికల వారిది. ప్రపంచంలో ఏం జరుగుతూందో తెలుసుకొనే హక్కు పాఠకులది. పాఠకుల కోర్కె తీర్చడానికి వార్తలు సేకరించడానికి పత్రికల వారికి రాజ్యాంగం ప్రత్యేకం అధికారాలివ్వలేదు, ప్రభుత్వం సాధారణంగా ప్రత్యేకావకాశాలు కల్పించదు.

ఇట్టి పరిస్థితుల్లో పత్రికల్లో ప్రచురితమయ్యే వార్తల్లో తప్పులుండడం సహజం. జరిగిన తప్పు సవరించుకోడానికి సంపాదకులెప్పుడూ సిద్ధంగానే ఉంటారు. బాధ్యతలే గాని హక్కులు,అధికారాలు, అవకాశాలు లేని పత్రికలను కాపాడవలసిన బాధ్యత ప్రజలది, ప్రభుత్వానిది, న్యాయస్థానాలది, శాసనసభలది.

నిజాంగారి 'చుట్ట గొట్టం'

మహోన్నతవహించిన నిజాం [మాజీ] ప్రభువరేణ్యుడి. 'సిగరెట్ పైప్' తస్కరించబడిందిట. ఈ వార్త 'హమారా ఇఖ్దామ్' అనే స్థానిక ఉర్దూ దినపత్రికలో ప్రచురించబడింది. ఈ వార్త ప్రచురిస్తూనే ఆ పత్రిక ఆ వస్తువు మళ్ళా దొరికిందని వ్రాసింది. ఈ చౌర్యం ప్రభువు నివసించే భవనంలోనే జరిగింది. చుట్టూ ఎత్తైన ప్రహరీగోడలు. సింహద్వారాలవద్ద విచ్చుకత్తుల పహారాలు. లోనికి చొరడానికి సాహసించే మగ ఈగల్ని కూడా తెగనరకడానికి సిద్ధంగా ఉన్నట్టు కనిపించే కాపలావాళ్ళు. ఈ ఆవరణ ప్రక్కనుంచే పోతుంది 'కింగ్ కోఠి' రోడ్డు. ఒకనాటి ఉదయం ఒక కుర్రవాడు లోపల చెట్టెక్కి కాయలు కోసుకుంటున్నాడు. హఠాత్తుగా కాలుజారి, చేతులతో ఒక కొమ్మ పట్టుకుని వేలాడ్డం ప్రారంభించాడు. నిముషాలు గడిచిన కొద్దీ, అతని చేతులు పట్టుతప్పిపోడం ప్రారంభించాయి. భయంతో బావురుమన్నాడు కుర్రాడు. బయట రోడ్డుమీద రిక్షాలు, కార్లు ఆగిపోయాయి. ఆతృతతో చూస్తూన్న జనంలో కాపలావాళ్ళు కూడా ఉన్నారు. కాని ఎవ్వరూ లోపలికి పోవడానికి సాహసించలేదు. పదిపదిహేను నిముషాలు వేలాడి, పట్టుతప్పి, కెవ్వుమని కేకేస్తూ పడిపోయాడు కుర్రాడు.

చెట్టు కాంపౌండు లోపల ఉంది. కుర్రాడు పడిపోయింది కాంపౌండు లోపల. ఇది జరిగి నెల్లాళ్ళు కావస్తూంది. ముప్ఫై నలభై అడుగుల ఎత్తునుంచి పడిపోయిన కుర్రాడు బ్రతికున్నాడో చనిపోయాడో తెలియదు. దెబ్బలే తగిలాయో, ఎముకలే విరిగాయో తెలియదు. అంతా నిశ్శబ్దం. చీల్చరాని నిశ్శబ్దం.

అటువంటి భవనంలో నిజాం ప్రభువరేణ్యుడి సిగరెట్టు గొట్టం పోయింది. పోయినమాట వాస్తవమేనట. మళ్ళీ దొరికిందన్నది సందేహం. మరి—'హమారా ఇఖ్దామ్' దొరికిందని ప్రకటించింది. ఈ 'చుట్టగొట్టాపహరణ నేరపరిశోధకుడు,' హిమాయత్ నగర్ పోలీసుస్టేషన్ సబిన్స్పెక్టర్, పత్రిక సంపాదకుడికి వచ్చి కలవమని కబురు పంపించాడు. 'ఇఖ్దామ్' సంపాదకుడు నిరాకరించాడు. ఫలితం? 'ఇఖ్దామ్' సంపాదకుడు శ్రీ జబీ గతవారంలో భారత శిక్షాస్మృతి 174 వ సెక్షన్ క్రింద ఆరవ నగర మేజస్ట్రేట్ శ్రీ వెంకటరత్నం ముందు హాజరు చేయబడ్డారు. సబ్ ఇన్స్పెక్టర్ జారీ చేసిన సమన్లను గౌరవించనందుకు శ్రీ జబీకి 100 రూపాయలు జుల్మానా విధించబడింది. అది చెల్లించనిపక్షంలో, ఐదు రోజుల కారాగారవాసం.

"నేరమూ—శిక్ష"

పోలీసు అధికారులు పంపిన సమన్లను నిరాకరించడంలో శ్రీ జబీ శిక్షాస్మృతి ననుసరించి నేరం చేశాడనడంలో సందేహం లేదు. చట్టంలోని

★ రాజధాని కబుర్లు ★

అంశాలను పరిశీలిస్తే, ఆ కేసానికి అంత [illegible] తగినదే అనడంలో కూడా సందేహం లేదు. కాని ఈ తీర్పుయొక్క ప్రమాదకరమైన పరిణామాలను గమనించక తప్పదు.

పోలీసు అధికారి అంటే పోలీసు కాన్‌స్టేబిల్ కూడా అధికారి క్రిందే వస్తాడని గమనించాలి మనం. కేసాన్వేషణలో పోలీసు అధికారులకి తోడ్పడవలసిన బాధ్యత ప్రతి పౌరుడిమీదా ఉంది. కాని కనపడ్డ ప్రతి వాణ్ణీ 'మిత్రుడా!' అని పిలిచి తీసుకువెళ్ళడానికి పోలీసు అధికారులకి చట్టం ఇంకా అధికారం ఇవ్వలేదు. జరిగిన సంగతులను గురించి పత్రికలు వార్తలు ప్రకటిస్తాయి. వార్తలు ప్రకటించడంవల్ల, సంఘటనల బాధ్యత పత్రికలదికాదు. తప్పుడు వార్తలు ప్రకటిస్తే సవరణలు ప్రచురించవలసివుంది. ప్రభుత్వం కొన్ని జీవనసత్యాలను 'హోటా' పోలీసు అధికారులకు బోధిస్తే బాగుంటుంది.

ఉద్యోగులు-ఉద్యోగాలు

పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఉద్యోగులను నియమించినప్పుడు, ఆ నియామకాలకు ప్రాతిపదికగా నియమాలు నిబంధనలు ఉంటాయని భావించడం సమంజసం. ప్రతిఉద్యోగానికి అర్హతలు కొన్ని ఉంటాయని, అర్హతలు ఉన్న వ్యక్తులనే ఇంటర్వ్యూకి పిలుస్తారని భావించడం కూడా సమంజసమే. కాని ఈ విషయాలలో ఇప్పుడిప్పుడు సందేహాలకు అవకాశం లభిస్తున్నది.

ఆ మధ్య ఒకానొక ఉద్యోగానికి గణితశాస్త్రంలో ఎమ్. ఏ. పట్టా అర్హతగా నిర్ణయించబడింది. ఆ ఉద్యోగానికి మేథమెటికల్ ఫిజిక్సు ప్రధానవిషయంగా పరీక్షలో కృతార్థుడైన ఒకవ్యక్తి దరఖాస్తు పెట్టాడు. అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలిచేముందు, దరఖాస్తు పత్రాలను పరిశీలించడానికి కమీషన్‌కి ఒక కార్యాలయం ఉందని వినికిడి. ఆ దరఖాస్తుదారు 'స్వంతఖర్చులపై' ఇంటర్వ్యూకి పిలిపించబడ్డాడు. ఆ ఇంటర్వ్యూలో మేథమెటికల్ ఫిజిక్సును మేథమెటిక్సుగా పరిగణించ వీలులేదని, అందువల్ల ఆ ఉద్యోగానికి అతడు అనర్హుడని అతనికి తెలియచెప్పారట సభ్యులు.

మేథమెటికల్ ఫిజిక్సును గణితశాస్త్రంగా పరిగణించమని కమిషన్‌ను కట్టడి చేయడానికి మనకెవ్వరికీ అధికారంలేదు. పరిగణించని పక్షంలో, ఆ అభ్యర్థిని కమిషన్ 'ఇంటర్వ్యూ'కి ఎందుకు పిలిచింది? తర్వాత మరో ఉద్యోగం విషయంలో అదిగణితశాస్త్రంగా పరిగణించవచ్చునని తేల్చిందట కమిషన్. మొదటితీర్పు అలాగే [illegible] మరి!

ఈ సంఘటనలో [illegible]

* * *

[illegible]

ఈ అభిప్రాయంతో [illegible] ఇదే అభిప్రాయం

ఈ విషయం సాధారణంగా గత నవంబరు 12 వ తేదీ 'పచిత్ర వారపత్రిక'లో 'రాజధాని కబుర్లు'లో వెలిబుచ్చబడింది. పత్రికల్లోవచ్చే విమర్శ చదివి తెలుసుకోడానికి, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రధానకార్యదర్శికి తెలుగు రాదు. తెలుగు వచ్చిన కార్యదర్శి అభిప్రాయాలకు విలువలేదు. 'ప్రవీణుడి' పలుకులను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వము, ప్రధానన్యాయమూర్తి అభిప్రాయాలకు విలువ నిస్తుందేమో చూడాలి.

ఈలోగా అకాడమీ పూర్వవిధంగానే నడుస్తూంది. వృథాకాలం [illegible] జరగవలసిన అకాడమీ ఫైళ్ళు పెండింగు కూచుని తృప్తిగా నిద్రపోతూంది. కార్యాలయ కార్యదర్శి ఈనెలలో రాజీనామా ఇచ్చారట [illegible]. అకాడమీలో పనిచేస్తూన్న ఉద్యోగులకు ఉద్యోగాలు ఏ ప్రాతిపదికపై లభించాయో తెలియదు. కాజువల్ లీవు వంటి సౌకర్యాలు అధికారుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి వున్నట్లు కనిపిస్తూంది. ఉద్యోగంనుంచి వ్యక్తులను తొలగిస్తే, వారికా విషయం లిఖితపూర్వకంగా తెలియచేయాలని, రాజ్యాంగం ఈహక్కు ఉద్యోగులకు ఇచ్చిందని అర్థంకాని ఐ. ఏ. ఎస్. అధికారులు అకాడమీని పాలిస్తున్నారు ఈనాడు.

సర్కారుకార్ల షికార్లు ఊళ్ళో పుకార్లు

ప్రభుత్వం సంక్షేమప్రభుత్వమైన మరునాటినుంచి ప్రభుత్వాధికారుల అధీనంలో జీపుకార్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఉద్యోగి వేతనం ఎంత పెద్దదైతే, అతని అధీనంలోని అంత ఖరీదుగల కారు వస్తుంది. పరిపాలనా నిర్వహణకు సంబంధించిన నిబంధనలలో సర్కారు కార్లను సర్కారు పనులమీదనే వినియోగించాలనే నిబంధన ఉంది. అది ఉన్నా, లేనట్టుగానే ప్రవర్తిస్తున్నారని చాలమంది [illegible].

సొంతపనులకి ప్రభుత్వానికి చెందినవాహనాలను ఉపయోగించుకోడంవల్ల ప్రభుత్వానికి లక్షలకొలది రూపాయల నష్టం వస్తూందని

(12-వ పేజి చూడండి)



న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణ

ఒరిస్సాలో అమలు జరిగిన రాజ్యతంత్రం

భవిష్యత్తుకు నాందీ అవుతుందా?

ఎండలు ఫెళ్ళున కాస్తున్నాయి. వీధిలోకి వస్తే వేడిగాడ్పులు చెంప ఛెళ్ళుమనేలా కొడుతున్నాయి. ఢిల్లీకి ఏటా ఈ కోటా పరిపాటే అనుకోడంవల్ల బాధ తగ్గేదిలేదు. అందుచేతే, విమానశాఖవారు, విదేశ రాయబార కార్యాలయాలవారూ 'ఒంటిపూట' ఆఫీసులు మొదలుపెట్టి ఉదయం 8-30 కి ఆరంభించి మధ్యాహ్నం ఒంటిగంటకల్లా గంట వాయించేస్తున్నారు. అసలే వేడుగ్గాన వేసవికాలపు పగళ్లు దిగులుగాఉండి మరింత పొడుగు సాగుతున్నాయి. తీరుబాటుగా పథకాలు వేసుకునేవారికి కావలసినంత తీరుబాటు. మాస్టర్ తారాసింగ్ ఆ పనే చేస్తున్నారు. తీరిక వేళలో ఆయన హోబీచాందినీచౌక్‌లోని సిస్‌గంజ్ గురుద్వారా పక్కని సువ్వా సేవా అన్నట్టు నిలబడి ఒడ్డుపొడుగులు తేరీజులు వేసుకోడం. ఈ గురుద్వార్ మీద పెత్తనం పూర్తిగా ఆయన చేతుల్లోకి వచ్చేసింది. దాన్ని ఊడ లాక్కోడానికి ఎస్. జి. పి. సి. (శిరోమణిగురుగ్రంథ్ ప్రబంధక్ కమిటీ) వాళ్లు శాయశక్తులా పాటుబడుతున్నారు. కథ అడ్డం తిరిగితే మాస్టర్జీ వేసేంతస్సా ఒక పెద్ద 'మోర్చా!'. ఆ యాత్రంకోసం ఆయన వలంటర్లను కూడా పోగు చేస్తున్నారు. మొత్తంమీద ఒక చిన్నసైజు అంతర్యుద్ధానికి రంగం సిద్ధమవుతున్నట్టు కనబడుతుంది.

మన పని, మనతో అవసరం తీరగానే ఎదటివాళ్ళకి మొహంమొత్తకుండా మర్యాదగా తప్పుకోవాలన్నది నీతి; అలా తప్పుకోవకపోవడం అన్నది లోకరీతి. రాజకీయ లోకంలో మరీను. మనదేశంలో అంతకన్నాను. ఇష్టంలేదని ఎవరూ అనరు. ఆ తప్పుకోవలసిన ముహూర్తం ఎప్పుడు అన్న విషయంలోనే పెద్దలకు సందేహాలొస్తాయి. "ఇప్పుడప్పుడే కాదు" అని చెప్పటికప్పుడు అనుకోడం మామూలు. ఈ సంప్రదాయాన్ని మన్నించేవారిలో మాస్టర్ తారాసింగ్ ఒకరు. పదిహేనేళ్లుగా మాస్టర్జీ అద్దాలమేడలో బసచేస్తున్నారు. అందువల్ల ఆయనకు ఎటుచూసినా మాస్టర్ తారాసింగే కనిపించడం సహజం.

ఈ సంవత్సరం పుటకల్లో ఎస్.జి.పి.సి. అధ్యక్షపదవికి నిలబడబోయి పడిపోవడం ఆయనకు పెద్ద దెబ్బ అయినా ఏదోవిధంగా జనానికి కనబడుతూ వినబడుతూ ఉండాలనే మాస్టర్జీ కృషిచేస్తూవచ్చారు. ఇవాళ నిరశన దీక్ష అంటారు. రేపు నిరసన యాత్ర అంటారు. ఇలా చేసి చేసి న్యూస్ వాల్యూ పెట్టి "న్యూసెన్స్‌వాల్యూ" కొనుక్కుంటున్నారు. మాస్టర్జీ నాయకత్వం పేరుచెప్పి సిక్కులకు లభించినదల్లా వర్గతత్వం. సిక్కులలో ఇప్పుడు మూడుశాఖలు తయారయాయి. అకాలీ సిక్కులు, జాతీయసిక్కులు, ఎస్. జి. పి. కమిటీ సిక్కులు.

* * *

ఒరిస్సాలో ప్రభుత్వం నడపడానికై కాంగ్రెసు రాజనీతితంత్రజ్ఞులు అక్కడి గణతంత్ర పరిషత్తుతో చేతులుకలపాలని నిశ్చయించి అంతపనీ చేసేశారు.

"పార్టీ పాలిటిక్స్ ఇన్ ఇండియా" అనే పుస్తకంలో మైరన్ వీనర్ అనేఆయన, ఈ పరిషత్తు గురించి రాసినమాట: "ఈనాటి ఒరిస్సా మాజీసంస్థానాల సమ్మేళనం, సంస్థానబలం పోతూఉండగా, వాటి పాలకులంతాకలసి కట్టుగాకట్టుకున్న పార్టీయే గణతంత్ర పరిషత్." దీనికి అచ్చ తెనుగులో అనువాదం: కాంగ్రెసువాళ్లు, కత్తిలేని మితవాదులతో కలిసి ప్రభుత్వం పెడుతున్నారు అని. ఈ జరిగిన కథకన్న, దీన్నిబట్టి జరుగబోయే కథగురించే ఇక్కడఅంతా చర్చించుకుంటున్నారు. వచ్చే జనరల్ ఎన్నికల ఫలితాలు ఫలానావిధంగా ఉంటాయని ఇప్పుడు ఢంకామీద దెబ్బకొట్టి చెప్పడం కష్టమైనా, కాంగ్రెసు ఘనవిజయం విషయం మటుకు అనుమానంగానే ఉంది. అన్నిరాష్ట్రాలలోను కాంగ్రెసుకు మెజారిటీ లభిస్తుందా అన్నవిషయంలో కాంగ్రెసువాదులే మాటలు నానుస్తున్నారు. కాకపోతే, ఏం జరుగుతుంది అన్నప్రశ్నకు ఈనాటి ఒరిస్సా తంత్రం సమాధానాన్ని సూచిస్తుందని స్థూలంగా అనుకోవచ్చు. అయితే రాబోయే మిశ్రమ ప్రభుత్వాలలో కాంగ్రెసు ఎవరితో కలుస్తుంది? కమ్యూనిస్టులతో కలిసేందుకు వీలులేదు. కమ్యూనలిస్టుల(మతతత్వవాదులు)తోకూడా అంతే. ఆ రెండూ కుదరవు... ఆపైన యథాప్రకారం కాంగ్రెసు ఒకవంక అపరిమిత మితవాదులతో భుజాలు రాసుకుంటూనే మరోవంక సోషలిజంలో దేశవాళీనిజంగురించి మితంగా అమితంగా ఉపన్యాసాలు చేస్తూనే ఉంటుంది.

ఒరిస్సాలో ప్రభుత్వస్వరూపాన్ని వివరిస్తూ మొన్న సోమవారంనాటి విలేకరి గోష్ఠిలో ప్రధాన మంత్రి చెప్పినమాటలు: పరిషత్తుతో కలసి ప్రభుత్వం నెలకొల్పాలన్న ఆలోచనను ఒరిస్సా శాసనసభ కాంగ్రెసు పార్టీ సభ్యులు యావన్మందీ ఆమోదించారు. ఒక్కరుకూడా కాదనలేదు. మేము ఈ సమస్యను ఈ విధంగా పరిష్కరించడానికి ఈ అంశం చాలా దోహదం చేసింది. అక్కడ అసలు వాళ్ళంతా ఇలా ఒకమాటమీద నిలబడ్డపుడు, — ఏవో పెద్ద పెద్ద నీతినియమా



కథ కాని కథ



అనుపమానోపమానం

వినాయకచవితిరోజున పూజ ముగించి భోజనాలకి కూర్చున్నాం. మా అమ్మాయి చెళ్ల సీతమ్మకి హఠాత్తుగా ఒకసందేహం వచ్చింది. 'మరీ, నాన్నా, ఇందాకా కథలోనూ చవితి చందురుణ్ణి చూడకూడదన్నావుగదా, మరి వాను వాడెలా వుంటాడు అసలూ" అంది.

నా పిల్లలు అని తెలివిగా నవ్వుకుని ఆ సాయంత్రందాకా ఆగమ్మా చూపిస్తాను అన్నాను. అలా వల్లకాదు ఇప్పుడే చెప్పాలిఅని పంతంపట్టింది సీత. 'ఇలా ఉంటాడమ్మా' అని గాలిలో వేలు తిప్పి చూపించాను. దానికి బోధ పడలేదు. తరవాత నేలమీద సిటికెతో గీసి చూపాను. దానికి నచ్చలేదు. అప్పు నిన్నరాత్రి చందమామలా ఉంటాడమ్మా అన్నాడు మా బావమరిది. 'నిన్నరాత్రి' చంద్రుణ్ణి సీత చూడలేదు. చూసినా గుర్తు రాలేదేమో. దాని పంతం చూసి తల్లి కసురుకోవడం, అత్తగారుకోడల్ని మందలించడం, నేను 'ఊఁ' అనడం మా బావమరిది ఏంతోచక చిర్రిచిర నవ్వనవ్వడందాకా కథ ముదిరింది. నాకేం పాలుపోలేదు.

"జీడిపప్పులా ఉంటాడే సీతా" అన్నాడు మా పెద్దబ్బాయి(విశాఖవాడు) హఠాత్తుగా.

నేను తెల్లబోయి తేరిపారచూశాను. పరమాన్నంలో జీడిపలుకుతీసి చెల్లెలికి చూపిస్తున్నాడు వాడు.

తనూ పరమాన్నంలోంచి ఓ జీడి పలుకుతీసి చూసుకుని సీత సంతోషంగా నవ్వింది.

మా అబ్బాయి అయితే అయ్యాడు గాని, ఇంతవరకూ నేనెక్కడా ఇంత గొప్ప ఉపమానాన్ని, ఇంతగా ఒళ్ళు ఝల్లుమనిపించేదాన్ని చూడలేదని అప్పటికీ ఇప్పటికీ కూడా నా నమ్మకం. ఆ సన్నివేశాన్ని కూడా ఎప్పుడూ మరచిపోలేను. (—ఆర్.)

చమత్కారిదారి

కొంచెం కారంఉన్న చమత్కారం గల సందర్భం ఒకటి మొన్న తటస్థ పడింది. హాస్యానికి హోల్ ఏజన్సీ పుచ్చుకున్నానని సాధ్యమైనంత తరచుగా అందరికీ జ్ఞాపకం చేస్తు బడాయి పోయే సుబ్రహ్మణ్యేశ్వరరావు గురించిందది. చావు కబురేనా సరే, అందుకు సంబంధం లేనివాడికి చెప్పేటప్పుడు సరదాగా చెప్పాలన్నది, అతని కెండా. చెప్పగలనని అతని తాత్పర్యం. ఒకసారి పలుగురం మాటాడుకుంటున్నప్పుడు హాస్యం గురించి చర్చవచ్చింది. మనలో హాస్యం అంటేలేదు. 'ఇదిగో నువ్వన్నిటా జొరబడకు. అలా అక్కడ ఉండు. నేను చెప్పినప్పుడు నవ్వు గాని' అంటూ మన పూర్వీకులు దాన్ని దూరంగా ఉంచారు అన్నాడొక సీమటపాకాయ దూకుడుగా. "పోను మన నాటకాలనీ వాటినీ వేదాలనీ, ఉపనిషత్తులనీ, భారతానీ, భాగవతాన్ని హాస్యంగా రాసి చూడండి చూదాం" అని పేలిందింకో టపాకాయ. "మరే. ఇంపాసిబుల్. ఆఖరికి నా అంత గొప్పవాడు కూడా వాటిని హాస్యంగా రాయలేడు" అన్నాడు సుబ్రహ్మణ్యేశ్వరరావు వెకిలితనానికి హుందాగా అభినయం పడుతూ.

"ఛ ఛ. నీకు అసాధ్యం ఏమిటిరా. నువ్వు గొప్పవాడివి కాబట్టి, ప్రయత్నిస్తే రాయలేకపోవు. అసలు అందాకా ఎందుకు. నువ్వు ఉపనిషత్తుల గురించి రాయడమనేది ఒక పెద్ద జోక్ కదా. ఇంక, రాసేస్తే హాస్యం కాకేం చేస్తుందిటా" అన్నాడు మా నరసరాజు కారంగా వెటకారంగా.

* * *

పైన పేర్కొన్న తరహా మధుర మనోహర సన్నివేశాలూ, గమ్మత్తులూ మీ దైనందిన జీవితంలో ఎన్నో తటస్థపడతాయి. అవి గుర్తుచేసుకుని, జరిగినప్పుడు పోల్చుకుని రాసి పంపండి. ముఖ్యమైన షరతు: రాసేవి జరిగినవే అయి ఉండాలి. ఒకరిని, నొప్పించేవి, అవమానించేవి కాకూడదు. సాధ్యమైనంత క్లుప్తంగా చెప్పాలి. వారపత్రికలో ఒక కాలమ్‌కు మించకూడదు. ప్రచురించేవాటిలో ఉత్తమమైనదానికి పదిరూపాయలు బహుమతి. "కథకానికథ" శీర్షికకు అని మీ కవరుమీద స్పష్టంగా వ్రాయండి. పై వారమే ఆరంభం.

న్యూఢిల్లీ లేఖ


లకు దెబ్బ తగిలితేతప్ప—మేము (అధిష్ఠానవర్గం) వాళ్ళమాట కాదనడం అనవసరంగా కలగజేసుకొని శాసించడం అవుతుంది"!

* * *

కేంద్రమంత్రివర్గాన్ని ఒక్కసారి కుదుపాయించి, శాఖాచంక్రమణాలు [illegible]రని అనుకుంటున్నారు. గాలిమేడలు కడుతున్నారు. ఈ గాలిమేడలకి ఆధారభూతమైన "నేలమేడ" ఒకటి ఉందన్న సంగతి పాఠకులకు తెలుసు. శ్రీ పండిట్ పంత్ ఉపప్రధాని కావడం; దేశీయాంగ శాఖను వదలివేయడం. పంత్ జీ ఇపుడు గట్టిగా కోలుకున్నారు. ఆస్పత్రి నుండి ఇంటికి వచ్చారు. కాని, ఇపుడప్పుడే పని జోలికి పోరాదని విశ్రాంతి అవసరమనీ డాక్టర్లు చెప్పారు. ఆయన అలా తొందర పడకుండా ఉండడం, దేశశ్రేయస్సు దృష్ట్యా చాలా ముఖ్యం. ఈ నాడు దేశానికి ఆయనతో చాలా పని ఉంది.

కాగా, ఆరోగ్యం దృష్ట్యా, ఆయన హోం శాఖను వదలి, ఉపప్రధాని అవుతారు అన్న ఊహాగానంలో, స్వరకల్పన పరిశీలించదగినది. ఆ పరిస్థితిలో ఆశాఖను లాల్ బహాదూర్ శాస్త్రిగారికి ఇస్తారని అనుకుంటున్నారు.

(11-వ పేజీ చూడండి)



తలపుల మలుపుల్లో...

యం. జానకీరాణి

నారాయణరావు ఆఫీసు విడిచేసరికి మునిమాపు వేళైంది. ఎంత మహాపట్నంలో, ఎంతమంది ఆప్తులమధ్య వున్నా, ఎంత సందడిలో వున్నా దిగులుగా వుండే సమయమిది. రుక్మిణి ఏం చేస్తుంటుందో అనుకున్నాడు. రిక్షా త్వరగానే పోతోంది. కానీ తన మనస్సే దానిని అధిగమించి, ఒక గజం, రెండు గజాలు, ఒక ఫర్లాంగు ముందుకు పరుగెత్తుతోంది. పూర్తిగా యింటికి చేరినట్లు ఊహించుకోవడం లేదు అతను. ఆ సౌఖ్యం, ఆ ఆప్యాయతా ముందు వూహించుకోవడం, దాన్ని ఊహాలోనైనా అనుభవించేయడం అతనికిష్టంలేదు—ఇల్లాగే రుక్మిణితో కలిసివున్నప్పుడు ఆఫీసు, అక్కడి పని, మెదడుకి పనిచెప్పి కొంపలో పని చేసే సంఘటనలు, మనస్సు చివుక్కుమనే సందర్భాలు వూహించుకోవడంకూడా అతనికిష్టంలేదు. కావాలంటే రెండు వూహాలు చేయగలడు. కానీ చేయడు—చేసుకోడు.

ఆ వాకిట్లోని సన్నజాజిపూలు రెండు త్రుంపుకుని వాసన చూస్తూ, తలుపుకొట్టాడు. తలుపులు తెరుచుకున్నాయి. పదిమాట్లు చెప్పాడు రుక్మిణికి, ఆ ముదురునీలంరంగు జరీ చీర సాయంత్రం పూట కట్టుకోవద్దని—'నల్లగా, మబ్బుపట్టిన ఆకాశం, ఆకాశం చివర్ల మెరిసే మెరుపులు జ్ఞాపకం వస్తాయి. దిగులుగా అనిపిస్తుంది' అని. కానీ వినదు.

తలుపులు తీసిన రుక్మిణి నవ్వలేదు. లోపలికి వెళ్ళి, తువ్వాలు తెచ్చి, తలుపు కర్టెను యిడంగా పుచ్చుకుంది.

★ తలపుల మలుపుల్లో.... ★

"పదండి, స్నానం చేద్దురు గాని. వేళ కంచె యిస్తాను," అన్నది.

"కాఫీ త్రాగి..."

"అల్లా కాదు—మీ మహాలక్ష్మి పిన్నిగారి సత్యం పోయాడని కార్డు వచ్చింది."

నారాయణరావు నిర్ఘాంతపోయాడు.

"సత్యమా? సత్యం! ఏదీ కార్డు?! ఛ్ఛ! పాపం, నిండా పాతికేళ్ళయినా లేవు. ఏం జబ్బో—మొన్న మధ్యనే ఉద్యోగంలో చేరాడని అమ్మ వ్రాసింది." కార్డు చదివి స్నానానికి వెళ్ళాడు నారాయణరావు. ఎప్పుడో చూశాడు అతను సత్యాన్ని. దగ్గరి బంధువులే వినా, ఎక్కువ రాకపోకలు లేవు. వాళ్ళకీ, తమకూ. పాపం సత్యం!

మహాలక్ష్మమ్మగారికి పెద్ద తనంలో ఎంత కష్టం వచ్చిందీ! అన్నట్లు, సత్యానికి పెళ్ళి యిందికదూ?" అన్నాడతను కాఫీ గ్లాసు తీసుకుంటూ.

రుక్మిణి అతని తల తుడుస్తోంది. "మీకు జ్ఞాపకం లేదండీ? అ క్రిందటి వేసవిలో మీరు గుంటూరు వెళ్ళారు—పాపం, కష్టమంతా అపిల్లది. జీవితమంతా ఎల్లాగో! నిజానికి ఆడదానికి భర్తతోడిదే సౌఖ్యం—నూరేళ్ళ జీవితం యిప్పుడే తెల్లారింది" అన్నదామె.

నారాయణరావు తువ్వాలు తీసుకు వెళ్ళి దణ్ణెంమీద ఆరేసి వచ్చాడు.

"ఇంత చిన్న తనంలో భర్తపోతే, ఆ పిల్ల బ్రతుకంతా అధ్వాన్నమే గాదటండీ! మగమహారాజు లైతే......"

"మగవాళ్ళకి మాత్రం లేదంటావా కష్టం భార్య పోతే?" అన్నాడతను.

"ఏం కష్టమండీ? ఏడాది తిరిగేసరికి క్రొత్తపెళ్ళి కొడుకుల్లాగా తయారవుతారు.."

నారాయణరావుకి బాగుండ లేదు యీ మాటలు, ఏమీ కాదు. స్త్రీలకి లోకం సానుభూతి ఎక్కువగా వుంటుంది. 'అయ్యో ఆమె పసుపు, కుంకుమ' అని అంతా కన్నీళ్లు కారుస్తారు. ఓదారుస్తారు. ఆ ఓదార్పువల్లనే ద్విగుణీకృత మౌతుంది, వితంతువు దుఃఖం. మగవాడి కంటావా? ఎంతబాధైనా అగ్ని పర్వతం లాగా లోపల్లోపల యిముడ్చుకోవలసినదే." నారాయణరావు గుక్క తిప్పుకునే నిమిత్తం సిగరెట్టు తీశాడు. రుక్మిణి ఒక్క నిముషం అతనివంక చూసి లోపలికి వెళ్ళింది.

సిగరెట్టు అంటించుకున్నాడతను. అతనికి తెలుసు రుక్మిణి లోపలకువెళ్ళి ఏంచేస్తోందో లోపలగిన్నెలు, గరిటెలు, పెపు చప్పుళ్ళవుతున్నాయి. కానీ వీటన్నింటికంటే ఎక్కువ వేగంగా, విరామంలేకుండా రుక్మిణిమెదడు పనిచేస్తోందని తెలుసు నతనికి. తను యిప్పటి మాటలనుగురించి ఆలోచిస్తోంటుందామె. 'ఈయన చెప్పిన దానిలోకూడా నిజంవుందా?' అని పరిశీలిస్తుంది కొంచెం వ్యవధి తీసుకుని నారాయణరావుకళ్లు సగం మూసికొని ఆకాశంకేసి, నక్షత్రాలకేసి చూశాడు. అతనికి బాగుంది రుక్మిణిపద్ధతి. తనలో తెల్లారిలే స్త్రీ మెలిగేవారంతా యింత ఆలోచనశక్తి, ఓపిక కలిగినవారైతే ఎంత బాగుండును! తనకి ఎంతపేరువచ్చును 'మనిషిగా' అనుకున్నాడు.

"మీరు అంటారు కానిండీ, నిజంగా ఆడవాళ్ళ కున్నంతకష్టం మగవాళ్ళ కుండ దండీ! ఆడవాళ్లకైతే జీవితాని కంతకీ ఆధారం పరమావధి భర్తమాత్రమే..." పెద్ద మాటలు వాడగలిగినందుకు ఆశ్చర్యపోతూనే మాట్లాడింది రుక్మిణి"...కానీ మగవాళ్లకి, ప్రపంచంలోని అనేక వ్యసనాలలో భార్యతో కాపురంఒకటి. 18 ఏళ్ల పెండ్లైన పిల్లకి, భర్త ముక్కుమొహం తెలిసినా తెలియకపోయినా, అతనే తనజీవిత సర్వస్వం అనుకుంటుంది. కానీ 22 ఏండ్ల మగవాడికి అల్లాకాదు. అగ్నిసాక్షిగా పెళ్ళాడిన స్త్రీ తనకు పరాయిదే అనుకుంటాడు. ఆమెను చూడకపోతే"...

అరంతేని వాదనచేస్తే, అతను నవ్వు తాడని అట్లాగే నవ్వాడు ఇప్పుడు.

రుక్మిణి కిటికీదగ్గర నిల్చుని బయటకు చూడసాగింది.

"చూడు రుక్కూ! మీ ఆడవాళ్ళందరికీ తమకే జీవితంలో ప్రేమించేశక్తి వున్నదని ఒక గర్వం. ఆత్మార్పణం చేసుకోగలమని ఒకధీమా. మగవాడు సాగరునిలాగా తనలో తానే ఘోషపెడుతూ, బాధని ఎప్పటి కప్పుడు వెనక్కులాక్కుంటూ వుంటాడు. ఎవరికి తెలుస్తుంది అతని హృదయంలోని బాధ. స్త్రీకి తన భర్తనిగురించి ఎన్ని తీయని కలలు, మధురమైన, పవిత్రమైన ఆలోచన లుంటాయో, ముఖంచూడకపోయినా తన భార్యఐన వ్యక్తినిగురించి పురుషునికి అన్ని ఆలోచన లుంటాయి.

నిత్యజీవితంలో అతను పాల్గొనవలసిన కార్యక్రమాలు, వ్యాపకాలు ఎక్కువ కాబట్టి, జీవితాన్ని స్తంభీభూతం చేసుకో లేడు పురుషుడు" అన్నాడతను.

"మగవాళ్ళు దినచర్యలో మర్చిపోతారు అన్నీ. వారి హృదయాలకి తీరికుండదు బాధపడ్డానికి" అన్నది రుక్మిణి.

"అంత ఇదిగా తీసిపారేయకు రుక్కూ, ఆడవాళ్ళకి దుఃఖంపొందే సావకాశం ఎక్కువగా వుంటుంది. బాహ్యాలంకరణ విషయంలో మనవాళ్లు విధించే ఆంక్షలను బట్టికూడా. వితంతువు జీవితం దుర్భరమైనదిగాను, ఆమెదుఃఖం భయంకరమైనదిగాను కనుపిస్తాయి."

రుక్మిణి అందుకుంది. "అదే నేననేది. స్త్రీకి జీవితంలో ఆ దుఃఖం అన్నిటినీ మించి పెనుభూతమై, ఆమెను పీల్చి పిప్పిచేస్తుందనీ—పురుషునికి ఎన్నటికీ అల్లా కానేరదనీ—" ఇంక వాదన లేదని చెప్పడానికి సూచనగా ఆమె నావిట్లో దీపంవేసి, అతని చేతికి పత్రిక నందించింది.

ఒక గంట గడిచాక నారాయణరావు లేచి వెళ్ళి, డ్రాయరులోంచి కార్డులుతీసి, మహాలక్ష్మమ్మగారికి, తనతల్లికి, సత్యం మామగారికి ఉత్తరాలు వ్రాశాడు. అవి పోస్టుచేయడం మర్చిపోకుండా వుండే నిమిత్తం, తను

మున్నాడు ధరించబోయే లాల్చీ జేబిలో దాచాడు.

ఆ తరువాత వంటింట్లో పీట వాల్చుకుని రుక్మిణిని చూశాడు. విసుగు లేకుండా ఆమె చేసే పనులను చూస్తూ, ఆమెతో ఏవో కబుర్లు చెప్పాడు. ఆమె వడ్డించేలోపున, పెరట్లోకి వచ్చి, అల్లుకున్న సన్నజాజి తీగనున్న పూలన్నీ కోశాడు. వెండిగిన్నెలో వాటిని పోసి, దారపుబంతి, సూది తెచ్చి అందులో వుంచాడు. తను పూలు గుచ్చిగానీ తీరిక లేకుండి రుక్మిణి. అందుకని అతను పూలు గుచ్చుతుంటా, వాటిని చూసి, ఆనందంతో, మనసుతో కళ్ళు మూసుకొన్నాడు. రుక్మిణి కేకేయగానే వెళ్లి భోజనం చేశాడు.

*   *   *

ఉదయం పదకొండు గంటలకి ఏష్ట్రే ఖాళీచేసింది రుక్మిణి. కాగితంలో దాన్ని దులిపి, నాలుగు సిగరెట్టు ముక్కలు లెక్క పెట్టింది. కాగితంతో సహా చెత్తబుట్టలో పారేసి, సోపుతో చేతులు కడుక్కుంది. పోర్టికోలోకి వచ్చింది – చుట్టు ప్రక్కల ఇళ్లలో మనుష్యులున్న అలికిడి కూడా కావడంలేదు. రోజూ యింతే, మగవాళ్ళు ఆఫీసులకి వెళ్లేసరికి, ఇల్లా వప్పబడి, నిశ్శబ్దమైపోతాయెందుకో యీ ఇళ్ళు అనుకుంది.

నారాయణరావు డ్రాయరు, అలమారు చాలా చెత్తగా వున్నాయని రుక్మిణి కొన్ని రోజులుగా అనుకుంటోంది. డ్రాయరు తీసి క్రిందపడేసి, దులిపింది. అలమారులో పుస్తకాలన్నీ తీసి ఒక్కటొక్కటే దులిపి, అలమారు చీపురుతో తుడిచి, క్రొత్త కాగితాలు పరిచింది. పుస్తకాలలో మరీ అట్టలు మాసినట్టున్న వాటికి బ్రౌను పేపరు అట్టలు వేసింది. పుస్తకాలన్నీ సర్దింది.


12-30 కి మళ్ళీ సోపుతో చేతులు కడుక్కొని పడకగదిలో వాలింది. ఎదురుగా స్టూలుమీద వున్నది నిన్నటి పోస్టుకార్డు. వంగి, అది తీసుకుని మళ్ళీ చదివింది రుక్మిణి. తను ఎన్నడూ చూడని సత్యంభార్య – ఆ పదిహేనేళ్ళ కన్య మెదిలింది మనస్సులో పాపం–పదోరోజు కాబోలు యీనాటికి. కార్డు వెనక్కి త్రిప్పి, నారాయణరావు పేరు, చిరునామా చదివింది. 'పోస్టుముద్ర ఎంత నల్లగా, మొద్దుగా పడిందో – ఇదే విచారంగా కనిపిస్తోంది,' అనుకుందామె.

పోయింది సత్యం కొంట్టి తమవాళ్ళకి వచ్చింది వార్త. అతనికి సత్యంభార్య వార్త తనకు తెలియజేశాడు. 'నిజం! ఆ అమ్మాయికి యీ దుఃఖంకంటే మరణమే మేలు,' కార్డు స్టూలుమీద పడేసి, వెనక్కి వ్రాలింది రుక్మిణి.

సన్నజాజి పందిరివంక చూస్తే ఆమెకు నారాయణరావు జ్ఞాపకం వచ్చాడు. ఆఫీసులో యీపాటికి ఏంచేస్తుంటారో! ఏంచేస్తేనేం, సాయంకాలం యింటికి వస్తూనే తనని చూసి, అన్నీ మర్చిపోతారు. అమావాస్య రోజుల్లో కూడా చీకటి పడితే గానీ, కోయరు సన్నజాజులు. ఎన్నిమార్లు చెబుతాను, పురుగు, పుట్ట వుంటాయని, కాని వినరు. 'నీకు సన్నజాజులు తప్ప మరోక పువ్వు పనికిరాదు' అంటారు. 'సాయంకాలం కాగానే సన్నజాజులు లేకపోతే నువ్వు శోభించవు' అంటారు. ఏమిటో!"

రుక్మిణి కళ్ళు విప్పుకుంది. ఆమె కాలు తగిలి స్టూలు, తలక్రిందులై, క్రిందపడిపోయింది. వంగి, స్టూలు సరిచేసి, మళ్ళీ ఆ కార్డు తీసుకుంది. 'మరణం చెప్పి వస్తుందా. వయస్సుతో నిమిత్తం వున్నదా! ప్రపంచంలో ఒక మనిషి ఎంతవరకు ఉపయోగకరం అని గమనించి వస్తుందా మృత్యువు! విచిత్ర కథలో!'

సన్నజాజి పందిరి, నారాయణరావు తన కళ్ళల్లో మెదలగా రుక్మిణి ముఖం వెలవెల పోయింది యీ ఆలోచనలో. తనుపోతే! అప్పుడు–తను లేకపోతే! ఆ లోచన తన మరణాన్ని గురించే కొంట్టి ఏ విధంగా



★ తలపుల ముళ్లలో... ★

పాడు ఆలోచన అనిపించలేదు రుక్మిణికి.

'సాయంకాలం ఆయన వస్తారు యింటికి. వన్నెజాజి పందిరి చూస్తుంటే, తనే జ్ఞాపకం వస్తుంది ఆయనకి!

రుక్మిణి లేచికూర్చుంది. వణికే వేళ్లతో కాగితీసి, నారాయణరావు వ్రాయబోయిన ఉత్తరం పరిశీలించింది.

'పుస్తకాలన్నీ దుమ్ము కొట్టుకుని వుంటాయి. సర్వశాస్త్రాలకీ ఆయనా దుమ్ము పుస్తకాలనే, తన అందమైన వేళ్ళతో తీసుకుని, పేజీలు తిరగేస్తారు. ఆ పేజీల మధ్య దేని కోసమో వెతుకుతారు. కాఫీ త్రాగుదురుగాని లేవండి అనరెవ్వరూ.'

రుక్మిణిలేచి, కాగితం చేతికి తీసి, చించేసింది. ముక్కలు చేసి అవతల పారేసింది. తొలిబట్టలు ఆరేయేమోఅనుకుంటూవెళ్లింది. ఆ అనుకోవడంలోనే మిళితమై, ముసురు కుంటున్నాయి ఆలోచనలు. మనస్సులోని ఆలోచనలు రెండుపొరలుగా వున్నాయి. పైపొరలోంచి స్పష్టంగా కనిపిస్తోంది రెండోపొర. తీసివేద్దామంటే పోనిపొరఅది.

'దొడ్లోని నీలంచీర-ఈచీర ఏమౌతుంది తను లేకపోతే— ఈ చీరను చూస్తూనే బావురుమనరూ ఆయన?' రుక్మిణి కళ్లలో నీళ్ళు తిరిగాయి. అతను మెరుపుతీగలన్నజరీ పోగులు చెదిరాయి ఆమె కళ్లముందు.

చీరతెచ్చి లోపల వదేసింది రుక్మిణి. 'వద్దంటుంటే వినక తీయించారు ఆ ఫోటో. తనకసలే ఫోటోఅంటే బెరుకు. అలాంటిది ఆయన వెంటవుండి తీసుకవెళ్లి, స్టూడియోలో వాళ్లంతా నవ్వేంత హంగామా చేసి తీయించారు ఆ ఫోటో. ఫోటో తీస్తోంటే, తన ఎదురుగానిలబడి, తన ముఖాన నవ్వు, సిగ్గు మెరిసేట్లుగా చేశారు. తన కళ్లలో మెరుపులు, పెదవులపై పోయిన చిరునవ్వు-జీవితంలోని ఆనందమంతా నాదేనేమోఅన్నట్లుంది ఆ ఫోటోలో తను. దానిని ఎన్లార్జి చేయించి, టేబిలుమీద పెట్టుకున్నారాయన. టేబిలుమీద వున్న తనని చూసి ఏమైపోతారు? పిచ్చివారైపోరూ? ఆ కళ్లలో మరో స్త్రీని చూడడం సాధ్యమా ఆయనకి." అపోటోలో మనిషి తనని రాకమ్మని పిలుస్తోందనుకుని, పిచ్చిమనిషిలా పరుగులు పెడతారు..."

రుక్మిణి మంచంమీద వ్రాలిపోయింది. ఆమెకి అపుకోరాని దుఃఖంవస్తోంది. ఈ గోడలు, తలుపులు, కర్టెన్లు అన్నీ నారాయణరావుకి హృదయవిదారకంగా గోచరిస్తాయి. ప్రతివస్తువు తనని గురించిన స్మృతులు రేపుతూ, ఎడతెరిపిలేని గాయాలు చేస్తుంటుంది మనస్సులో.

దిండులో ముఖందాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది రుక్మిణి. భర్త దీనవదనం, జుట్టు రేగిపోయి, గడ్డం పెరిగిపోయిన అతని ముఖం కనిపిస్తోంది. మూర్తీభవించిన శవంలా వున్న అతని మూర్తి నిలుస్తోంది. ఎంతోసేపు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయింది రుక్మిణి.

* * *

ఆ సాయంకాలం నారాయణరావు రిక్షాలోఎక్కి, పరుగులుపెట్టే మనస్సుతో యింటికి వచ్చారు. వన్నెజాజితీగకి క్రింద

ానికి మొగ్గలు కనుపించక, తలుపుతట్టాడు. ఎవరూ తీయకనే తెఱుచుకొన్నాయి అవి. సావిట్లో తన టేబిలుదగ్గర కూర్చునుంది రుక్మిణి. ఆమెనుచూసి 'అమ్మయ్యో' అని నిట్టూర్చాడు. నారాయణరావు ఎఱ్ఱ జరీ అంచు తెల్లని చీరకట్టుకుంది ఆమె. ఆమె తల్లో నిగ్గునిగ్గుగా, నవ్వబోతూ వున్నాయి సన్నజాజులు.

తలుపు చప్పుడుకి వెనక్కి తిరిగింది ఆమె. తెల్లగా, చల్లగా నవ్వి, కాఫీ తెచ్చి యిచ్చింది.

"రుక్కూ, రోజూ యీ ఘోరవార్తలు ఏమిటో నాకు అర్థంకావడంలేదు. నా చిన్ననాటి స్నేహితుడు, సూర్యనారాయణ అని చెప్పేవాడిని చూడు–అతని భార్య పోయిందట పాపం.. "

రుక్మిణి మౌనంగా, అతను కిందపెట్టేసిన గ్లాసు తీసుకుని లోపలికి వెళ్ళింది. నిన్నటి సంభాషణ మెదిలింది నారాయణరావు మనస్సులో. అలాంటి వాదనచేసిన రుక్మిణి మనస్సుకి ఏంపడుతుంది యీ వార్త? సూర్యనారాయణని యీపాటికి పెళ్ళిపీటలమీద వూహించుకుంటూ వుంటుందామె. ఆమె దృష్టిలో భార్యపోయిన పురుషుడు దుఃఖంతో క్రుంగిపోడు... ప్చ్, అనుకున్నాడు నారాయణరావు.

అతను లోపలికి వెళ్ళేసరికి, ఆమె వంట ప్రయత్నంలోవుంది. "ఆ సూర్యనారాయణని తలుచుకుంటే దిగులుగావుందండీ పాపం మగాళ్ళకేంలే అనుకుంటుంది లోకం కానీ–పాపం! ఎవరికేం తెలుస్తుంది వాళ్ళబాధ," అన్నది మెల్లిగా.

అప్పుడే వర్షించి, వెలిసిన ఆకాశంలాగా, నిర్మలంగా వున్నాయి ఆమె నయనాలు. నారాయణరావు ఆమెవంక కాస్సేపు, మౌనంగా చూశాడు.

"నిజమే మరి!" అనేసి సావిట్లోకి వచ్చేశాడు. రుక్మిణి యీ విషయాన్ని గురించి యిప్పటి కిప్పుడే ఆలోచించిందో, లేక ముందే ఆలోచించి పెట్టుకుందో అతని కర్థంకాలేదు. ప్రశ్నార్థకంగా ముఖం పెట్టుకుని కూర్చున్న, అతన్ని, టేబిలుమీది ఫోటో లోని రుక్మిణి, చిరునవ్వుతో పలకరించింది. ఏమిటీ పలకరింపు అని మరింత ప్రశ్నార్థకమైంది అతని ముఖభంగిమ. ★

న్యూఢిల్లీ లేఖ

[6-వ పేజీ తరువాయి]

ఇది సంభవమే అనిపిస్తుంది. మిగతా 'గుణింపులు' మాత్రం అంత సమగ్రవితగా తోచవు. ఒక పుకారు ప్రకారం, శాస్త్రీజీ హోంమంత్రి అయితే అపుడు వాణిజ్య పరిశ్రమల శాఖను విడగొట్టి, పరిశ్రమలను ఉక్కుశాఖలో జోడిస్తారని తెలుస్తోంది (వాణిజ్యం లేకుండా కేవలం పరిశ్రమలకు ఒకశాఖపెట్టాలని లోగడ ఒకసారి ప్రయత్నించి చూసి చాలా ఇబ్బందు లున్నాయని తేల్చారు.)

ఆపైన, ఉక్కు, ఇంధనాలు, గనులశాఖలోంచి ఉక్కును వేరుచేసి ఒకశాఖ,మిగతా రెండిటితో మరొకటి పెడతారట. అపుడు కేంద్రమంత్రి సర్దార్ స్వరన్‌సింగ్‌కు వాణిజ్యం, పరిశ్రమలు, కంపెనీలా, ఉక్కు శాఖలను ఒప్పగిస్తారట. ఇంధనాల గనులశాఖమంత్రి కె. డి. మాలవీయను స్టేట్ మంత్రి హోదా నుండి మంత్రివర్గ సభ్యుడి హోదాకు (కాబినెట్ మినిస్టర్) పెంచుతారట."అసాధ్యం" అనే మాట అవివేకుల నిఘంటువులో ఉంటుందని నెపోలియన్ అంటే అన్నాడుగాని ఈ "ఊహలు" చూట్టానికే బాగులేవు. ఇవి జరుగుతా యనిపించదు.

పండిట్ మాలవీయా సంగతిచూద్దాం. ఈరోజున కాబినెట్ మంత్రులు పదముగ్గురున్నారు. వీరిలో ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు ఐదుగురు. విదేశీ వ్యవహారాలు, దేశీయాంగశాఖ వాణిజ్యం, పరిశ్రమలు, ఆహారం, వ్యవసాయం, నీటి పారుదల, విద్యుచ్ఛక్తిశాఖలు వీరిచేతుల్లో ఉన్నాయి. ఈ విధంగా యు. పి. వారు ఐదుగురు ఇన్ని ముఖ్య శాఖలపై అధిపత్యం వహిస్తే, అటు దక్షిణాదిన తమిళనాడు నుండిగాని, ఆంధ్రప్రదేశ్ నుండిగాని, ఒక్కరుకూడా ఇక్కడలేరు. రక్షణమంత్రి కృష్ణమీనన్ బొంబాయి ప్రతినిధి. కె. సి. రెడ్డి మైసూరు తరఫు. ఇలాంటి స్థితిలో ప్రధానమంత్రి మరొక ఉత్తర ప్రదేశ్ మంత్రి (మాలవీయ)కి కాబినెట్‌లో చోటు ఇచ్చి దక్షిణ భారతంలో మరింత అసంతృప్తి కలిగిస్తారా?

ఇక, సర్దార్ స్వరన్‌సింగ్ చాలా గట్టివాడే. మంత్రివర్గంలో ఆయన చేరినది సిక్కుల ప్రతినిధిగా. కాని ఒక్కటేచిక్కు ఆయన నిజంగా సిక్కుల ప్రతినిధేనా? అని. అయితే, పంజాబులో సిక్కుల చిక్కులు పోగొట్టడానికి ఏమి సేవ చేశారు అని. ఈ దృష్ట్యా ఆలోచిస్తే ప్రధానమంత్రి సర్దార్‌జీకి నాలుగు శాఖలు ఒప్పచెబుతారని తోచదు.

ఇంతకీ మొట్టమొదట్లో చెప్పినట్టుగా పండిట్ పంత్ ఉపప్రధాని అయి, ప్రత్యేకంగా ఏ ఒక శాఖను చూడరు అన్నవదంతి మీదనే ఇదంతా ఆధారపడి ఉంది. ఆయన గనక యథాప్రకారం హోంశాఖ నిర్వహిస్తే కథేలేదు. ★

★ రాజధాని కబుర్లు ★

(9-వ పేజీ తరువాయి)

కాదు. తమతమ కార్యాలయాల అధీనంలో ఉండే కార్లు, కార్యాలయాలలో పనిచేసే ఉద్యోగులు ప్రభుత్వేతర కార్యాలయాలకు ఉపయోగించుకోబడ్డం సమంజసం కాదని తెలపడమే ఈ వాక్యాలు రాయడంలో ఉద్దేశ్యం. కార్మిక పక్ష ప్రధాని క్లెమెంట్ అట్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్ళేటప్పుడు, సొంతకారులో వెళ్ళేవాడట. శ్రీమతి అట్లీ కారు నడిపేదట.

ఇప్పటికైనా సెంట్రల్ స్టోర్ పర్చేజ్ శాఖ అధికారుల అధీనంలో వుండే కారు నాటకశాలల ప్రక్కన కనపడ్డం మానెయ్యాలి. డైరెక్టరేట్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ వారి కారు ఆడపిల్లలను స్కూళ్ళకు తీసుకెళ్ళడం మానెయ్యాలి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు బోర్డువారి జీపులు సినీమాలు చూడ్డం మానెయ్యాలి. ఈ కార్ల ఉపయోగాన్ని గురించి ఊళ్ళో వ్యాపించే పుకార్లు ఎవరికీ లాభదాయకం కాదు.

శ్రీ కృష్ణజన్మస్థానంలోకి ఒక కుర్రకారు షికారు

క్రిందటి మంగళవారం రాత్రి పన్నెండుగంటలకి మలకపేటరోడ్డుపై నిలబడిఉన్న పోలీస్ వైర్లెస్ ఆపరేటర్‌పైకి వేగంగా వస్తూన్న ఒక కారు నడిచింది. ఆపరేటర్ శ్రీ సూర్యనారాయణ వెంటనే మరణించాడు. కారు కంగారుపడి వెనక్కి తిరిగి చూడకుండా పరుగెత్తింది.

కారులో ప్రయాణంచేస్తూన్న వ్యక్తుల్ని మినహాయిస్తే, ఈ ప్రమాదానికి సాక్షులు లేరు. కారు మాయమైంది, కారును పట్టుకోడం నగరపోలీసు శాఖకి ఒక క్లిష్టమైన సమస్య అయింది. సమస్యను నలభైఎనిమిది గంటల్లో పరిష్కరించిన అసిస్టెంటు కమీషనర్ శ్రీ డాయిస్‌ని, ఇన్స్పెక్టర్ బాజ్ పాయిని అభినందించాలి.

కారు పారిపోవడంలో నాబ్ ఊడి క్రింద పడింది. లైట్ ఇండికేటర్ పైన ఉండే నికెల్ గార్డు ప్రమాదస్థలంలో పడిపోయింది. పోలీసులకు ఇవి రెండూ దొరికాయి. కారు నాబ్‌ను బట్టి కారు మెస్త్రీ దుకాణాల్లో దర్యాప్తుచేస్తే అది హిందూస్థాన్ కారని, 1949-1954 సంవత్సరాలమధ్యలో తయారై ఉండవచ్చునీ తేలింది. లైట్ ఇండికేటర్ పైగల రంగును బట్టి, కారు ఆకుపచ్చ రంగుదని తెలిసింది. నగర పోలీసుశాఖ ఆకుపచ్చ రంగు హిందూస్థాన్ కార్లకోసం నగరంతా గాలించింది.

శుక్రవారం నాడు బొలారంవద్ద నున్న లోతకుంట గ్రామంలో దొరికింది కారు. రంగు మార్చడానికి 'కాయదాయ' చేస్తూన్న భగీరథప్రయత్నాలను అడ్డుకున్నారు పోలీసువారు. డ్రైవరు కాయన్న అరెస్టు చేయబడ్డాడు.

కుంభకర్ణుడి పునర్జన్మ, 2.

క్రిందటివారం చిక్కడ్‌పల్లిలో ఉన్న మురికినీటి చెరువు సంగతి ప్రస్తావించాను. అక్కడ మనం నిలవలేం. రోడ్డు మీదకు రండి. సిమెంటు రోడ్డుకి అడ్డంగా అడుగున్నర వెడల్పున మట్టి చారను చూశారా? అక్కడ ఆగండి.

కార్లు, లారీలు, బస్సులు, రిక్షాలు ఇక్కడివరకు వేగంగావస్తాయి. ఒక సెకను ఆగుతాయి. నెమ్మదిగా ఈ చారను దాటుతాయి. మళ్ళీ ఇటువంటిదే మరో ప్రతిబంధకం వచ్చేవరకు వేగంగా పోతాయి.

చిక్కటి సిమెంటురోడ్డు ఉంటుంది. హఠాత్తుగా ఒక ఉదయం పనివాళ్ళువచ్చి గోతులు త్రవ్వుతారు. ఒక రోజు, రెండు రోజులు; ఒకవారం, రెండువారాలు పని చేస్తారు. కొత్త మట్టితెచ్చి పూడుస్తారు. అంతే. వాళ్ళదారివాళ్ళది. ఈమన 'దారి' మనది.

హైదరాబాదును మినహాయిస్తే, మరి ఏ 'నాగరిక' పాలక సంఘంలోను ప్రజల కార్యాలపట్ల, అవసరాలపట్ల ఇంత నిర్లక్ష్యం కనపడదు. విందులుచేయడంలోను, విదేశీ సమస్యల్ని గురించి తీర్మానాలు చేయడంలోను మునిగితేలే నగరపాలక సంఘ సభ్యులకు ప్రజలకార్యాలుచూడ్డానికి తీరిక దొరకదు.

బడీ చావుడీ వద్దనుంచి కాచిగూడా చౌరస్తావద్దకు వచ్చే రోడ్డుపై ఎప్పుడైనా ప్రయాణం చేశారా? చేసే ఉంటారు. ఈ రోడ్డుపై ప్రతి రెండు నిముషాలకి ఏదో ఒక దిశలో ఆర్. టి. సి. బస్సులు పయనిస్తాయి. వందలాది కార్లు, వేల కొలది రిక్షాలు, పయనిస్తాయి. ఈ రోడ్డు గతుకులన్నింటినీ తీయించి, బాగుచేయిస్తే, నగరంలో గుండె జబ్బుతో మరణించేవారు సగం మంది బ్రతుకుతారు. ఇటువంటి రోడ్లు చాలా ఉన్నాయి నగరంలో. ఇవన్నీ ప్రస్తావిస్తే 'సాంకేతిక కారణాలవల్ల' అసంభవం అంటారు శ్రీ కమీషనర్—అక్కడికి మన దేశంలో ఏ ఇతర నగరాన్ని చూడనట్లు.

ఏం చేస్తాం! ★

షెర్లాక్ హోమ్స్ సృష్టికర్త

కానన్ డాయిల్

అపరాధ పరిశోధక కథలు అనంతంగా రచించి, ఇంగ్లీషు సాహిత్యానికి సాటిలేని సేవచేసి, ప్రపంచ ప్రజల ఆదరాభిమానాలను అపారంగా చూరగొన్న డిటెక్టివ్ కథా పితామహుడు సర్ ఆర్థర్ కానన్ డాయిల్ నూరవ జన్మదినోత్సవ సంవత్సరం ఇది


ఆయన 1859వ సంవత్సరం మే 22వ తేదీన జన్మించాడు ఇంగ్లీషు భాషకు ఆయన క్రొత్త మెరుగులు తీర్చి దిద్దాడు ఆయన సృజించిన షెర్లాక్ హోమ్స్ ప్రపంచమంతటా గొప్ప డిటెక్టివుగా పేరుపొందాడు ఈ డిటెక్టివు పరిశోధనలు ప్రపంచ పాఠకులను విస్తారంగా ఆకర్షించినవి అందువల్లనే కానన్‌డాయిల్ మరణించిన తరువాత, అతని కొడుకు ఏడ్రియన్ కానన్ డాయిల్, 'షెర్లాక్ హోమ్స్ నూతన అద్భుత కార్యములు' అని గ్రంథరచన చేశాడు ఈరచనలు కూడా పాఠకులను అపారంగా రంజింపజేశాయి

కానన్ డాయిల్ జీవితచరిత్ర వ్రాసిన జాన్ డిక్సన్ కార్, ఆయనా యిద్దరూ కలిసి గ్రంథాలు వ్రాశారు అనేక కథలు ఆకర్షణీయంగా చెప్పారు షెర్లాక్ హోమ్స్ అద్భుత సాహసకథలు ప్రచురింపబడిన 'స్ట్రాండు' పత్రికలోనే షెర్లాక్ హోమ్స్ నూతన సాహస కథలు కూడా వెలువడినవి 'హోమ్స్' కథలు వెలువడటానికి పూర్వం దేశంలో డిటెక్టివు కథలు లేకపోలేదు కాని యీ కథలకు మాత్రం విపరీతమైన ప్రసిద్ధి కలిగింది

కానన్ డైల్ రచనల్లో పో, స్టీవెన్‌సన్‌ల ప్రభావం కనపడుతుంది

ఆయన కృతిరత్నాలెన్నైవున్నా కాని ఆయనకు విఖ్యాత రచయితగా మాత్రమే ఖ్యాతి కలిగింది హోమ్స్ కథలు 'ది రిటైర్డు కలర్ మాన్' తో పూర్తి అయినవి వీటిల్లో, మొదటికథలలో వున్న బిగువు, జిగి, ఉన్నత పరిమాణములు సన్నగిలినవని కొందరి అభిప్రాయం. ఈ విమర్శల్ని, కానన్ డైల్ గుర్తించాడు పాఠకులకు హోమ్స్ కథలు మామూలై పోవటం వల్లనే, వాళ్ళకు యిలాంటి అభిప్రాయం కలిగినదని ఆయన భావించాడు. ఒక్కొక్క-సారి ఆయన 'హోమ్స్' జీవితాన్ని ముగించి యితర రచనల్లోకి వెళ్ళాలనుకున్నాడు కాని మొదట వ్రాసిన కథలు, తరువాత వెలువడిన కథలు, యీనాడు మళ్ళీ చదివితే, రెంటికీ తేడాలేదని తెలుస్తుంది

కానన్‌డైల్, ధారావాహికంగా షెర్లాక్ హోమ్స్ అద్భుత కథలు మాత్రమే గాకుండా చారిత్రక నవలలు, ఉత్తమకథలు రాశాడు ఆయన అపారమైన శ్రద్ధతో దేశ చరిత్రను చదివాడు తన కథావస్తువునకు తగ్గా తీసుకొని రాగల అతి సూక్ష్మ చారిత్రక అంశములను, వివరాలను సేకరించాడు. ఆయన తన కథలో వివరించిన పాత్రలకు అర్థవంతమైన



వాతావరణమును సృష్టించి, తన పాత్రలలో లీనమైనాడు. ఆయన రచనలలోని నాయక పాత్రలు, ధైర్యసాహసాలు గలవారు. నాయక పాత్రల ఉత్తమగుణాలు పాఠకుల్ని కదిలించి, ఉత్తేజము కలిగించాలని ఆయన కోరిక కాని పాఠకులు మాత్రం ఆయన కథాసంవిధానాన్ని విశేషంగా మెచ్చుకుని పొగిడేవారు ఆయనరచనలోని ఉత్తమ పాత్రలలో జీవం వుంది ఒకవిధమైన హుందాతనము, ప్రతిభ వీటిలో కనుపిస్తుంది ఆయన రాసిన మధ్యయుగాలనాటి చారిత్రకనవలలు చాలా చక్కగా ఉన్నవి వీటిలో 'సర్ నైగెల్'లో ఆంగ్లభాషలో వచన రచన చేయటానికి తగిన ప్రామాణికమైన శైలి వుంది

'హౌండ్ ఆఫ్ ది బాస్కర్ విల్లిస్' హోమ్స్ సాహసకథలలో మిక్కిలి ప్రసిద్ధి గాంచిన ఉత్తమ నవల దీనిలో అద్భుత భయానక ఘట్టములు, ఆలోచనను రేకెత్తించే అపరాధ పరిశోధనలు ఉన్నవి

కానన్‌డైల్ చేసినరచనలన్నిటినీ మొదటినుంచి చివరిదాకా పరిశీలించిన వారికి, ఆయన జీవిత ద్వితీయార్థంలో, ఆధ్యాత్మిక భావంపట్ల కలిగిన ఆసక్తి, దాని ఫలితము కనపడుతుంది దీనికి నిదర్శనము 'హౌండ్ ఆఫ్ బాస్కర్ విల్లిస్'లో కనపడుతుంది

సర్ ఆర్థర్ కానన్‌డైల్ నవలారచనలలో మాత్రమే కాదు, కథా రచనలో కూడా పేరుగాంచాడు, హోమ్స్ కథలవల్లనే ఆయనకు కథారచయితగా అజరామరమైన కీర్తి కలిగింది ఆయనజీవితంలోను, క్రీడలలోను, చరిత్రలోను, వైద్యశాస్త్రంలోను, రాజకీయరంగంలోను, యుద్ధభూమిలోను, శాంతి సమయంలోను, సాక్షీమాత్రంగా వుండిఅనేక ధర్మసూక్ష్మములను తార్కికబుద్ధితో పరిశీలించాడు తనకు కలిగిన విశిష్టానుభవములను తన పాత్రల జీవితములలో చొప్పించి, వాళ్ళనోట పలికించాడు ఆయన తన నిజ జీవితంలోకూడా ఒక డిటెక్టివువలె నిరంతర దీక్షతో కృషిచేశాడు 'ఇడల్జీ' అనే భారతీయుని కేసు సందర్భంలో ఆయన చూపిన ఆసక్తి, జిజ్ఞాసవల్ల, ఒకతని యితరులు తమ స్వార్థంకోసం, న్యాయాన్యాయ విచక్షణ, నైతికంగా మానవత్వపు విలువలు లేకుండా దోచుకోవటాన్ని ఆయన ఎలా గర్హించి

[illegible] మలపల్లి సీతారామారావు

తీవ్రంగా నిరసించిందీ తెలుస్తుంది.

శాస్త్రవిజ్ఞానంలో ఆయనకు గల అపారా శక్తి ఫలితంగా ఆయన లేఖిని నుంచి మనకు అద్భుతమైన కథానికలు వెలువడినవి. ఆంగ్లేయ సాహిత్యంలో కానన్ డైల్ ప్రవేశపెట్టినన్ని భిన్న స్వభావములుగల, భిన్నపాత్రలను, మరి ఏ యితర ఆంగ్లేయ రచయిత సృష్టించలేదు. "గెరార్డ్" వీరోచిత పాత్ర. శాస్త్రవేత్త, మేధావి, ప్రొఫెసర్ ఛాలెంజర్, పైకిమాత్రం కఠినంగా కనపడుతాడు. నైగల్, ఎడ్రిసన్, ఉన్నతభావాలు, ఉదారాశయాలుగల యువకులు. హోమ్స్ మాత్రమేగాక డాక్టర్ వాట్సన్ కూడా మహామేధావి. కానన్ డైల్ సృష్టించిన భిన్న స్వభావములు గల పాత్రలులౌకికవిజ్ఞానమునకు నిదర్శనములు. ఆయన శైలిలో విశిష్టత ఉన్నది. ఆయన ప్రయోగములలో వ్యర్థ పదములు, క్లిష్టమైన పదములు వుండవు. కథారచయితకు ప్రధానంగా వుండవలసిన విస్పష్టత, చెప్పదలచిన విషయాన్ని పాఠకులకు నూటిగా అందీయటంలో నేర్పు, దీనికి ఉపయోగించే భాషలో సరళత, ఆయన రచనలలో సంపూర్ణత్వము పొందినవి. వర్ణన ఆయన కథల్లో చాలా ఆకర్షణీయంగా వుంటుంది. కథను రసవత్తరంగా చెప్పటంలోనే వుంది ఆయన ఉపజ్ఞ. కథా సంవిధానములో ప్రత్యేకత ఉన్నది. అందువల్లనే ఆయన రచనలు ప్రపంచ దేశాల్లోని పాఠకులను లెస్సగా ఆకర్షించినవి. చక్కగా కథవ్రాయటానికి భాషాప్రాభవం ఒక్కటే చాలదు. మనం కళాశాలలో చదివి నేర్చుకున్న భాషకు, కథల స్వభావాన్నిబట్టి పాత్రల, సన్నివేశములనుబట్టి కథలలో ఉపయోగించే భాషకు వ్యత్యాసం వుంది. ఆంగ్లేయ భాషలో చక్కగా చెప్పిన యీ కథలు, సునిశితదృష్టితో చదవటం, వీటిలోని శిల్పసౌందర్యాన్ని ఆనందించడంవల్ల, మన సంస్కారం పెరుగుతుంది. చిన్నతనంలోనే, కానన్ డైల్ రచనలు చదివి ఆనందించిన పాఠకులు నిజంగా అదృష్టవంతులు. ★

అన్వేషణ

పోతుకూచి సాంబశివరావు

(గతవారం తరువాయి)

2

సాయంత్రం ఆరుగంటలు. ప్రయాణంతో అలిసిపోయి ఎదురుగా కనిపించే స్టేషనును చూసి 'ఝుంయ్ ఝుంయ్' మనే నిశ్వాసాలు వగులుతూ మెల్లిగా రైలు నాంపల్లి స్టేషనులో అడుగుపెట్టింది. రైల్వే ప్లాట్ ఫారమ్ మామూలుగా హడావిడిగా సందడిగా తయారయింది. ప్రయాణీకులు, వారిని ఆహ్వానించడానికి వచ్చిన బంధువులు, రైలులోని జనసమ్మర్దం చూసి, ముఖారవిందాల సౌందర్యంతో సంతృప్తిపడి తిరగడానికి వచ్చిన యువకులు ప్లాట్ ఫారంమీద చీమలగుంపుల్లా కదలుతున్నారు. కమలాఫలాలు, అరటిపండ్లు అమ్మే అంగడిబండి, రంగురంగుల నిగనిగల బొమ్మలతో ఆకర్షిస్తూన్న పుస్తకాలు అమ్మేషాపు పనిలేని యువక సమూహాల దృష్టి ఆకర్షిస్తున్నాయి.

"హల్లో రాజా!" పెంకులెగిరిపోయేటట్టు గట్టిగా అరిచి ఆరుఅడుగుల పొడుగైన చక్రవర్తి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ, రాజారావు బుజం తట్టాడు. చక్రవర్తి అరుపుకు ప్లాటుఫారంమీదిజనం ఆశ్చర్యంగా వింతగా అతనివైపు చూశారు. క్రొత్తసవలలు పరికిస్తున్న పొట్టి రాజారావు తనస్నేహితుడు చక్రవర్తి అప్పుడే స్టేషనుకు వచ్చాడని గ్రహించుకున్నాడు. ప్రతి సాయంత్రం కొద్దోగొప్పో విరామంచేసుకుని ఆస్టేషను చూడకుండా ఉండలేని ఆయువకులు ఒకరిని వెతుక్కుంటూ మరొకరు ఆ స్టేషనులో తారసిల్లడం పరిపాటి.

"ఈవేళ రైలు ఎంతసుందరంగా ఉందోయిరాజా!" తనపొడుగాటి చేతులతో రైలుపెట్టెలలోని జనాన్ని చూపుతూ, రాజారావును బలవంతంగా ప్లాటుఫారం మీద నడిపిస్తూ ముందుకు సాగాడు చక్రవర్తి.

తెల్లటి షరాయి, మోకాళ్ళదాకా వేళ్ళాడే తెల్లటి పొడుగుచొక్కా, చెంపలమీదకు పరుచుకువచ్చే ఒత్తుజుట్టు చూడగానే చక్రవర్తిలో ఏదో ఒకవైచిత్ర్యము మాత్రం ఉందని స్పష్టమౌతుంది. రాజారావు ఎదురుగాఉన్న కూల్ డ్రింక్సుషాపు వైపు నడిచాడు.

'ఈ వేడి శరీరానికి చల్లనిపానీయమా మిత్రమా!' నవ్వుకక్కాడు చక్రవర్తి.

'యువకుల హృదయాలు సమశీతోష్ణంగా ఉండాలంటే చల్లని పానీయాలు అవసరముస్వామీ!' మామూలుగా అలవాటైన సంభాషణ పద్ధతిలో రాజారావు సమాధానమిచ్చాడు. డబ్బు రాజారావే చెల్లించాడు.

'నువ్వు నాకుమాత్రం రాజా. నా ఖర్చు అంతా నువ్వే భరిస్తున్నావు! నేను చక్రవర్తినైనా చేతిలో చిల్లిగవ్వలేదు! ఇది మన జీవితం!' జాలిగా నవ్వాడు చక్రవర్తి.

'నాతో ఉన్నంతకాలం డబ్బుగురించి విచారించకు. జీవితం క్షణికం, కనుక అప్పుచేసైనాసరే హాయిగా బ్రతకమన్నారు మన పెద్దలు!' రాజారావు హుషారుగా నవ్వాడు!

'చెప్పితివిగురూ! నిజం చెప్పితివి!' నటకుని భంగిమలో మాటలు వదిలాడు చక్రవర్తి.

తక్షణం గట్టిగా నవ్వేశాడు సహజపద్ధతిలో అతను. 'ఎల్లా ఉంది ప్రపంచం? ఏమిటి వార్తలు?' అలవాటైన ప్రశ్న వేశాడు మళ్ళీ చక్రవర్తి.

'ప్రపంచం గుండ్రంగా ఉంది, ఇంకా. చతురస్రం కావటంలేదు!' అలవాటైన సమాధానమిచ్చాడు రాజారావు.

వారిద్దరు ఆ స్టేషను పాలించే చక్రవర్తుల్లా విశృంఖలంగా తిరగసాగారు.

'మిత్రమా ఒక్కసారి ఆగు!' చక్రవర్తి రాజారావును ఆపాడు.

'ఎవరో ఆ ఒంటరి ఆ యువతి! పాలపిట్టలా ఎంత బాజూకుగా ఉందోయి!' చక్రవర్తి హుషారుగా ఈలవేశాడు.

పువ్వుల వాయిలుచీర కట్టకుని, ఒకచేత్తో చిన్న ట్రంక్ పెట్టె, మరొక చేత్తో చిన్న సంచీ పట్టుకొని, అందమైన గుండ్రని వదనంతో, సన్నని ఎర్రని పెదవులతో విచారరేఖలతో, బిత్తరిచూపులతో మెల్లిగా నడుస్తున్న ఆ యువతి చక్రవర్తి మాటలు విని తల ఒంచుకొని గబగబా అడుగు వేసింది భయంతో.

'ఈ యువతి చరిత్ర పరిశోధిద్దామా మిత్రమా!' చక్రవర్తి రాజారావుకు కనుసైగ చేశాడు.

'నీ బుర్రకు ఆలోచన కల్పించకు ఈరోజు! ఈవేళ నీ కార్యక్రమం నేను నిర్ణయించాను. పద!' బలవంతంగా లాక్కుపోయాడు చక్రవర్తిని రాజారావు. వెళ్ళిపోతున్న ఆ యువతివైపు ఆశగా, కోరికతో చూసి చక్రవర్తి స్టేషనులోంచి నిష్క్రమించాడు.

ఆ యువతి స్టేషనుఆవరణ దాటి బయటికి వచ్చినిలుచుంది. కనుచీకటి పడుతున్న ఆ మహానగరంలో విద్యుచ్ఛక్తి దీపాలు అప్పుడే వెలిగాయి. ముందు తన జీవితాన్ని ఏవిధంగా నడపాలి, ఎక్కడికి వెళ్ళాలి, అనే ఆలోచనలతో ఒక నిమిషం కొయ్యలా అలాగే నిలుచుని పోయింది ఆమె. రిక్షావాళ్ళు చుట్టుముట్టారు. అందరినీ విదిలించుకుంది ఆమె. ఒక్క పావుగంటలో రైలుస్టేషనుముందు జనం మాయమయ్యారు.

ఆలోచనకు ఒక స్థిరత్వం అపాదించుకోవాలని స్టేషనుముందుగా, గుండ్రంగా ఉన్న చిన్న పార్కులాంటి ప్రదేశంలోకి పోయి ఒక తిన్నె మీద కూర్చుంది. ప్రక్క తిన్నెల మీద కూర్చున్న గిరజాల సాహెబు, మరో ప్రక్క వేరుసెనగలు నములుతూ కూర్చున్న టాంగావాడు వింతగా చూశారు ఆ యువతి వైపు. ఎవరినీ చూడకుండా తల ఒంచుకుని ఒక నిమిషం కూర్చుంది. సంచీలోని కథల పత్రిక ఒకటి విప్పి చదువుతున్నట్లు నటించింది. ఆ మసక చీకటిలో వీధి వెలుగు నీడల్లో పత్రికలోని అక్షరాలు కనిపించవనే సంగతి యితరులకు తెలిసినా ఆ పరిస్థితి తప్పనిసరి అయింది ఆ యువతికి. 'ట్రంకుపెట్టెలో ఉన్న నాల్గు రూపాయ

★ అన్వేషణ ★

లన్ యీ మహానగరంలో గడపడం అసాధ్యమైన విషయం. అయినా సాహసించి వచ్చాక ఏదో ఉపాయము ఆలోచించుకుని క్రొత్త జీవితం రూపొందించుకోవాలి. ఎక్కడైనా ఏదో చిన్న పనే దొరక్కపోతుందా!' ధైర్యంగ నిట్టూర్చింది ఆమె.

నిర్మలమైన ఆకాశంలో తారలు మిణుకు్కమన్నాయి. ప్రపంచం, ఎదురుగా ఆకాశంలా అనంతంగా గోచరించింది. ఆనాడు ఉగాది. జీవితంలో క్రొత్త యుగాది ప్రారంభం చేయవచ్చు. ఆశతో చటుక్కున లేచి నిలుచుని పెట్టె, సంచి చేత్తో పుచ్చుకుని పార్కు బయటికి వచ్చింది ఆమె. ఒక కోరమీసాల రిక్షావాడు వచ్చి నిలుచున్నాడు ఎదురుగా. నిశిత దృష్టితో చిరునవ్వుతో ఆమెను పలకరించాడు.

'రిక్షా కావాలా అమ్మా!'

'కావాలి.. ఇక్కడ దగ్గరిలో ఏదైనా సత్రము వుందా?'

రిక్షావాడు ఒక మందస్మితం చేశాడు.

'ఒక మైలు దూరంలో ఒక సత్రము వుంది. తీసుక వెళ్ళమన్నారా?'

'ఊ' అంది ఆ యువతి అనిశ్చితమైన నిర్ణయాలలో అల్లాడుతూ.

రిక్షావాడు పరుగున ప్రక్కకు పోయి రివ్వున లాక్కువచ్చాడు రిక్షా. ఆ యువతి కూర్చుంది. రిక్షామువ్వలు గల్లున మ్రోగుతున్నాయి నడకలో. విద్యుద్దీపాల వెలుగులో జనసమ్మర్దంతో, ఇరువైపుల దుకాణాలతో, హోటళ్ళలోంచి వచ్చే రేడియో పాటలతో, పరుగెత్తే కార్ల మోతలతో ఆ మహానగర వీధులన్నీ సందడిగా ఉన్నాయి. మనుష్య ప్రవాహాలను దూసుకుంటూ రిక్షా రివ్వున పరుగిడుతోంది.

'ఈనాటిరాత్రికి, సత్రవులో పడుకుని సత్రవుగుమస్తా సలహాతీసుకుని భోజన కార్యక్రమం, ఉద్యోగాన్వేషణ చేయాలి. ఈ రాత్రికి భోజనం లేకుండానే పడుకోవాలి!' ఒక నిట్టూర్పు విడిచింది ఆ యువతి.

గత జీవితంలోని సుఖం తలుచుకుని తనబంధువులందర్నీ విడిచి, దేశాలపాలై,వికలమైన మనస్సుతో ప్రజలను చేతులారా దుఃఖభాజనంచేసుకున్నానని ఆవేదనతో ఆమె కన్నీరు కార్చింది. గతానికి పశ్చాత్తాపపడక, ధైర్యంతో క్రొత్త జీవితం దిద్దుకోవాలి అనే విచిత్ర సాహసం ఆమెను ప్రేరేపించింది. లేత హృదయానికి రాతి రూపం యిచ్చి మోటుమనిషిగా మారిపోవాలి అనుకుంటూ మొండిగా కూర్చుంది రిక్షాలో.

ఒకవంతెన మీదుగా రిక్షాపరిగెత్తింది. వంతెనక్రింది నదిలో నీరు కనిపించలేదు. గుబురుగా లేచిన చెట్లు, బండబారిన గుండ్రాళ్ళు, ఎత్తుపల్లాల వలయాకృతిలో మూలమూలగా రాత్రి వెలుగుల్లో ప్రతిఫలిస్తున్న, నీటిగుంటలు, కనిపించాయి. మరుక్షణంలో ఎత్తైన భవనాలు, గోపురాల ఆకారంలో విచిత్రంగా ఉన్న కట్టడాలు, రాతికట్టడాలతో కోటద్వారాల్లా నిలబడిన పెద్ద గేట్లు, ఆమెకు ఆశ్చర్యం కలిగించాయి. వింతగా, విచిత్రంగా నగరంవైపు చూసింది.

'ఈపేట పేరు ఏమిటి?' రిక్షావాడిని ప్రశ్నించింది యువతి.

'చార్ మినార్ అంటారమ్మా!' రిక్షావాడు మరోమాట అనకుండా గబగబ రిక్షా తొక్కుతున్నాడు.

రిక్షాపరుగులో ఒక మైలు దాటిపోయినట్లు స్ఫురించింది ఆమెకు. మద్రాసు నగరజీవితం తెలిసిన ఆమెకు, రిక్షావాళ్ళు, జట్కావాళ్ళు ప్రయాణికులను చేసేమోసం ఆమెకు కొంత అనుభవమే. 'ఏది ఏమైనా, జీవితంలో ఎదుర్కోవలసిన పరిస్థితులు ధైర్యంతో ఎదుర్కోవాలి' అనుకుంది ఆ యువతి.

మరో పదిహేను నిమిషాలు గడిచాక ఒక సందులోకిపోయి రిక్షా ఆగింది. ఆ సన్నటి సందులో విద్యుద్దీపాలు లేక చీకటిగావుంది. వీధిలోని రొచ్చుకంపు, శిథిలమైన మట్టిగోడలపైనుంచి వచ్చే మలినమైన గాలులు, ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాయి.

'గుమాస్తాగారున్నారేమో చూస్తానమ్మా!' రిక్షావాడు లోపలికి వెళ్ళాడు గబగబా ఒక యింట్లోకి.

రిక్షాదిగి నిలుచుంది ఆమె నిరీక్షిస్తూ.

మరుక్షణంలో రిక్షావాడు ఒకముసలి తో ...

రెండు గోడలమధ్య కటిక చీకటిలోంచి చిన్న సందు దారి ముందుకుసాగింది. కమల నడిచింది ఏదో ఆలోచనతో. ఒకక్షణం నడిచాక ఒక చిన్న వరండా, రెండుగదులు కనిపించాయి. ఒకగది వంటిల్లులా ఉంది. రెండవగదిలో వరుసగా పేర్చి గుట్టల్లావున్న కట్టెలు, చూరుకు అడ్డంగావున్న నిలబెట్టి ఉంచిన గడకర్రకు వేళ్ళాడే రకరకాల చీరలు, ఒకమూల కుప్పలాపడివున్న మాసిన బట్టలు, ఒకకాలు విరిగిన పాత టేబిలుమీద స్త్రీ ముఖాన్ని అందంచేయడానికి ఉపయోగించే కృత్రిమసామగ్రి స్నో, పౌడరు, పెదిమెలరంగు మొదలైనవి, నిలువుగా బద్దలయిన నిలువుటద్దం, రెండు నులకమంచాలు కనిపించాయి. వరండాకు దక్షిణంవైపున తడికలు కట్టారు. తడికల్లోంచి విద్యుద్దీపాల కాంతి, ఆ కాంతిలో మసిలే స్త్రీల నీడలు, ఎకసక్కాలాడుకుంటున్న స్త్రీకంఠాలు, రేడియో పాటలు ఆమెకు గోచరించాయి. అది సత్రమా కాదా అనే అనుమానం కమలకు తట్టకపోలేదు. అయినా ధైర్యం వహించి కాలంగడపాలని ఏమీ అర్థం కానట్లు క్రొత్తప్రదేశంలో అడుగుపెట్టిన క్రొత్తస్త్రీలా మసులుకోవాలనుకుంది కమల.

'స్నానంచెయ్యి. చాలా దూరంనుంచి వచ్చేవు'. ముసలిది కమల తల నిమిరింది ఆప్యాయంగా.

ఒక కుండతో నీళ్ళుతెచ్చి ముందు పెట్టింది.

'రాత్రిళ్ళు కుళాయిలు వుండవుగా!' కుండలో నీళ్ళు చాలాకొద్దిగా ఉన్నసంగతిని విపులీకరించి సమాధానమిచ్చింది ముసలిది.

మౌనంగానే కమల స్నానానికి ఉపక్రమించింది.

కమల స్నానం పూర్తిచేశాక, ముసలిది భోజనానికి ఆహ్వానించింది.

చాలా చిన్నసత్రవులాఉందే!' ముసలిదానివైపు చూచింది కమల.

'పట్నాల్లో సత్రవులు యిట్లాగే ఉంటాయి!'

ముసలిది మెరుపుచూపుతో నవ్వింది. ఆ మెరుపు చూపులో తనకు తెలియని రహస్యాలు ఎన్నో ఉండిఉండాలని అనుమానపడింది కమల.

పచ్చడి మెతుకులతో ప్రత్యక్షమయింది కంచం. ఆకలితో దహించుకపోతున్న కమల ఎదురుగా కనిపించే ఆహారము అసహ్యంగా ఉన్నా, తినక తప్పలేదు. చల్లగా ఉన్న ఆ అన్నం ఆమె హృదయంలోని ఆశలన్నిటినీ చల్లబరిచింది. ముసలిది చివర అందిచ్చిన గుక్కెడు మజ్జిగనీళ్ళతో తృప్తిపడి బయట వరండాలో కూర్చుంది కమల.

కమల అన్నంతిన్న కంచంకడిగి ముసలిది కమల దగ్గరవచ్చి కూర్చుంది. 'ఆ తడికల అవతల ఏముంది?' కమల ముసలిదాన్ని ప్రశ్నించింది అమాయకమైన చూపుతో.

'ఏముంది? మన సత్రవులోని మనుష్యులే!' ఫక్కున నవ్వింది ముసలిది. ఆమె నోట్లోని తాంబూలం, పెదవులను ఎర్రబరిచి కొనలకుండా లాలాజలాన్ని స్రవింపజేస్తోంది. చెమటతోనిండిన ఆ ముసలిదానిముఖం అప్పుడే జలకూరుతున్న క్రొత్తినుయ్యిలా తడితడిగా వికృతంగా అగుపించింది.

ముసలిదానిముఖంలో ఆలోచనలు ముసుతలుగామారి పాము మెలికల్లా చుట్టుకున్నాయి.

'క్రొత్త తల దువ్వనా!'

'రాత్రి ఎలా ఉంటేనేం?' కమల చికాకుపడింది.


'అలా అంటే ఎలా! యీ సత్రవులో ఉన్నవాళ్ళు ఎప్పుడూ అందంగా ఉండేలా చూసే బాధ్యత నాది!'

వికటంగా నవ్వింది ముసలిది.

కోపంగా, రోషంగా చూసింది కమల.

తడికల ప్రక్కసందులోంచి గళ్ళలుంగీ, ఎర్రటోపి పెట్టుకున్న సాహెబు, ఇంకో కుర్రాళ్ళు వచ్చారు. కమలను చూసి ఒక్క క్షణం ఆగి, నవ్వుతో ముసలిదాన్ని సమీపించారు. ముసలిది కంగారుగా గబగబలేచి

(41-వ పేజీ చూడండి)



పెద్దడాక్టరు చిన్నడాక్టరుతో: "ఇదుగో తమ్ముడూ! ప్రిస్క్రిప్షన్లు రాసేటప్పుడు దస్తూరిబోధ పడకుండారాయి. బిల్లులు మాత్రం పట్టిపట్టి స్పష్టంగారాయి."



బంగారం
సింగారం
బాపు బొమ్మల కథ 10
అరె! ఖాళీ! మోసం! దగా! బాబోయ్! ద్రోహం! ఇందులో తాటాకు ముక్కొటుంది అంతే!
ఒరేయ్ సింగారం - నువ్వు ఏదో పొరుగు జన్మలో - నాకుతెలీకుండా వచ్చి తవ్వుకు పోయావ్! అవునా?
ఏమి జంపు! ఏమి జంపు!
ఒరేయ్ బంగారం! ఆపని నువ్వే చేశావు - అందికే అలాంటి మాటన్నావు - నేను ఆ జన్మ తరవాత ఈమధ్యా నెపుడూ పుట్టందే!
మరె మా!
ఈ తాటాకు మీద ఒక వేళ రాసి వుందేమో - ఈ పాతర ఇంకో చోట వుందని
జానాను - ఇదుగో ఇందులో సుబ్బరంగా రాసి వుంటేనూ -! ఎటొచ్చీ సంస్కృతం లో వుంది. చదివి టీక అను అర్థము చెప్పుటకు ఫీజు మూడొందలు మాత్రమే!
మూడొం...!
హిందా - తగలడు
"బైరాగి చిటుకాలు నమ్మకు - పాతరకో లంకె బిందెలకో కక్కుర్తిపడితే - మట్టికొట్టుకు పోతావు స్మీ!"
బాబోయ్! దగా! దోపిడీ! మోసం! ఈ వెధవ నీతి కోసమా ఇంత డబ్బు తగతేసుకుని వచ్చాం!!


అలా రావద్దనేగా ఇందులో వున్నది! బేహార్సు డబ్బుకి కక్కుర్తి పడకుండా బైరాగి చిటకాలు నమ్మకు- ఇదే పది వేలు- అని గదా వుంది!
అమ్మోయి బాబోయ్!
అవును మావా! మనం ఇలాంటి ఆశ పడకుండా- ఆ బైరాగాడి మాట వినేసుంటే వుంటే ఇంతవరకూ నాకు ఇవ్వవలసిన పదివేలూ మందగ్గరే వుండేది తదా!
మరే! మరే! ఈ పది వేలూ, ఆ బైరాంగి బేహార్సుగా తిని పోయిన పెసరట్లు బిల్లు ఆరణాలూ కూడా మిగిలేవి గదా- ఎంత దగా హెంత దగా
హుఁ! ఇప్పుడేం చేద్దాం?
ఇంకో పదివేలు తగలేసుకుని కొంపకి చేరడం- ఇంకో పదివేలు తగతోసి.....
---ఆ బైరాగాణ్ణి వెతికి పట్టుకుని చితగదన్ని పెసరట్లు బిల్లు వసూలు చెయ్యాడం- పదండి- పదండి!
20

విధి విలాసము

కాలేజీ కాంపౌండు దాటి రోడ్డు పైకి వచ్చాడు చంద్రమౌళి. ఏ వైపు వెళ్లడమా అని కాసేపు తటపటాయించాడు. పట్టణంలో వీధులకు వెళ్ళినా ప్రొద్దు పోతుంది. ఆమాటకొస్తే ప్రొద్దు పోవడమెలాగన్నది చంద్రమౌళికొక సమస్య కానే కాదు. పుస్తకం చేతబట్టుకుని ఏకాంతంగా ఏ చెట్టు క్రింద కూర్చున్నా చంద్రమౌళికి గంటలకు గంటలే దొర్లిపోతాయి. అలాగని అతడు వంచినతల పైకెత్తకుండా పుస్తకాన్ని ఆసాంతం చదివేస్తాడని గాదు. అలా చదవకపోవడం అటుండగా వాక్యానికి, వాక్యానికీ బ్రేకు పడుతుంది. ప్రతివాక్యమూ అతని భావజలధిలో కవ్వంలా గిరగిర తిరిగిపోతుంది. ఊహలకు పైన ఊహలు అల్లుకపోతాయి. ఇంతగా ఆలోచించగలిగిన చంద్రమౌళికి కొన్ని కొన్ని చిన్న విషయాలనుగురించి ఆలోచించడం బొత్తిగా చేతగాదు. ఏ వైపుగా వెళ్ళాలి? ఎప్పుడు భోజనం చేయాలి? ఎప్పుడెప్పుడు ఎలాటి వుడుపులు తొడుక్కోవాలి? ఏ వేళప్పుడు పడుకోవాలి?— ఊహూ, తలచించుకున్నా వీటికి సమాధానం స్ఫురించదు చంద్రమౌళికి. అతడు తోడి లెక్చరరును సిన్సియర్ గా అడిగి చూచాడు కూడా— "దీనికేమైనా రెమెడీ చెప్పగలవా?" అని. అడిగి యింకా అరగంట గడవలేదు. అందుకా మిత్రుడు ఓ చిత్రమైన సమాధానం చెప్పాడు—

"డియర్ చంద్రమౌళీ! భావాంబరం నుంచి క్రిందికి దిగలాగి ఒక్కింతసేపైనా నిన్ను నేలపైన నడిపించడానికి నాకొక్క వుపాయం మాత్రమే స్ఫురిస్తోంది. అనురాగాలాపాలతో మెత్తెక్కించడానికి గాకపోయినా చెవిలో యిల్లుగట్టుకుని పోరడానికైనా నువ్వొక అమ్మాయి మెడలో మూడు ముళ్లు వేయాలి. ఆ అమ్మాయి వివేకం గలిగిన చిన్నదైతే నీకొక టైమ్ టేబిల్

మధురాంతకం రాజారాం

ఏర్పరుస్తుంది. నియమాతిక్రమణ జరిగితే చెవులు నులిమి నిన్ను నీ ఊహా ప్రపంచంలో నుంచీ వాస్తవ జగత్తులోకి లాక్కుపోతుంది. కానీ వచ్చిన చిక్కేమిటంటే నీ అంతకు నువ్వుగా ప్రేమపురాణాన్ని సాంగోపాంగంగా నడిపించి ఫలశ్రుతిలాంటి పరిణయ ఘట్టాన్ని చేరుకోలేవు. పోనీ, ఓ అమ్మాయి స్వప్రయత్నంతో నీ సరసకు రావడానికి ప్రయత్నిస్తే ఆమెను అర్థం చేసుకోనూ లేవు. ఈ పరిస్థితిలో ఏం చేయాలో నాకూ తోచకుండావుంది. పత్రికల్లో ఓ ప్రకటన వేయించినా బాగుండిపోవును!— 'అభినవ ఋష్యశృంగుణ్ణి వలచి వలపించుకోడానికి ఓ అపరశాంతాదేవి కావాలి'— అని!"

ఈ జవాబును తలచుకున్నకొద్దీ చంద్రమౌళి పెదవుపైని చిరునవ్వు చిన్నచిన్నగా చెంపలపైకి ప్రాకడానికి ప్రయత్నిస్తోంది- భావజగత్తు వేరు. బాహ్యజగత్తు వేరు. భార్య అన్న వ్యక్తి ఈ రెండింటికీ లింకు కాబోలు! ఆమె ముద్దరాలైతే లోకాన్ని మరిపించనూ గలదు మూర్ఖురాలైతే నరకాన్ని చూపించనూగలదు. కొంపదీసి తనకు రాబోతున్న భార్య ఈ రెండో తెగకు చేరిన మనిషైతే?- చంద్రమౌళి పెదవిపైన చిరునవ్వు చెదరిపోయింది. సోక్రటీసు పెళ్ళాంలాంటి దొకతె వచ్చి మెడకు చుట్టుకుంటే తన గతేం కావాలి?

చంద్రమౌళి రోడ్డువెంట నడుస్తున్నాడు. అతడి కళ్ళఎదుట కార్లు దూసుకపోతున్నాయి. రిక్షాలు పరుగిడుతున్నాయి. మనుషులు కదిలి పోతున్నారు. ఈ దృశ్యాలన్నీ అతడికంటికి కనిపిస్తున్నాయి గానీ మెదడుకు మాత్రం అందడంలేదు. ఇంద్రియానుభవాలను మెదడుకు చేరవేసే నరాలు ఏ కారణంచేతనైనా తమ పనిని తాము చేయడం మానుకున్నప్పుడు ఓ దృశ్యం కంటికి కనిపించినా కనిపించనట్టే! ఓ శబ్దం చెవికి వినిపించినా వినిపించనట్టే! ఈ స్థితికి మరో పేరు-పరధ్యానం!

చదవడం మంచిదే! ఆలోచించడమూ మంచిదే! కానీ ఆ చదవడానికీ ఈ ఆలోచించడానికీ ఓ పరిమితి అవసరం. మితిమీరి మ్రోగిస్తే మద్దెల పగిలిపోతుంది. బలాన్నంతా ప్రదర్శిస్తే తంత్రులు తెగిపోతాయి. చంద్రమౌళి విషయంలోనూ అంతే జరిగింది. విపరీతమైన శ్రమవల్ల బుర్రపాడై అతడు మూడేళ్ళపాటు మనమనిషి గాకుండా పోయాడు. ఒక సంవత్సరం కీల్పాకులోనూ, రెండేళ్ళు విశాఖపట్టణంలోనూ గడిపి మళ్ళీ మనిషిగా మారి ఈలోకంలో పడ్డాడు.

ఇదికూడా రెండేళ్ళ క్రిందటి సంగతి.

అప్పటినుంచీ చంద్రమౌళికి భయంగానే వుంది-తనేమో ఒంటరివాడు. ఈలోకంలో తనపట్ల శ్రద్ధవహించేవాళ్ళెవరూ లేరు. తల్లి

తన చిన్నతనంలోనే గతించింది అష్ట కష్టాలుపడి చదివించిన తండ్రి ఫలితాన్ని కళ్ళజూడకముందే కళ్ళు మూసుకున్నాడు అనర్ఘ్యపరీక్ష వ్రాసి స్వగ్రామానికి వెళ్ళిన క్రొత్తలో తనకు పిచ్చిపట్టింది ఏ పూర్వజన్మ సుకృతం కొద్దో ఒకటిగా వుంచి బతుకు మళ్ళీ స్వస్థత చేకూరింది నాటినుంచీ తను ఆరోగ్యంపట్ల కొంత శ్రద్ధ తీసుకుంటున్నమాట వాస్తవమే! మునుపటిలా విపరీతంగా చదవడంలేదు ఆలోచనలు యథాప్రకారంగా చెలరేగుతున్నా అప్పటికప్పుడే వాటిని కట్టి పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు రాత్రుల్లో బాగా నిద్ర పట్టడానికి ఏవో కొన్ని వైద్యప్రక్రియలను కూడా లోనౌతున్నాడు కాని ఎంత చేసినా ఈ పడవకో చుక్కాని మాత్రం అత్యవసరం లేకుంటే ఏతుఫాన ఏకష్టం వాటి బుగలతో ఊహించడం కష్టం.

"ఇదిగో! బాబూ! మిమ్మల్నే! పాతచావడి సందుకి ఎలా వెళ్ళాలో చెబుతారుటండీ?"

"పాతచావడి వీధి కా!" తల గోక్కుంటూ అపల్లెటూరి పెద్దమనిషివైపు చూచాడు. చంద్రమౌళి చూస్తూ చూస్తూ దగ్గరికివెళ్ళాడు వెళ్ళి "మిమ్మల్ని ఎక్కడో చూచినట్టు జ్ఞాపకం" అన్నాడు

సరిగ్గా ఆ పల్లెటూరి పెద్దమనిషి కూడా చంద్రమౌళివైపు అలాగే చూసారు "నాకూ మిమ్మల్ని ఎక్కడో చూచినట్టే జ్ఞాపకం అన్నాడు

"అలాగా! ఆశ్చర్యంగా వుంది పోనీ, వూరూ, పేరూ చెప్పండి చూద్దాం" అన్నాడు చంద్రమౌళి

"మాది క్రొత్తకోట పేరు వెంకట నరసయ్య."

"క్రొత్తకోట మునసబుగారన్నమాట!"

"అవును నన్ను మీ రెరుగుదురేమిటి?" ఆశ్చర్యంలో తలమునకలై పోతున్నాడు పల్లెటూరి పెద్దమనిషి

"నేను మిమ్మల్ని ఎరుగనివాడను కాదు మీరు కూడా నన్నెరుగుదురు నేను మిమ్మల్ని ఎన్నడో కలుసుకోవలసింది కలుసుకుని నా కృతజ్ఞతను తెలుపుకోవలసింది కాని ఆలస్యం జరిగిపోయింది అందుకు మీరు నన్ను మన్నించాలి మన్నించి ఈపూట నా ఆతిథ్యాన్ని స్వీకరించాలి"

"నన్నా! మీ ఆతిథ్యాన్ని స్వీకరించమంటారా?" వెంకటనరసయ్యగారికి మతి పోయినంత పనౌతోంది

"ఇక్కడ రోడ్డుపైన నిల్చుని మాట్లాడుకోడమెందుకు? వెళ్దాం రండి తీరిగ్గా మాట్లాడుకోవచ్చు"

బసకు వెళ్ళగానే చంద్రమౌళి స్వయంగా చేదబావిలోంచి నీళ్ళుచేది వెంకటనరసయ్యగారిని కాళ్ళు చేతులు కడుక్కోమన్నాడు. పొరుగింటి కుర్రాణ్ణి హోటలుకు పంపించి టిఫిన్ తెప్పించాడు అతిథి ఫలహారం తీసుకుంటూ వుండగా బయటికి వెళ్ళి వీధి మొగదలలోవున్న బంకులోనుంచి తాంబూలం తీసుకొచ్చాడు

ఈ అయాచిత సత్కారం తాకిడికి తట్టుకోలేక పోతున్నారు వెంకటనరసయ్యగారు చంద్రమౌళి కూడా ఆయనను మరెంతో సేపు యిలా సందేహడోలలో ఊచో పెట్టి వుయ్యాలలూపడం భావ్యంకాదనుకున్నాడు

"నేనెవరినో మీకింకా గుర్తుకు రాలేదు గదండీ!" అన్నాడు

"అబ్బే, లేదండీ!" కించపడుతూ అన్నారు వెంకటనరసయ్యగారు

"ఐతే నేనే చెబుతాను మీ వూరి దాపున రైలువారి పరుగెడుతుందిగదూ?"

ఈసారి వెంకటనరసయ్యగారు వెక్కిమొగమే వేసేశారు చంద్రమౌళివైపు దిగాలు పడి చూస్తూ "పరుగెడుతుంది ఐతేనేం?" అన్నారు

"అయిదేళ్ళకు ముందు ఆ రైలు దారిపైన ఓ సంఘటన జరిగింది"

"నిజమే! దారికడ్డంగా రాళ్ళు పెట్టడం, రైలునిలిచిపోవడం, ఎంక్వయిరీ జరగడం"

"ఆపని చేసింది అప్పట్లో మీ ప్రాంతంలో తిరుగుతుండిన ఓ పిచ్చివాడు."

వెంకట నరసయ్యగారి ముఖాన గుప్పు గుప్పున చెమట పట్టిపోతోంది. ఆయన కనుగ్రుడ్లు కోడిగ్రుడ్లమల్లే పైకి పెల్లుబికి పోతున్నాయి


"ఆ పిచ్చివాణ్ణి నేనే!"

"ఏమిటీ!" భయం అదోక విద్యుల్లతలా వెంకట నరసయ్యగారి రక్తంలో మెరుపు తిరిగిందేమో! ఆ తొట్రుపాటులో ఆయనొక గావుకేక పెట్టి బయటికి పారిపోతారేమోనని పించింది చంద్రమౌళికి!

"భయపడకండి! నేనిప్పుడు పిచ్చివాణ్ణి గాను మీ దయవల్ల ఆరుగ్ణతనుంచి బయటపడగలిగాను"

"నా దయవల్ల!! నేనేం చేశానని?"

"పోలీసులు ఎంక్వయిరీకి వచ్చారు. ఆ పని చేసిందెవరో మీ మూలంగా వాళ్ళకు తెలిసింది కాని ఎంత ప్రయత్నించినా వాళ్ళ చేతికి నేను దొరికానుగాను చివరకు మీ తోడ్పాటువల్లనే వాళ్ళు నన్ను పట్టుకోగలిగారు"



★ విధి విలాసం ★

"కానీ అది వుపకారం ఎలాగౌతుంది?"

"విధివిధానంలోని విచిత్రమదే మరి! ఒక్కొక్కప్పుడు అపకారమే వుపకారమౌతుంది. పిచ్చివాణ్ణి దండించడానికి శిక్షా ప్రవృత్తి ఒప్పుకోదు. అలాగని వదిలిపెడితే నేను మళ్ళీ అలాటి దుండగాలకు పూనుకోవచ్చు. అంచేత ప్రభుత్వమే తన స్వంత ఖర్చుతో నాకు చికిత్స చేయించవలసి వచ్చింది."

విషయం తేటతెల్లమైనా వెంకటనరసయ్యగారు విస్మయావస్థలోనుంచి మాత్రం తేరుకోలేకపోయారు. బయట చీకటిపడింది. వీధుల్లో ఎలక్ట్రిక్ దీపాలువెలిగాయి.

గడచిపోతోంది. కానీ వెంకటనరసయ్యగారు మాత్రం ఆశ్చర్యాంబుధిలో మునగానాం తేలానాం అన్నట్టుగా కదలకుండా మెదలకుండా కుర్చీలో ఐక్యమై వుండిపోయారు.

ఎనిమిది గంటలకల్లా హోటలునుంచీ కారియర్ వచ్చింది.

భోజనమైన తర్వాత చంద్రమౌళి అతిథిని డాబాపైకి తీసుకెళ్ళాడు. పుచ్చపువ్వులాంటి వెన్నెల. చేరువలోవున్న పార్కుపైనుంచీ కమ్మగా మందమారుతం వీస్తోంది. దూది పింజలలాంటి మబ్బులకేసి చూస్తూ పిట్టగోడకు చేరగిలబడి కూర్చున్నారు వెంకటనరసయ్యగారు.

"అన్యథా భావించకపోతే మిమ్మల్ని ఓ విషయం అడగాలని వుందండీ!" అంటూ ఉపక్రమించాడు చంద్రమౌళి.

వెంకటనరసయ్యగారు వులిక్కిపడ్డారు. చంద్రమౌళిముఖంలో దేనికోసమో గాలించి, అలాటిదేమీ కనిపించకపోవడంతో మళ్ళీ మామూలుస్థితికివచ్చి "అడుగు నాయనా! సందేహమెందుకు?" అన్నారు.

"వచ్చినప్పటినుంచీ మిమ్మల్ని చూస్తున్నాను. మీరు దేన్నిగురించో గానీ తీవ్రంగా ఆలోచిస్తున్నారు. ఏదో చింత విడుపు లేకుండా మీ మనసులో రాజుకుంటూ వున్నట్టుంది..."

వెంకటనరసయ్యగారు వేడిగా నిట్టూర్చారు.


"నా బాధ ఒకరు ఆర్చేది, తీర్చేదీ గాదు బాబూ! ఏనా ఎందుచేతనో నా సోదంతా నీదగ్గర వెళ్ళబోసుకోవాలనిపిస్తోంది. నాకు పొలాలున్నాయి. డబ్బుంది. ఇళ్ళున్నాయి. అంతా నా స్వార్జితమే! మాటకగురులేకుండా గ్రామాన్ని చెప్పుచేతల్లో వుంచుకుని సగువుగా బతికాను. కానీ ఏం లాభం? భగవంతుడు నిశ్చింతగా మనిపొమ్మని నా నుదుట వ్రాసిపెట్టలేదు. ఒకటి రెండు చింతలు నన్ను హరహమూ వేపుకు తింటున్నాయి."

"చెప్పండి..." సావధానతను ప్రకటిస్తూ దగ్గరికి జరిగి కూర్చున్నాడు చంద్రమౌళి.

"ఒక్కడే కొడుకు నాకు! వాడు నన్నూ వంశాన్నీ వుద్ధరిస్తాడనుకున్నాను. ఆశలన్నీ వాడిపైన్నే వుంచుకున్నాను. కానీ వాడు తులసివనంలో గంజాయి మొక్కై కూచున్నాడు. వాడికి చదువు పట్టుబడలేదు. నిలకడగా యింటిపట్టున పడివుండలేకపోయాడు. ఊళ్ళో వున్నంతకాలం ఎక్కడెక్కడి రగడలన్నింటినీ యింటిపైకే తెచ్చేవాడు ఆఖరుకు మూడేళ్ళప్పుడు చేతికి దొరికిన డబ్బుతోసహా వూరూ, నాడూ విడిచి పరారైపోయాడు..."

"వెదికించలేకపోయారా?"

"ఒక్క వెదికించడమేగాదు. పత్రికల్లో ప్రకటనకూడా వేయించాను. ఎన్నివిధాలుగా ప్రయత్నించినా వాడి ఆచూకీ తెలిసిందిగాదు. వాడి కథ అలా తెల్లవారిందా, యిక రెండోది అమ్మాయినిగురించిన చింత! ఆమె మనుషుల్లో పుట్టవలసిందిగాదు. తప్పిదారి పుట్టిందనే నా వూహ. లేకపోతే ఈ యీడుకే ఆమె కంతటి ఓపిక, అంతటి వివేకమూ ఎలా వస్తాయి చెప్పు! ఈపాటికే ఆమెకు పెళ్ళికావలసింది. సంబంధాలేమో వస్తున్నాయి. కానీ అదేం గ్రహచారమో గానీ ప్రతి సంబంధంలోనూ ఏదో ఒక అవలక్షణం పొడసూపుతోంది. ఓ కుర్రాణ్ణి చూచాను. చదువుకున్నాడు. కాస్తో, కూస్తో వున్నవాడు. అందగాడు గూడా.



మానవస్వభావం

★ విధివిలాసం ★

కానీ యిన్నింటికీపైన అతడు పేకాట రాయడని తెలిసింది. మరో కుర్రాడు పెళ్ళి చూపులకంటూ వచ్చి కూర్చున్న పదిహేను నిమిషాల్లో రెండు ప్యాకీల సిగరెట్లు కాల్చి పారేశాడు. మరొకడు గళ్ళబనీను పైన గ్లాస్ కోరు జుబ్బాతొడుక్కుని ఫిల్మ్‌స్టార్‌లా వూడిపడ్డాడు. అతగాడి కెంగుకో అడుగడుగునా చిరాకు. మాటమాటకూ కోపం.."

"మీరింత తీవ్రంగా పరీక్షించడానికి పూనుకుంటే మీ పరీక్షకు తట్టుకోగల అల్లుడు దొరకడం దుస్తరమేమోనండీ!" చిరునవ్వుతో తన సందేహాన్ని బయట పెట్టాడు చంద్రమౌళి.

"ఏం చేయమంటావు బాబూ! మమకారం చెడ్డది. ఆ అమ్మాయిని నేనంత గారాబంగా పెంచాను. ఆమె పైన ఈగ వ్రాలితే నా గుండెలవిసిపోతాయి. ఆమెను ప్రాణప్రదంగా చూచుకోగల అల్లుడు కావాలి నాకు! అలాటివాడు దొరకనే దొరకడంటావా?"

చంద్రమౌళిగూడా ఆలోచనలో పడ్డాడు. రాత్రంతా ఆలోచించాడు. తెల్లవారబోతుండగా ఓ నిర్ణయానికివచ్చాడు. ఆ నిర్ణయానికి తగ్గట్టుగా వెంకటనరసయ్యగారు చంద్రమౌళిని తమ గ్రామానికి ఆహ్వానించారు. ఆ ప్రయాణం ఈ పడుచువాడికీ ఆ ముసలివాడికీ మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడడానికి వుపకరించింది. చంద్రమౌళి అమ్మాయిని చూచాడు. వల్లమాలిన సిగ్గుతో మరీ అంత భీతహరిణంగాకుండా నిశ్చలమైన నీలికళ్ళతో ఆ అమ్మాయి చంద్రమౌళి వైపోసారి నిదానించి చూచింది. చంద్రమౌళి ఆదరాబాదరా తన రొమ్ము్మను తడవి చూచుకున్నాడు. అనుకున్నంతా అయింది, అక్కడ తన హృదయంలేదు!

"అమ్మో, హృదయాన్ని దోచుకోడమంటే యిదేనేమో!" అనుకున్నాడు చంద్రమౌళి.

పోగా యిదంతా వన్ సైడ్ ట్రాఫిక్కుగా మాత్రం పరిణమించలేదు. అటువైపున వెంకటనరసయ్యగారికిగూడా చంద్రమౌళిలో తన అల్లుడికి కావలిసిన శుభలక్షణాలు ఒక్కొక్కటిగా కనపడుతున్నాయి.

*　　*　　*

మనం ఇలా జరగాలనిగానీ, లేక యిలా జరుగుతుందనిగానీ అనుకున్న సంఘటన అలా జరుగక పోవడందగ్గరనుంచే అసలుకథ ఆరంభమౌతుంది కథను సంబంధించిన యీ సిద్ధాంతందృష్ట్యా ఆలోచిస్తే యిది కథేకాదేమో ననుకోడానికి గూడా వీలుంది! ఎందుకంటే అందరూ అనుకున్నట్టుగా చిరంజీవి చంద్రమౌళికీ, సౌభాగ్యవతి శ్రీలక్ష్మికి పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది. పోగా వధూవరులు కాస్త తొందరపడి ఒకరిపట్ల ఒకరు పెళ్ళికిముందరగానే పెద్దగా అంచనాలు వేసుకోడం, ఆ అంచనాలు ఒక్కొక్కప్పుడు స్వల్పంగానూ, మరొకప్పుడు అధికంగానూ తారుమారైపోయి ఆశాభంగాలు కలగడం అక్కడక్కడా మామూలే! కానీ యిక్కడ ఈ నవదంపతుల విషయంలో అలాటిదేమీ జరుగలేదు. పైగా అనతికాలంలోనే వాళ్ళొకరి నొకరు క్షణమైనా విడిచిపెట్టి ఉండలేని 'పరిణతి'లోకి వచ్చేశారు.

ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే ఈ పరిణామం వెంకటనరసయ్యగారిని అదోక హృదయశల్యంలా బాధించింది. అసలు పుత్రికాజీవులైన తల్లిదండ్రులతో వచ్చిన చిక్కే యిది! ఈడూ జోడూ కుదిరి కూతురి ముద్దూ ముచ్చటా తీర్చగల వరుడు పీటలపైకి వచ్చేవరకూ వాళ్ళ కదోక బెంగ! ఆ తరువాత అమ్మాయి మొగుణ్ణి కొంగుకు కట్టేసుకుని తన కాపురాన్ని చక్కబెట్టుకోడంలో నిమగ్నమైతే కూతురికీ తమకూ ఎడబాటైపోయిందిగదా అని అదోక చింత!

అప్పటికీ వెంకటనరసయ్యగారు వారాని కొకసారి స్వగ్రామంనుంచి పట్టణానికి

(43-వ పేజీ చూడండి)

పునరావృత్తం

'ఛీ, వెధవలోకం! వెధవ బ్రతుకు! జీవించే కంటే చస్తే మేలు! నేనెవరికోసరం ఏడ్వాలి? ఎవరు నాకోసం ఏడ్వాలి? అయినా లోకంలో నా అన్నవాళ్ళెవరేనా వుంటే "అయ్యో! చస్తే ఎలాగ?" అని బాధపడాలి. అంతేకాని ఈ జానెడు పొట్టకోసమని ఇంకొ పాడుపన్లు ఎందుకు చెయ్యటం? కాని నిజాయితీగా పోదామంటే జీవితం సాగదు. ఇంక ఏమయినాసరే పాడుపనులు మాత్రం చెయ్యకూడదు.

"ఇంతకీ తను లచ్చికోసం తప్ప యింకెవరికోసరమూ కాగు జీవించేది" అనుకుని రోడ్డుమీద గబగబ అడుగులేసుకుని వచ్చేస్తున్నాడు అప్పుడే జైల్లోంచి విడుదలయిన గురయ్య.

గూడెం చేరుకునేసరికి అరుగుమీద కూర్చుని చుట్టలు చుడుతున్న చెంచయ్య "ఏరా? గురాయ్! ఎప్పుడు యిడుదలయినావ్" అని పరామర్శించేడు.

'ఇయాళే యిడిసిపెట్టినారు!' అంటూ 'ఏదీ? ఓ పొయిలా పారీ మావా!' అన్నాడు. అలా అంటూనే చెయ్యిజాపి చెంచయ్య యిచ్చిన పొగాకు తీసుకుని చుట్టచుట్టి, తువ్వాలు దులిపి పైమీద వేసుకుని 'వెళ్లొస్తాను మావా!' అన్నాడు గురయ్య.

'వెళ్లు, యింకేనా బుద్ధిగా మసులుకో!' అన్నాడు చెంచయ్య.

'దానికేముందిలే! అలాగే!' అని చుట్ట ముట్టించి ఘట్టిగా రెండు పీల్పులు పీల్చి పొగ వదుల్తూ ఇంటివేపు బయలుదేరేడు గురయ్య.

ఇంటికొచ్చేసరికి తలుపు దగ్గరగా వేసుంది. తలుపు తోసుకుని ఇంట్లోకి వెళ్ళి కడవలో మంచినీళ్ళు తాగి నులకమంచంమీద నడ్డి చేరవేశాడు.

ముక్కులోంచి, నోట్లోంచి పొగవదుల్తూ తన పాతజీవితంవేపు ఒక్కసారి మనస్సు పోనిచ్చాడు.

2

గురయ్య అప్పుడు పంతులుమిల్లులో డ్రైవరుగా పనిచేసేవాడు. నెలకి ఇరవై రూపాయిలు జీతం. ఉదయం 8 నుండి 11 వరకు, మధ్యాహ్నం 2 నుండి 5 వరకు మిల్లులో వుండేవాడు. తర్వాత ఇంటికి చేరేవాడు. అప్పుడప్పుడు తాగడం మామూలయినా ఎవ్వరిజోలికి పోయేవాడుకాదు. తప్పతాగినా తిన్నగా యింటికొచ్చి చక్కగా నిద్రపోయేవాడు. అందుచేతనే గూడెంలో అందరికి అభిమానం.

అతనిభార్య లచ్చికూడా ఏదో కూలినాలి చేసి సంపాదిస్తూ వుండేది. వారికొడుకు చంద్రం. నాలుగు ఏళ్ళవాడు. వీరు ముగ్గురు హాయిగా ఏకూ చింత లేకుండా కాలం గడిపేవారు.

ఒకసారి చంద్రానికి జబ్బుచేసింది. ఏదో

జి. నరసింహశర్మ

జ్వరంఅని వైద్యుడిచేత మందు యిప్పించేరు. వారంరోజులయినా జ్వరం తగ్గకపోతే వైద్యుడు వచ్చి చూసి టైఫాయిడని నిర్ణయించేడు. డబ్బిస్తేకాని మందివ్వనన్నాడు.

"ఎంతవుతుం"దన్నాడు గురయ్య.

"అధమం వారానికి పదిరూపాయిలవుతుంది. నాలుగు వారాలేనా మందివ్వా"లన్నాడు.

వారానికి పదిరూపాయలంటే మాటేమిటి? తను పంతులుమిల్లు చక్రంతో నెల్లాళ్ళు హోరాహోరీ పోట్లాడితే పంతులు ఇరవై యిస్తాడు. తన పదిహేనురోజులకష్టం చంద్రం వారంరోజులమందుకి వైద్యుడికి యివ్వాలి. తనదగ్గర చూస్తే ఆరణాలు వున్నాయి. చంద్రానికి చూస్తే ప్రాణంమీదికి వచ్చింది. గురయ్యకేం తోచలేదు. పంతులు దగ్గరకెళ్ళేడు. పదిరూపాయలప్పు యిమ్మన్నాడు. నెలకయిదు రూపాయిలు తీసుకుని అప్పులో చెల్లుపెట్టుకోమన్నాడు.

"బాగుంది! వెధవది మిల్లు చూస్తే నష్టంతో నడుస్తున్నది. నీకు జీతంలో అప్పుకావాలీ? వెధవది, నీ జీతం ఖర్చు కాకుండానే పట్టుకుపోతావు. నీ జన్మలో ఎప్పుడేనా నీ జీతం అంతా పట్టుకువెళ్ళేవురా?" అని మీసం దువ్వుతూ పాతపాటే పాడేరు పంతులు.

బతిమాలి, బతిమాలి విసుగెత్తి ఆ రోజు సెలవుపెట్టి గూడెం చేరుకున్నాడు. ఇంటికొచ్చేసరికి "లచ్చి" ఏడుస్తున్నది. చంద్రం మంచందగ్గిర చాలామంది వున్నారు. చంద్రం

పునరావృత్తం

జీవితం యిటో, అటో గావుంది. ఆఖరి క్షణాలలో వున్నాడు.

గురయ్య తెగించేశాడు. పంతులింటికి పరిగెట్టేడు. ఆవూర్లో పంతులుతప్ప యింకెవరు అప్పుయివ్వరన్న సంగతి తనకు తెల్సును.

పంతులు పొలమెళ్ళేడు. ఇటూ, అటూ చూసి యింట్లోకిదూరేడు. పంతులుకి పిల్లాపాప ఎవరూ లేరు. మేనల్లుడు ఒకడున్నాడు. వాడు మిల్లుకి వెళ్ళేడు. పంతులు భార్య వంటింట్లో వంటచేసుకుంటూంది. యిదే సమయమని గదిలో దూరి తను తెచ్చిన వూచతో పందుపెట్టి తెరచి పైనే వున్న నోట్లకట్ట మొల్లో పెట్టి వంటింటివేపు చూశాడు. ఆవిడ పూజ చేసుకుంటున్నది. మెల్లిగా పెరట్లోంచి వుడాయించి వైద్యుడికి డబ్బిచ్చి యింటికి తీసుకొచ్చేసరికి కాలం మించిపోయింది.

గురయ్య దేనికోసం తెగించేడో ఆ ఫలితం దక్కలేదు. ఇంక చంద్రాన్ని అక్కడుంచి లాభంలేదని నలుగురు కలసి చేయవలసిన పని పూర్తిచేసుకుని తిరిగివచ్చేరు. వచ్చేసరికి పంతులు పోలీసులతో సహా తయారయేడు. గురయ్యని లారీలో ఎక్కించి తీసుకెళ్ళిపోయేరు.

లచ్చి బావురుమంది.

ఏణ్ణార్థం కటకటాల్లో కాలక్షేపం చేశాడు గురయ్య.

జరిగినదంతా కలలా గురయ్య కళ్ళముందు కదిలిపోయింది.

"ఏంమావాఁ! ఎప్పుడొచ్చేవు?" అన్న మాటలతో అతనికి బాహ్యప్రపంచం మీదకి దృష్టి కలిగింది.

"ఏమే లచ్చీ! బాగున్నావా! యివాళే వచ్చేను," అన్నాడు గురయ్య పడుకున్నవాడు లేస్తూ!

"పోనీలే!" అంటూ తెచ్చిన చితుకులు అక్కడ పడేసి మంచం దగ్గరగా వచ్చి కూర్చుంది.

అసలు లచ్చికూడా అతని స్వంత భార్య కాదు. ఆరేళ్ళక్రితం తనతో వచ్చేసింది. అప్పటినుంచీ తనతోనే వుండిపోయింది.

"యింకేనా బుద్ధిగా వుంటావా? లేక మళ్ళీ కటకటాల్లో కెళ్తావా మావాఁ?" అని అడిగింది లచ్చి అతన్ని.

"అలాగే లేయే! ఆకలేస్తుంది ఏమేనా పడే," అన్నాడు నవ్వుతూ!

లచ్చి పెట్టిన అన్నం తిని తిరిగి పడుంటాళ్ళేడు.

3

సాయంకాలం అలా మిల్లువేపెళ్ళాడు. గురయ్యని చూసేసరికి పంతులు ప్రాణాలు పైకి పోయేయి.

పంతులుని చూసేసరికి చేతులెత్తి "దండాలు పంతులుగోరూ! బాగున్నారా?" అన్నాడు.

లేనిధైర్యం తెచ్చుకుని "ఎప్పుడొచ్చేవురా? మీ లచ్చి వాళ్ళు బాగున్నారా?" అన్నాడు.

"యియ్యాళే వచ్చేను. అమ్మగోరు, అబ్బాయిగోరు శేమంగున్నారు కదా?" అన్నాడు దగ్గరగా వస్తూ.

"యిప్పుడేంచేస్తావురా?" ఈ మాటలు ధైర్యంగానే అన్నాడు పంతులు.

"ఏం సేస్తాను? యింకెక్కడే నా కొలువు చూసుకోవాలి" అన్నాడు గురయ్య వినయంగా.

పంతులుకి ఎంచేతనో వాడికి పని యివ్వాలనిపించింది. "ఏరా! గురాయి! నా దగ్గర పాలంపని చూడకూడదూ, పాతజీతంమీద?" అన్నాడు.

గురయ్య ఆశ్చర్యపోయేడు. పంతులు జన్మలో తనతో మాట్లాడుతాననుకున్నాడుతను. కాని పనిచేస్తానంటే ఆశ్చర్యపడ్డాడు. మర్నాడే పనిలో చేరాడు.

4

గురయ్య పనిలోచేరి ఆరుమాసాలు గడిచిపోయేయి. ఎంతో నమ్మకంతో పనిచేసుకుపోతున్నాడు. పంతులుకూడా ఎంతో అదరించుకున్నాడు గురయ్యని.

ఆవేళ గురయ్య తప్పతాగేసి యింటికి వస్తున్నాడు. తనముందర తను మునుపు చేస్తున్న డ్రైవరుపని చేస్తున్న సత్యం, యింకెవడో కలసివెళ్తున్నారు.

సత్యం పంతుల్ని చెడతిడుతున్నాడు. ఆ మాటలువిన్న గురయ్య కోపంతో చేతిలో వున్న కర్రతో "అళ్ళుప్పుతింటూ అళ్ళనే తిడతావురా?" అంటూ సత్యం బుర్రమీద బలంగా కొట్టేడు. సత్యంబుర్ర బద్దలయింది.

రక్తం ధారగా కారిపోతున్నది.


అదేం పట్టించుకోకుండా యింటికివెళ్ళి పడుకున్నాడు. ఆసంగతి తెలిసిన పంతులు ఆశ్చర్యపడిపోయేడు. మరికొంతసేపటిలో మిల్లు ముందరనుంచి గురయ్యను ఎక్కించుకొని పోలీసులారీ వెళిపోయింది.

"ఈ మాటు మూడేళ్ళు శిక్షట! గురయ్యకి" అన్నాడు పంతులు లచ్చితో.

"ఛీ! వెధవబతుకు. ఈ మాటు విడుదలయిన దగ్గిరనుంచేనా నిజాయితీగా బతకాలి బతుకుతానుకూడాను" అనుకున్నాడు గురయ్య జైలుగదిలో తనకిచ్చిన అరుగు దులుపుకుంటూ!. ★

తాజ్ మ
మించే

కె. ఆర్.



"షాజహాను పాడిన ప్రేమగీతం"
ఆగ్రాలోని తాజమహల్

ఎప్పటికప్పుడు కొత్తగా, వింతగా అపురూపమైన సౌందర్యంతో అలరారే తాజ్ మహల్‌కు లభించినంత కీర్తిప్రతిష్ఠలు, మానవుడు నిర్మించిన మరే కట్టడానికి లభించలేదనటం అతిశయోక్తి కాదు. ఎందరు ఎన్ని విధాలుగా ఈ కట్టడాన్ని మెచ్చుకున్నారో! ఇంక ఇలాంటి కట్టడం కట్టడం మానవుడి తరం కాదని తరతరాలుగా మానవుడు అభిప్రాయపడుతూ వచ్చాడు.

అలాంటిదాన్ని మళ్ళీ కట్టడం సాధ్యం కానిసే సవాలుకు ఇప్పటిదాకా సరైన సమాధానం రాలేదన్నమాట నిజమేగాని, అంతకు మించినదాన్ని కాకపోయినా అలాంటి దాన్నయినా కట్టితీరాలని ప్రయత్నాలనుటుకు చాలా జరిగాయి.

మొట్టమొదటి ప్రయత్నం చేసింది మరొకరూ మరొకరూ కాదు సాక్షాత్తు తాజ్ మహల్ కట్టించిన షాజహానే. ముచ్చటపడ్డాడు ఇంకో తాజ్ కట్టించాలని. సరిగ్గా తాజ్ లాంటి మహల్‌నే, ఈ సారి తెల్లరాళ్ళతో కాదు—నల్లరాళ్ళతో, తాజ్‌కు ఎదురుగా యమునానది అవతలిగట్టున కట్టించాలని. ప్రేయసి ముంతాజ్ జీవించి ఉన్నప్పుడు తను ఆ నిజ చెక్కుటద్దాలలో ప్రతిబింబం చూసుకుని ఎలా మురిసిపోయేదో అలాగే తను చనిపోయిన తరవాత ఆమె చిహ్నమైన తాజ్ మహల్ నల్లని దర్పణాలలో తన ప్రతిబింబం చూసుకుని మురిసిపోవాలని, అందుకు వీలుగా తనను అక్కడ ఖననం చెయ్యాలనీ భావించాడు షాజహాన్ చక్రవర్తి.

అంతేకాదు జీవించిఉన్నప్పుడు తనూ ముంతాజ్ తమ హృదయాలను ప్రేమతో వంతెన కట్టుకున్నట్టే, మృత్యువులోకూడా వంతెన కట్టుకోవాలనీ, అందుకుగాను ఆ మహల్‌ను ఈ మహల్‌ను కలుపుతూ పాలరాతివంతెన కట్టించాలని సంకల్పించాడు షాజహాన్.

తాజ్ నిర్మాణం పూర్తికాగానే ప్రధాన శిల్పిని పిలిచి నల్ల తాజ్ మహల్‌ను కూడా మొదలెట్టమని ఆజ్ఞాపించాడు. అయితే ఆజ్ఞ ఆజ్ఞగానే ఉండిపోయింది. షాజహాన్ ఢిల్లీశ్వరుడేగాని జగదీశ్వరుడు కాడు కదా. ఎంత గొప్ప చక్రవర్తి అయినా నవనిధులు, తరగని మణిగనులూ ఆయనకు లేవుగదా.

అసలు తాజ్ మహల్ కట్టడానికి కూడా షాజహాను పూర్తిఖర్చు భరించలేదు. మూడో వంతు ఖర్చు తను పెట్టుకొని, మిగతా రెండు వంతుల ఖర్చు సామంతరాజులనుంచీ, నవాబులనుంచీ వసూలు చేశాడని చరిత్ర చెబుతోంది. ఇంకో సంగతి వుంది. మామూలు తెల్లపాలరాయికంటె కరేపియన్ నల్లచలవరాయి అయిదురెట్లు ఖరీదెక్కువ. తాజ్ మహల్ కట్టటానికి 3 కోట్ల 20 లక్షల రూపాయిలయింది. అదే నల్ల తాజ్ మహల్ అయితే 16 కోట్ల రూపాయలయ్యేవి.


తాజ్ మహల్‌లో అక్కడక్కడ నల్ల చలవరాయి ఉపయోగించారు. తాజ్ కడుతున్నప్పుడు అక్కడక్కడ వాడటానికి కూడా నల్లరాయి చాలినంత దొరకలేదట. అప్పుడు ప్రధానశిల్పి ఉస్తాద్ ఏసా ఏం చేశాడంటే—తెల్లరాయిని కొన్ని సంవత్సరాలపాటు కొన్ని రసాయనద్రవ్యాలలో నానబెట్టి సరైన నలుపు తిరిగేదాకా ఉంచి అప్పుడు ఉపయోగించాడు.

ఏదైతేనేం, మొగల్ సామ్రాజ్యాన్ని అల్లకల్లోలం చేసిన భ్రాతృయుద్ధాలమూలంగా మొత్తానికి రెండో తాజ్ నిర్మాణం నిలిచిపోయింది. ఈనాటికీ యమునకు అవతలిగట్టున తాజ్‌కు ఎదురుగా, ఎర్రరాతి వేదిక తాలూకు పునాదులు కనిపిస్తాయి.


షాజహాన్ తరవాత రాజ్యానికి వచ్చిన ఔరంగజేబుకు ఇవేవీ పట్టలేదు. తండ్రికి వేరేగోరీ కట్టించాలనే ఆలోచనే రాలేదతనికి. అందుచేత షాజహాన్‌ను ముంతాజ్ ప్రక్కనే ఖననం చేశారు.

"కాళిందీచంద్రుల గాఢప్రేమకు చిహ్నం

"20వ శతాబ్దపు తాజ్ మహల్"
కలకత్తాలోని విక్టోరియా మెమోరియల్ హాల్



హల్ ను కట్టడం



ఔరంగజేబ్ భార్య స్మృతి-చిహ్నం
ఔరంగాబాదులోని బీబీకామక్బారా

ఎన్. స్వామి

గా వారి గోరీలను ప్రక్క ప్రక్కనే కట్టించటం మంచిది. వేరే పెద్దమహల్ ను కట్టించటం తప్పు దండుగ" అన్నాడు. కొంచి పైసాలని ఖర్చు పెట్టని ఔరంగజేబు.

ఇంతా చేస్తే, తాజ్ లాంటి ఇంకో మహాలను కట్టించటానికి మళ్ళీ ప్రయత్నం చేసిన వాడు ఔరంగజేబు మహాశయుడే. తన భార్య దిల్ రస్ బానూ (ఈ మెన్నే రబియా-ఉద్-దురానీ అనీ, గురానీ బేగం అనీ అంటారు) చనిపోయినప్పుడు అతడు బెంగ పెట్టుకున్నాడు. ఆవిడ ఔరంగాబాదులో మృతి చెందింది. ఆవిడ స్మృతి-చిహ్నంగా అక్కడ బీబీ-కా-మక్బారా అనే పెద్దగోరీ కట్టించాడతడు. దీనికి 7 లక్షలు ఖర్చు, ఏడు సంవత్సరాల కాలమూ పట్టింది.


ఈ కట్టడానికి పాలరాతిని ఉత్తరహిందూస్థానంలో నిరాతిగనులనించి తీసుకురావలసివచ్చిందనీ, వాస్తు ప్రవీణులు అతాఉల్లా, హైపత్ రాయ్ పాను చేశారనీ చరిత్ర తెలుపుతోంది. తాజ్ కట్టిన తర్వాత విదేశాల్లోకూడా ఇదీ కట్టారు. కొన్ని కొన్ని విషయాలలో తాజ్ ను అనుకరించినా, రెండూ చూసిన వాళ్ళకి దానికీ దీనికీ అందంలో పోలికే లేదా ఉందని బోధపడిపోతుంది. తాజ్ నిర్మాణంలోఉన్న సౌలభ్యం, సౌరళ్యం, పొంకం ఇవన్నీ బీబీకా మక్బారాలో కన బడవని ప్రసిద్ధ చరిత్రకారుడు పెర్సీ బ్రౌన్ అభిప్రాయం.

ఈ మహల్ ను ఎక్కటానికి గచ్చుదార్లు ఉన్నాయి. మధ్యలో 13 నీటిబుగ్గలున్న కొలనుఉంది. దార్ల-చివర విశాల స్థలంలో కట్టడంఉంది. దాని ఎత్తు నేలమట్టంనుంచి 110 అడుగులు. చబూతరానుంచి 8 అడుగుల ఎత్తుదాకా శుద్ధమైన పాలరాతితో కట్టారు. ఆపైన అంతా మామూలురాయి. పైనఉన్న పెద్దగోళం మళ్ళీ పాలరాయితోనే కట్టారు.

మొగల్ సామ్రాజ్యపతనం ప్రారంభం కావటం, ఢిల్లీకి ఔరంగాబాదు బాగా దూరాన ఉండటం—వీటితో బీబీకా మక్బారాను చూసే దిక్కే లేక శిథిలం కాజొచ్చింది. ఔరంగజేబు కొడుకు యువరాజు ఆజం దాన్ని పునరుద్ధరించాడు.

కాని మళ్ళీ అది శిథిలావస్థలో పడింది. లోపలున్న ఖరీదైన వస్తువులు కొల్లపోయాయి. అప్పుడు వైస్రాయి కర్జన్ ప్రభువు శ్రద్ధతీసుకుని మక్బారాలోఉన్న పింగాణీ, రాగిపాత్రని, తివాచీలను జాగ్రత్త చేయించాడు. ఆ తరవాత నిజాం ప్రభుత్వం శ్రద్ధ వహించి బాగుచేయించింది.

"తాజ్ మహల్ ను మించిన కట్టడమవుతుందాకి?"
ఆగ్రావద్ద రాధాస్వామిఆలయం నమూనా
[ఫోటో రాధాస్వామి మెమోరియల్ హాల్ సౌజన్యంతో]



కర్జన్ ప్రభువు వాస్తు శిల్పంమీద అపారగౌరవం ఉండటానికి ఇంతకంటె మంచి నిదర్శనం ఇంకోటిఉంది. విక్టోరియా మహారాణికి అద్భుతమైన స్మారకచిహ్నాన్ని భారతదేశంలో కట్టాలని ఆయన ఆశయం. తాజ్ మహల్ లాంటి భవనం కట్టించాలని ఆయన ప్రయత్నం చేశాడు. "ఆగ్రాలోని తాజ్ కు దీటుగా, ధగధగ మెరిసిపోయే సౌందర్యంతో 20వ శతాబ్దపు తాజ్ అనిపించుకునేంత గొప్ప స్మారకభవనం కట్టాలని ఆయన అపని ఒక కమిటీకి పురమాయించాడు. సర్ విలియం ఎమర్సన్ ను శిల్పిగా ఎంచుకున్నాడు. "బ్రహ్మాండమైన కట్టడం కట్టాలి. అది నిరాడంబరంగా ఉండాలి. కేంద్రస్థలంనుంచి అన్ని దిక్కులకూ చీలే నడవల్తో, గ్యాలరీలతో మహారాణికి తగిన హుందాతనంతో ఈ భవనం విరాజిల్లాలి," అని ఆయన సూచించాడు.

ఆయన ఆశయానికి రూపకల్పనగా వెలసిన ఆ కట్టడం కలకత్తాలోని విక్టోరియా మెమోరియల్ హాల్. శిల్పి ఈ భవనాన్ని ఇటాలి

తాజ్ మహల్ ను మించిన కట్టడం

యన్ రినైసాన్స్ సంప్రదాయంలో కట్టాలని సంకల్పించాడు.

నిర్మాణానికి డబ్బు కావాలని ప్రకటించగానే డబ్బు వానలాగా కురిసింది. సంస్థానాధిపతులు పెద్ద పెద్ద మొత్తాలు విరాళం ఇస్తామని అన్నారుగాని కర్జన్ ప్రభువు అక్కరలేదన్నాడు. సామాన్యుల నుంచి వచ్చినడబ్బే స్వీకరించాడు. అదే 30 లక్షల రూపాయలైంది. మూడేళ్ల తరవాత ఆయన పదవి విరమించి వెళ్లిపోతూ నిధి 52 లక్షలకు పెరిగిందని ప్రకటించాడు. అయిదవజార్జి ప్రిన్స్ఆఫ్ వేల్సుగా ఉన్నప్పుడు 1906 లో శంకుస్థాపన చేశాడు. ప్రారంభోత్సవాన్ని ఆయన కుమారుడు ఎడ్వర్డు (వింప్సర్ ప్రభువు) 1921 లో జరిపాడు. ఆఖరికి దానికైన వ్యయం 72 లక్షలు.

183 అడుగుల ఎత్తుఉన్న విక్టోరియా మెమోరియల్ హాలు ఈనాడు భారత దేశంలోని అద్భుతమైన భవనాలలో ఒకటి. ఇందులో అపురూపమైన చిత్రకళాఖండాలు, పురాతన శిల్పాలు ఉన్నాయి. ప్రపంచంలోని పెద్ద చిత్రాలలో రెండవదని పేరుగాంచిన ఒకచిత్రం (రష్యన్ చిత్రకారుడు వెరెస్టాగిన్) వేసినది ఇక్కడే ఉంది.

తాజ్ లాంటి మహల్ ను కట్టడానికి నాలుగో ప్రయత్నం ప్రస్తుతం జరుగుతోంది. ఆగ్రాకు నాలుగుమైళ్ల దూరాన, రాధాస్వామి మతస్థులు తమ ఆదిగురువుకు నిర్మిస్తున్న ఆలయమే ఈ నాలుగో ప్రయత్నం. ఇది పూర్తయిన తర్వాత తాజ్ తో తులతూగగలిగిన భవనమవుతుం"దని ఒక శిల్పి అన్నాడు. ఇది 50 ఏళ్లనుంచీ నిర్మాణంలో ఉంది 20 లక్షలు ఖర్చయింది. ప్రధాన ఇంజినీరు శ్రీ జి. ఎస్. భట్నగర్ చెప్పేదాన్నిబట్టి ఇప్పటికి అసలు భవనంలో కొంచెమే అయిందని తెలుస్తోంది. ఈ శతాబ్దం ఆఖరికి నిర్మాణం పూర్తి చేయాలని సంకల్పమట. పూర్తిఅయిన తరవాత దాని ఆకృతి ఎలాఉంటేదీ ఒక నమూనా చేయించి రాధాస్వామి స్మారక సంఘ భవనంలో ప్రదర్శించారు.

ప్రాచ్య సంప్రదాయాను గుణంగానే దీన్ని మలుస్తున్నారు. కాని దీనిలో అనేక వాస్తు పద్ధతులను అతి మనోహరంగా మేళవిస్తున్నారు. 50 లక్షలు ఖర్చు పడుతుందని మొదటఅంచనా వేశారు. కాని కోటిరూపాయలు కావచ్చునని నిర్మాతల అభిప్రాయం. దీనిమొత్తం ఎత్తు తాజ్ కంటె 27 అడుగులు తక్కువగా, 193 అడుగులు ఉంటుంది.

ఇంకా పూర్తికాని రెండవ అంతస్తు పైకెక్కి చూస్తే దూరభూరేఖపై ఉదయించే చంద్ర బింబంలాగా తాజ్ మహల్ కనిపిస్తుంది. మరి రాధాస్వామి ఆలయం తాజ్ ను మించిన కట్టడమవుతుందా? ★



ఆంధ్ర మహాభారతము

ఆదిపర్వము - సప్తమాశ్వాసము

చ. అనిన వసిష్ఠుఁ డిట్లనియె నంతధనంబును నట్టిరాజ్యముం
గొన నగునయ్య యిచ్చెదిపి కుఱ్ఱికి నీ కిది యేల యేను దీ
నన పితృదేవతాతిథిజనంబులఁ దృప్తులఁ జేయుచుండుదుం
జననుత దీనిఁ బ్రోచుటయె చాలుఁ దపస్వుల కేల సంపదల్.

వ. దీని నొరుల కీఁగా దనిన నలిగి విశ్వామిత్త్రుండు నేను క్షత్రియుండ నిగ్రహానుగ్రహ సమర్థుండ నీవు బ్రాహ్మణుండవు శాంతుండ వేమి సేయనోపుదు దీనికిలక్ష మొదవుల నీఁ బోయిన నొల్లవ యిమ్మొదవు నవశ్యంబును బలిమినైనం బరిగ్రహింతు నని నందినిం బట్టికొనఁ బంచినం బలుకక వసిష్ఠుండు సూచుచుండె

ఆ. పరులవలన బాధ వొరయ కుండఁగ సాధు,జనులధనము గాచు జనవిభుండె
గరుణ దప్పి తాన హరియించువాఁ డగు,నేని సాధులోక మేమి సేయు.

వ. ఇట్లు విశ్వామిత్త్రుండు వసిష్ఠహోమధేనువుం బట్టికొనఁ బంచిన నదిపట్టిక జనులవలని కశాదండతాడనంబులం బీడిం పంబడి యఱచుచు వసిష్ఠునొద్దకు వచ్చి యిట్లనియె.

క. నన్నేల యుపేక్షించితి, రిన్నరుల కధర్మపరుల కిచ్చితిరే వి
ద్వన్నాథ యిదియు ధర్మమె, యన్నను విని పలుక కుండె నమ్ముని యంతన్.

వ. తదీయాభిప్రాయం బెఱింగి నందినియుఁ దనవత్సంబుఁ బట్టికొన వచ్చినజనుల కలిగి చిందఱరేఁగి నిదాఘసమయ మధ్యందినదినకరమూర్తియుం బోలె దుర్నిరీక్ష్యయయి యంగవిక్షేపంబున నంగారవృష్టిఁ గురియుచు వాలంబున శబరులను శకృన్మూత్రంబుల శకయవనపౌండ్రపుళింద ద్రవిళసింహళులను ఫేనంబున దరదబర్బరులను బుట్టించి.

క. నలిరేఁగి కలఁగి తద్బల,ములు విశ్వామిత్రు సైన్యముల కేనుమడుం
గులు పెరిఁగి మూఁడుయోజన,ములు వాఱఁగ నెగిచె నొక్క మొగిఁ బ్రతిబలముల్.

వ. అట్టిబ్రహ్మతేజోజనితం బయిన ప్రభావంబుఁ జూచి విశ్వామిత్రుండు విలక్షముఖుండై క్షాత్రబలంబు నిందించి యెల్ల బలంబులకు మిక్కిలి తపోబలంబ యని.

చ. పొలుపగురాజ్యసంపదుపభోగములెల్లఁ దృణంబుగా మదిం
దలఁచి విరక్తుఁడై విడిచి దారుణశైలవనాంతరంబులన్
వెలయఁ దపంబు సేసి గుణవిశ్రుతుఁడై పడసెన్ మహాతపో
బలమున సర్వసంపదలు బ్రహ్మఋషిత్వము దివ్యశక్తియున్.

వ. ఆ విశ్వామిత్రుం డిక్ష్వాకుకులసంభవుం డయిన కల్మాషపాదుండను రాజునకు యాజకత్వంబపేక్షించి తత్పురోహితుండయిన వసిష్ఠుతో బద్ధవైరుండయి తదపకారంబు రోయుచున్నంత నొక్కనాఁడు కల్మాషపాదుండు వేఁటవోయి రమ్యారణ్యభ్రమణఖిన్నుండయి విశ్రమార్థంబు వసిష్ఠాశ్రమంబునకుం జనువాఁడు దనయభిముఖుండయి వచ్చువాని వసిష్ఠపుత్త్రుం బుత్త్రశతాగ్రజు నధిక తపశ్శక్తియుక్తు శక్తి యనుమహామునిం గని తెరువు దొలఁగు మని రాజాభిమానంబున మెచ్చక పలికిన నమ్మునివరుం డిట్లనియె

ఆ. ఎట్టిరాజులును మహీసురోత్తము లెదు, రరుగుదెంచునప్పు డధిక భక్తి
నెఱఁగి ప్రియము వలికి తెరు విత్తురిట్టిద, ధర్మ మీవు దీనిఁ దలఁప వెట్టు.

శక్తిమహాముని కల్మాషపాదుని శపించుట

వ. ఏను ధర్మపథంబున నున్నవాఁడ నేల తొలంగుదు ననిన నలిగి కల్మాషపాదుండు దనచేతికశకోల నమ్మునీంద్రుని వ్రేసిన నవమానితుండయి కోపారుణితనయనంబుల నతనిం జూచి నీవు రాక్షసాకారంబున నకారణంబ నాకు నికారంబు సేసితి కావున రాక్షసుండవయి మనుష్యపిశితంబ యశనంబుగా నుండుమని శాపంబిచ్చినఁ గల్మాషపాదుం డమ్మహామునివరు వసిష్ఠతనయుంగా నెఱింగి నాకు శాపవ్యపాయంబు ప్రసాదింపవలయునని ప్రార్థించుచున్న నచ్చోటికి విశ్వామిత్రుండు వచ్చి వారలు దన్నెఱుంగకుండ నంతర్హితుండయి కల్మాషపాదునంతర్గతుం డయియుండ నొక్కరక్కసుం గింకరుం డనువానిం బంచిన వాఁడు విశ్వామిత్రునాదేశంబునను శక్తిశాపంబునను జేసి కల్మాషపాదునంతరాత్మ నావేశించి యున్నంత.

క. రాక్షసావిష్టుఁ డైనప్డు రాజ్యలీల, విడిచి తన్నెఱుంగక తదావేశరహితుఁ
డైనయప్పుడు రాజ్యకార్యంబులందు, బద్ధబుద్ధియై కల్మాష పాదుఁ డుండె.

వ. ఆకల్మాషపాదు నొక్కనాఁ డొక్కబ్రాహ్మణుం డధికక్షుధార్తుండయి వచ్చి సమాంసం బయినభోజనం బడిగిన నిచ్చి వోయి వాఁ డంతఃపురంబుననుండి మఱచి యర్ధరాత్రంబునప్పుడు దలంచి దనబానసంబువానిం బిలిచి యే నొక్కబ్రాహ్మణునకుం గుడువ నిచ్చి వచ్చి మఱచి యుండితిం జెచ్చెర నవ్విప్రునకు మాంసంబుతోఁ గుడువం బెట్టు మని పంచిన వాఁడు నింతప్రొద్దు మాంసంబు వడయనేరననిన నప్పుడు రాక్షసాధిష్ఠితుం డగుటంజేసి మనుష్య మాంసంబుతో నయినం గుడువంబెట్టుమనిన సూపకారుండు వధ్యస్థానంబువకుంజని మనుష్యమాంసంబు దెచ్చియిమ్ముగా వండిపెట్టిన నవ్విప్రుండు దనదివ్యదృష్టిం జూచి దాని మానవమాంసంబుగా నెఱింగి కడు నలిగి.

క. తివిరి యభోజ్యం బగు మానవమాంసముతోడ భోజనము వెట్టినవాఁ
డవు నీవు మనుష్యాదుఁడ, వవుమని వాఁడిచ్చె శాప మన్నరపతికిన్.

వ. ఇట్లు బ్రాహ్మణశాపంబునం గల్మాషపాదుండు మానుషభావంబు విడిచి రాక్షసుండై శక్తియొద్ద వచ్చి నీకారణంబున నిట్టిశాపవ్యాపారంబు సంభవించె దీనిఫలంబు ముందఱ నీవ యనుభవింపు మని శక్తి నపగతప్రాణుం జేసి విశ్వామిత్రుచేతఁ బ్రచోదితుం డయి వదంపడి వసిష్ఠపుత్త్రుల నందఱ వధియించిన

తే. సుతుల రాక్షసనిహతులఁ జూచి పరమయోగధరుఁడయ్యుఁ బుత్త్రవియోగశోక
భరము దాల్చె వసిష్ఠుఁ డపారభూరి,ధరణిభరము నగేంద్రుండు దాల్చునట్లు.

చ. అమితవివృద్ధశోకవివశాత్మకుఁ డై మది నాత్మఘాతదో
షమును దలంప కెంతయు విషాదమునన్ బలవద్దవాగ్నిమ
ధ్యము వడిఁ జొచ్చినన్ బృహదుదగ్రశిఖానల మాక్షణంబ యు
ష్ణము సెడి శీత మయ్యె మునినాథున కుగ్రతపంబు పెంపునన్.

ఉ. పంబినశోకభారమునఁ బ్రాణవిమోక్షముఁ గోరి కంఠదే
శంబున రాయి గట్టికొని సన్మునినాథుఁడు నిశ్చితాత్ముఁ డై
యంబుధిఁ జొచ్చినం గడు భయంపడి వార్ధి లసత్తరంగహ
స్తంబుల నెత్తి పెట్టెఁ దన సైకతతీరముఁ జేర నమ్మునిన్.

చ. సుతశతవర్జితాశ్రమము సూడఁగ నోపక మేరుపర్వతో
న్నతపృథుశృంగ మెక్కి పడినన్ మునివల్లభుదేహబంధ మ
క్షత మయి తూలసంచయనికాశత నొప్పె ననంతసంతత
వ్రతనియమప్రభావు లగు వారలఁ బొందునె దేహదుఃఖముల్.

మధ్యాక్కర. వదలక మరణార్థి యగుచు మునినాథ వరుఁడు దా నొక్క
నది నుదగ్రగ్రాహవతిఁ బ్రవేశించి నను ముని నంట
నది యోడి శతవిధంబులఁ బర్రిదుత యయి స్థలం బయిన
నది యాదిగాఁగ శతద్రునామ మై యున్నది యొప్పె.

నక్షత్ర ఫలితాలు

[10-6-59 మొదలు 16 6-59 వరకు]

గ్రహ స్థితి.

శ		ర	బు
	తే 18 దీని మిథున ములో ప్రవేశించును. కర్కాటక, సింహ, కన్యా తులలలో చంద్రుడు.		శు కు
కే	గు		రా

అశ్విని [చూ, చే, చో, లా]

మీరు ధైర్యముతో వృత్తిఉద్యోగాలలో ముందంజవేసి, హోదా ఆదాయము పెంచు కుంటారు. క్రొత్త అనుకూలతలు ఏర్పడుతవి. మీ బుద్ధి కుశలతవల్ల ఉపద్రవాలు సాధించుతారు. మీరు వేసుకున్న పథకముప్రకారము అన్నివిధాలా డబ్బు చేతికి అంగుతుంది. మనుష్యసహాయముకూడా కలుగుతుంది. మాట పలుకుబడితో పరిస్థితులలో అనుకూలమైన మార్పులు తెచ్చుకోనగలుగుతారు. ఈశాన్య దిక్కునుండి బంధువుల కుశలవార్త తెలుస్తుంది గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, చిత్రకారులకు, నటీనటులకు యోగకాలము

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము మీకు యోగప్రదము, అవకుండా నిలిచిపోయిన కార్యములు ఈ వారము సుముఖమవుతాయి. అధికారముతో పాటు ధనాదాయముకూడా పెరుగుతుంది. బిరుదులు పొందుట, సన్మానమువంటి శుభ యోగములుకలవు. పండితగోష్ఠి, నూతన గ్రంథములు చదువుటచే విజ్ఞానాభివృద్ధికలుగుతవి. పిల్లల మేలుకొరకు మీరు కొన్ని యేర్పాట్లు చేస్తారు. వర్తకులకు లాభయోగము. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పండితులకు మేలుకాలము.

* కృత్తిక [అ, ఈ, ఉ, ఏ] *

ఈ వారము లౌకిక వ్యవహారరంగములో మీకు చాలా జయప్రదముగా వుంటుంది. ఆదాయము ఎక్కువఅవుతుంది. నీటిమీద ప్రయాణము చేయవలసివుంటుంది. కవితాగోష్ఠి, గానసభలు మున్నగు వినోదములలో బంధుమిత్రులతో కలిసి శుభకార్యములలో పాల్గొని మృష్టాన్న భోజనము చేస్తారు. బియ్యము, వెండి, నూలు, బట్టలు, వ్యాపారస్తులకు లాభము. కవులు గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. వారమంతా శుభయోగములతో కూడి వున్నా మానసిక ఆందోళన కలుగుతూ వుంటుంది.

రోహిణి [ఓ, వా, వీ, వూ]

ఈ వారము మీకు ఇష్టకార్యసిద్ధి, ధనధాన్యవృద్ధి, వివాహాది శుభకార్యములలో పాల్గొనుట యత్నకార్యానుకూలత పరోపకారగుణవల్ల కీర్తి వాహనయోగములు కల్గుతాయి. విలువగల వస్తువుల క్రయవిక్రయము

బి. నరసింగరావు

లలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. ఇంట్లో వారికి అలంకార ప్రాప్తి.

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈ వారము మీకు కార్యభారముఎక్కువ రాబడి తక్కువ. గృహోపకరణములు తీరక కలతలు. అకాలభోజనమువల్ల ఆరోగ్యము చెడుచున్న సూచనలు కనపడగానే ఔషధ చికిత్స పొందడమే కాకుండా గ్రహరాజైన రవికి శాంతిచేయించుట మేలు. ఉద్యోగస్థులకు క్రొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన రాజకీయ వాదులకు అశాంతి. 10 కార్యభారము త్రిప్పట 13 తేదీని పితృవర్గ సహాయము ధనలాభము ప్రయాణము 15 అనారోగ్య సూచనలు.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారము మీకు మిశ్రమయోగము. మొదట్లో మీకు నిరాశగావున్నా మిత్ర సహాయమువల్ల కార్యలాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన ఉద్యోగస్థులకు ఏమంత బాగుండదు. విద్యార్థులకు బద్ధకమువల్ల చదువు బాగా సాగదు. ఆప్తుల ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. వారములో అనయోగములున్నా మిత్రసహాయము, కార్యసిద్ధి, విదేశీయుల పరిచయము, విచిత్రవస్తువుల సంపాదనవంటి మంచియోగాలు కూడా వుంటాయి.

* పునర్వసు [కే, కో, హా, హీ]*

ఈ వారము మీరు సహాయము పొందదలచుకున్న వ్యక్తిమూలముగా కార్యహాని పొందుతరు. ధనాభావముకూడా ఎక్కువ. ఇంట్లో వారి ఆరోగ్యము సరిగా ఉండనందున చింతకలుగుతుంది. అయినా ఆధ్యాత్మిక భావముకలవారగుటచేతను దైవముపై భారం వేసి కార్యలాభము పొందుతారు. ఉద్యోగస్థులకు ఒత్తిడి, వర్తకులకు నిరాశ. విద్యార్థులకు మంచిరోజులుకావు. పుణ్యక్షేత్ర సంచారము దేవతాదర్శనము. విచిత్రములను చూచుట, వస్త్రద్రవ్యలాభము కలుగును. వారమంతా అశుభయోగశుభయోగ మిశ్రమముగా వుంటుంది.

* పుష్యమి [హూ, హే, హో, డా]*

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. ప్రయత్నించిన కార్యములు ఎక్కువ శ్రమతో ఫలిస్తాయి. కోర్టుదావాలు అనుకూలిస్తవి. ఇతరులకు చేయదలచుకున్న సహాయము చేయలేకపోవుటచేతను నిందలు పొందుతారు. ఉద్యోగస్థులకు అధికారుల అనాదరణ, తోటివారి సహకారము కలుగుతాయి వర్తకులకు వారమంతా నిరాశగా వున్నా వారాంతమున మేలుపొందుతారు. విద్యార్థులకు చదువు బాగాసాగదు. 15న భార్యకు అనారోగ్యము కలుగుటచే ఆందోళన.

* ఆశ్లేష [డీ, డూ, డే, డో] *

ఈవారము ఎన్ని ఆటంకములు వచ్చినా పట్టు విడవకుండా ప్రయత్నించి కార్యలాభము పొందుతారు. అనుకున్న సొమ్ము సమయానికి రాక అప్పుచేస్తారు. దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును రసాయనిక శాస్త్రజ్ఞులకు, లోహఖనిజ వ్యాపారస్థులకు కష్టములో కూడిన లాభము గనుల యజమానులకు, యంత్రములు నడుపు

★ నక్షత్రఫలితాలు ★

విభుణులకు ఇంజనీరింగు శాఖ ఉద్యోగులకు మేలు కాలము. 10 న ప్రమాద సూచన.

* మఖ [మా, మీ, మూ, మే.]

గత రెండువారముల నుండి కలుగుచుండిన కష్టములు గడిచి అధికారుల సహాయముచేతను మీ నేర్పరితనముచేతను కార్యసిద్ధిని పొందుతారు. ఆర్థికస్థితి బాగుపడుతుంది. వారమంతా యోగప్రదముగా వుంటుంది. ప్రయాణము, అధికారుల ఆదరణ బంధు సహాయము కలుగుతవి. విద్యార్థులకు మేలుగా వుంటుంది. డాక్టర్లకు, గణిత శాస్త్రజ్ఞులకు కవులకు చిత్రకారులకు శిల్పులకు, నటీనటులకు యోగ కాలము. 15 న అధిక ఖర్చులు

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ.]

ఈ వారము అన్ని ఇబ్బందులు తీరుతవి. అనుకున్న సొమ్ము చేతికివస్తుంది. కోర్టు దావాలు అనుకూలముగా తీర్పు అవుతవి. పిల్లల మేలుకొరకు కొన్ని యేర్పాట్లు చేస్తారు. నూతన కార్యారంభము చేస్తారు. ప్రభుత్వ సన్మానము కలుగుతుంది. పండితులతో శాస్త్రగోష్ఠి జరిపి జ్ఞానము వృద్ధిచేసుకుంటారు. విద్యార్థులు శ్రద్ధతో కొత్త విషయాలు నేర్చుకుంటారు. వారమంతా యోగదాయకము. 10 న ఆందోళన కలుగుతుంది. ఇంట్లోవారి ఆరోగ్యము బాగుపడుతుంది. పండితులకు, ఉపాధ్యాయులకు, న్యాయవాదులకు న్యాయస్థాన ఉద్యోగస్తులకు మేలుకాలము.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
(టే, టో, పా, పీ)

ఈ వారము మీకు యోగదాయకమైనను మానసికాందోళన కలుగుతుంది. నీటిమీద ప్రయాణము చేస్తారు. బంధుమిత్రులతో కలిసి కవితాగోష్ఠి, గాన సభలవంటి వినోదాలలో పాల్గొంటారు. దూరమందున్న ఆప్తుల క్షేమవార్త తెలిసి సంతోషం పొందుతారు. నూలు, బట్టలు, బియ్యము, వెండి వ్యాపారస్తులకు వారమంతా లాభదాయకముగా వుంటుంది. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. శుభకార్యాలలో పాల్గొంటారు.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

గతవారము పూర్తికాకుండా ఉండిపోయిన పనులు ఈ వారము లాభకరముగా చేయగలుగుతారు. ధనయోగము అనుకున్నదానికన్నా ఎక్కువగా కలుగుతుంది. పుణ్యకార్యాచరణలో పాల్గొంటారు. విలువగల వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు లాభము కలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికారము పెరుగుతుంది. స్త్రీలతోనూ, బంధువులతోనూ కలిసి విందు వినోదములతో ఆనందిస్తారు. కవులకు, గాయకులకు కళాకారులకు, నటీనటులకు మేలుకాలము.

చిత్ర [పే, పో, రా, రీ]

ఈ వారం యత్నకార్యములకు ఆటంకములు. కార్యభారము ఎక్కువ. తీరుబడిలేని కార్యక్రమమువల్ల అకాలభోజనము చేయుటచే ఉష్ణాధిక్యము, కడుపునొప్పి వంటి అనారోగ్యసూచనలు కనపడగానే ఔషధ-చికిత్స పొందుట మేలు. వర్తకులకు శ్రమ ఎక్కువ. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడిచే శెలవు పెట్టవలసివస్తుంది. రాజకీయ వాదులకు మేలుగావుంటుంది. పితృవర్గమునుండి సహాయముచే ధనలోపముకొంత తీరుతుంది.

* స్వాతి [రూ, రే, రో, తా]*

ఈ వారము నిరాశగావుంటుంది. గాని మిత్రసహాయంవల్ల క్రమేణా కార్యలాభము పొందుతారు. రహస్యములను కనిపెట్టుటకు ప్రభుత్వముచే నియోగించబడుతారు. ధనలోపమువల్ల ఆందోళన, ఉద్యోగస్తులకు బదిలీఅయే యోగములున్నవి. వర్తకులకు మాంద్యము. విద్యార్థులకు శ్రద్ధతక్కువ. ప్రయాణము. విదేశీయులతో పరిచయము వింత వస్తువుల సంపాదన, కార్యసిద్ధి కలుగుతాయి. ఇంట్లోవున్న వృద్ధుల ఆరోగ్యము చెడుటచే ఆందోళన కలుగుతుంది.

* విశాఖ [తీ, తూ, తే, తో] *

ఈవారము మీరు అనుకున్నట్లు పనులు జరుగవు. ధనాభావముచే ఇబ్బంది ఎక్కువ. ఏ వ్యక్తి సహాయమువల్ల పనులు చేయదలుచుకున్నారో అతనే ఆటంకములను

—ఈ వారము ధరలు:—

నూలు, వస్త్రములు:- తగ్గుదలలో వుండును
నూనెదినుసులు:- స్వల్పముగా పెరుగును.
ఆహారధాన్యములు:- మార్పు లేదు.
బెల్లము, పంచదార:- చింతపండు:- మార్పు లేదు.
పప్పుదినుసులు :- మందముగావుండును.
వెండి, బంగారము:- స్వల్ప తేడాలో వుండును. సపాట్యానుకూలము గావచ్చును

జన్మనక్షత్రమును బట్టిగాని, జన్మనక్షత్రము తెలుగనివారు నామనక్షత్రము (వారివారి పేర్ల ననుసరించి పేరు మొదటియక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణ అను పేరునకు మృగశిరానక్షత్రమును, హృష్ణు ను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడను పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయునూ చూచుకొనునది.

లుగజేస్తాడు. ఆధ్యాత్మిక చింత కలవారగుటచే ఈశ్వర కృపవల్ల కష్టములనుగడచి కార్యసిద్ధిపొందుతారు. ఇంట్లో వారి ఆరోగ్యము ఆందోళన కలిగించుతుంది. ఉద్యోగస్థులకు ఒత్తిడి. వ్యాపారస్థులకు నిరాశ కలిగినా నష్టద్రవ్యలాభము కలిగిస్తుంది. సాధుసజ్జన సాంగత్యముచే ఆత్మవికాసము కలుగుతుంది.

* అనూరాధ [నా, నీ, నూ, నే] *

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ రావలసినడబ్బు చేతికందక అశాంతి. బంధువుల రాకపోకలవల్ల ఖర్చులు ఎక్కువ. కోర్టు వ్యవహారములు కొంతవరకూ అనుకూలిస్తవి. పనులకు చేయదలిచే సహాయము చేసేందుకు అవకాశములేక మాటపడతారు ఉద్యోగస్థులకు కొత్త సమస్యలవల్ల కార్యభారము ఎక్కువ. వర్తకులకు వ్యవహారముపట్ల పేచీలు 10 న భార్య అనారోగ్యమువల్ల మనోవ్యధ విద్యార్థులకు బద్ధకముచే చదువుబాగా సాగదు.

* జ్యేష్ఠ [నో, యా, యీ, యూ,] *

మీ ఆలోచనలు కార్యరూపమునకు వచ్చేందుకు కలిగే ఆటంకములకు నిరుత్సాహపడకుండా పట్టుదలతో ప్రయత్నించి తుదకు కార్యసిద్ధి పొందుతారు. సమయానికి సొమ్ము అందక అప్పుచేయవల వస్తుంది. కాని వారాంతమునకు తీరుస్తారు. 10 న యంత్రములవల్లగాని, అగ్నివల్లగాని ఎత్తయిన స్థలమునుండి పడుటవల్లగాని కలిగే గాయాలు జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు, లోహపుసామానులు, రంగుల వ్యాపారస్థులకు, గనుల యజమానులకు కష్టముతో కూడిన యోగము. ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు, యంత్రములు నడుపు నిపుణులకు యోగకాలము.

* మూల [యే, యో, బా, బీ] *

ఈ వారము మీకు ధనయోగము. వ్యవహారాలలో జయము. శుభ కార్యాలలో పాల్గొంటారు. బంధుదర్శనము విద్యాప్రాప్తి, నూతన కార్యలాభము. ఈశాన్య దిక్కునుండి శుభవార్తతో పుత్తరములు వచ్చుట, జ్ఞానమార్గ ప్రసంగములు, యుక్తిగా ప్రసంగించుట, గణిత జ్యోతిష శాస్త్రచర్చలు, సుఖభోజనమువంటి మంచి ఫలితాలు కలుగుతాయి. ప్రత్తి, దూది, నూలు, వస్త్రములు 'ఇత్తడి, కంచు మొదలగు సరుకుల వ్యాపారస్థులకు లాభము. కవులకు, చిత్రకారులకు, శిల్పులకు, నటీనటులకు మేలుకాలము. విద్యార్థులకు చదువు సరిగా సాగుతుంది.

* పూర్వాషాఢ [బూ, ధ, ఫా, డా] *

ఈ వారము శుభ కార్యములలో పాల్గొనుట. పుత్రప్రాప్తి సూచనలు, ధనలాభము. భాగ్యవృద్ధి, బిరుదులు పొందుట, ప్రభుత్వ సన్మానము ఘన కార్యాచరణ, పుణ్య కార్యములు చేయుట, పుణ్యక్షేత్ర సంచారము వైద్యజ్యోతిష శాస్త్ర ప్రసంగములవంటి మంచి యోగములు కలుగును. విద్యార్థులకు, పండితులకు, న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు మంచికాలము.

* ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ] *

ఈ వారము మీరు వినోదాలలో పాల్గొంటారు. బంధుమిత్రులతో కలిసి వెండి పాత్రలలో దధి; క్షీర మధుర పదార్థయుక్త సుఖభోజనము చేస్తారు. నీటిమీద ప్రయాణము, తలపెట్టిన కార్యములలో జయము, తెల్లటి వస్తువులు కొనుటవంటి మంచియోగములు కలుగును. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి, ద్రవపదార్థముల క్రయవిక్రయములలో వర్తకులకు లాభము. ఈ వారము మానసికాందోళన వున్నా అలంకారప్రాప్తి, విందు వినోదము కలుగును. కవులకు, గాయకులకు, నటీనటులకు మేలుకాలము. విద్యార్థులు బాగా చదువుకొంటారు.

* శ్రవణము [జూ, జే, జో, ఘా] *

ఈవారము. ధనధాన్యవృద్ధి, పశువృద్ధి కలుగును, కష్టము ఫలించును. వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, ఇష్టవస్తులాభం, పరోపకారమువల్ల కీర్తి మొదలగు రాజయోగములు కలుగును. విద్యార్థులు వినోదాల్లో పాల్గొన్నా చదువు బాగా సాగుతుంది. వర్తకులకు బంగారము నవరత్నములువంటి విలువగల వస్తువుల క్రయ విక్రయములలో లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలం.

* ధనిష్ఠ [గా, గీ, గూ, గే] *

ఈవారము మీకు కార్యభారముఎక్కువ. ఆరోగ్యము సరిగా లేని సూచనలు కనబడగానే గ్రహాంశైన రవికి శాంతిచేయుట మేలు కలిగించును. ఔషధచికిత్సకూడా పొందుట మంచిది. ఉద్యోగస్థులకు కొత్త సమస్యలు, వర్తకులకు ఆందోళన, విద్యార్థులకు సరిగా చదువు సాగదు. పితృవర్గము నుండి సహాయము ప్రయాణముకార్యభారము కలుగును. 10 న ఆరోగ్యభంగము. రాజకీయవాదులకు ఆందోళన, అధిక ఖర్చులు.

* శతభిషం [గో, సా, సీ, సూ] *

ఈవారము అనుకున్న సొమ్ము సకాలములో చేతికిరాదు. కార్యాచరణకు పాలుపోని అనిశ్చితస్థితిలో వుంటారు. చేదామనుకున్న పనులకు ఆటంకములుకలిగినా వారాంతమునకు మిత్రసహాయమువల్ల కార్యలాభము కలుగుతుంది. ఉద్యోగస్థులకు వన పర్వత ప్రాంతములకు బదిలీఅయ్యే సూచనలున్నవి, ప్రయాణము, విదేశీయుల పరిచయము, విచిత్రవస్తుసంపాదన, మిత్రసహాయము కలుగును. 10 న అప్తుల ఆరోగ్యము గురించి చింత. విద్యార్థులకు చదువు బాగా సాగదు.

* పూర్వాభాద్ర [సే, సో, దా, దీ] *

ఈవారము మీకు మిశ్రమయోగము. అనుకున్నట్టుగా పనులు జరుగవు. కోరిన సహాయము సకాలమునకు లభించదు. అవసరములు తీరక ఆందోళన కలుగుతుంది. దైవముపై భారము వేసి కార్యసాధనకు ప్రయత్నించి ఫలము పొందుతారు. వర్తకులకు చాలాకాలమునుండీ నిలిచిపోయిన బాకీలు వసూలవుతవి. వ్యర్థ ప్రసంగములవల్ల ఉద్యోగస్థులు అధికారుల ఆగ్రహమునకులోనౌతారు. పుణ్యపురుషుల సాంగత్యము. ఆత్మవికాసము. శాంతి, పుణ్యక్షేత్ర సంచారము, దేవతా దర్శనము, నష్టద్రవ్య లాభము కలుగును. 15న ఇంట్లోవారి అనారోగ్యముచే చింత.

* ఉత్తరాభాద్ర [దూ, శం, ఛా, థా] *

మీ ఆలోచన ప్రకారము కార్యక్రమాలు నెరవేరడానికి కొందరు అడ్డు వస్తూంటారు కొన్ని సందర్భములలో అశాంతి, బంధు విరోధము వచ్చును. కోర్టుదావాలు అనుకూలముగా తీర్పు అయినా మరికొన్ని కొత్త చిక్కులు కలుగుతవి. కొర్రలు, రాగులవంటి అపరదినుసులు, మినుములు, ఉప్పు, నువ్వులు, నూనె సంబంధముగు వస్తువులు వర్తకులకు లాభము. అన్యజాతి వారివల్ల గౌరవము కలుగుతుంది. 10న భార్యకు అనారోగ్యము, అధిక ఖర్చులు.

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈ వారము ఎంత ప్రయత్నించినా అనేక ఆటంకములు కలుగుతవి. సాహసము పట్టుదల కలవారగుటచే నిరాశ చెందక ప్రయత్నించి కలిగిన చిక్కులను విప్పుకొని మేలు పొందుతారు. సోదరసహాయమువల్ల ఒడిదుడుకులు సర్దుకుంటాయి. జాగ్రత్తగా వుండవల్ల అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదము తప్పవచ్చును. గనుల యజమానులకు భూగర్భశాస్త్రజ్ఞులకు, లోహ, ఖనిజ, వ్యాపారస్థులకు పోలీసుశాఖ ఉద్యోగులకు కష్టముతో కూడిన యోగము. ★



వనితా లోకం



మొహమాటం

టి. రామలక్ష్మి

జవహర్ జీ జీవితచరిత్రలో కొబోలు చదివినట్లు జ్ఞాపకం. ఓమాటు గోఖలే గారు బంకిపురంనుండి రైల్లో ప్రయాణం చెయ్యవలసివచ్చిందట. ఆయన అప్పుడు పబ్లిక్ సర్వీస్ కమీషన్ మెంబరవటంచేత మొదట తరగతి కంపార్టుమెంటులో ప్రయాణంచేయుటానికి హక్కువుండేది. అనారోగ్యంగా వుండటం వలన, చూడవచ్చినవారి బాధ తప్పించుకొని తన కంపార్టుమెంటులో కూర్చొనివుండగా, ఆయనతో కొద్దిగా పరిచయంవున్న భూపేంద్రనాథబోసు అనే ఆయన లోనికివచ్చి "నేనూ మీకంపార్టుమెంటులో ప్రయాణం చేయవచ్చా?" అనడిగాడట. గోఖలేగారు లోలోపల యిబ్బందిపడినా సరేనని ఒప్పుకున్నారుట. కాసేపూరుకొని బోసుగారు "నా స్నేహితులొకరున్నారు, వారూ రావచ్చా?" అనడిగారట. పాపం మొహమాటం కొద్దీ కాదనలేక తలవూపాడుట ఆయన.

క్రింద గోఖలేగారు అనారోగ్యంతో పడుకొనివుండగా పైన బోసుగారూ ఆయన స్నేహితుడూ కూర్చున్నారుట, కానీ పైన వారిద్దరికీ స్థలం చాలేదు. అంచేత బోసుగారు తిరిగి గోఖలేగారితో "ఏమండీ! మీ రొక్కరూ కొస్తా పైన సర్దుకుందురూ! మే మిద్దరమూ క్రింద సర్దుకుంటాము. ఇక్కడ యిద్దరకూ బొత్తిగా యిరకాటంగా వుంది" అన్నారుట. వల్లమాలిన మొహమాటం అడ్డుపడటంతో వారు దానికీ ఒప్పుకొని క్రింది స్థలంవారి కిచ్చి పైన అనారోగ్యంతో స్థలం యిరకటంతో అవస్థపడటానికిగూడా ఒప్పుకొన్నారుట గోఖలేగారు! అసలు రాజకీయ నాయకుడి మొహమాటంగురించి వినటం - చదవటం - అదే మొదటిమారు కావటంచేత యిప్పటికీ బాగా జ్ఞాపకంవుంది ఆ సంగతి.

* * *

అసలు మొహమాటంతో వచ్చిన చిక్కంతా అదే! మనల్ని కష్టపెట్టుకొని గూడా ఎదటివారిని సుఖపెట్టమంటుంది. కానీ బొత్తిగా స్వార్థంలేని పరార్థం ఎవడికి కావాలండీ! అంచేత అది మనకు నచ్చదు. మనకున్న సదుపాయాలు కాసినీ వదులుకొని ఎదటివారిపరంచేసి మనల్ని యిరకాటాన పడేసి యిబ్బందులు అనుభవించండి అంటుంది మొహమాటం! ఎదటివాళ్ళ చేతికి మన చేతిని అందించి మన నెత్తిన మొట్టమని అడిగే పిచ్చివారు ఎవరైనా వుంటారా? — వుండరు. కానీ మొహమాటం మనతో అంతపనీ చేయిస్తుంది. అందుకే 'మొహమాటం' అనేది ఓ తప్పు కాదుగానీ ఓ పెద్ద సైజు యిబ్బంది అంటాను నేను!

అందుకే మొహమాటపడటం చేతగాని వాళ్ళు, తెలివైనవారు. మొహమాటపడటం మానేసినవారు అదృష్టవంతులు. కొన్ని విషయాల్లోమాత్రం మొహమాటపడేవారు అనాగరికులు, అన్ని విషయాల్లో మొగమాటపడేవారు ఎప్పుడూ బాధపడే దీర్ఘరోగులు.

మనకు స్వతంత్ర భావాలున్నా, నలుగురిలో ఆ భావాలపైని ఆమోదముద్ర వేయించుకోగలమన్న ధైర్యమున్నా ఎదటివారికి చెబితే ఏమనుకుంటారో అనే సంకోచం కలిగిస్తుంది ఈ మొహమాటం! నలుగురమూ కలిసి ఓచోట కూర్చొని మాటలాడుతుంటామనుకోండి. ఎదటివారు ఏవో తప్పు అభిప్రాయం చెబుతారు. దాన్ని తప్పు అనటానికి మనం సాహసించలేము–కానీ అది ముమ్మాటికీ తప్పు అని మనకు తెలిసీ వుంటుంది. పచ్చికోతలు కోస్తారు. అవి కోతలనీ వాటికి వెనకాముందూ ఆధారాలు లేవనీ మనకు తెలిసినా నోరుమెదపము. వారెక్కడ బాధపడిపోతారో అనో, లేకపోతే మనల్ని పొగరుబోతులనుకుంటారనో వారి మాటల్ని మన అంతఃకరణ కాదంటున్నా తలఊగిస్తాము. స్వాతంత్ర్యం వుండికూడా అనుభవించలేని బానిసలను మల్లే ప్రవర్తిస్తాము.

ఒకరోజు పొరుగింటి శారద ఓ యాడు రూపాయలుంటే యివ్వమని తర్వాత రెండు


రోజుల్లోనే యిచ్చేస్తానని అడిగింది. నా దగ్గర అప్పుడు నాలుగు రూపాయలున్నాయి. ఏవో డిజైన్ల పుస్తకాలు కొందామని పెట్టుకున్నా. అమధ్య ఏదో పేపర్లో నిట్టింగ్ పుస్తకాలగురించి ఏదో ప్రకటనవేసివుంటే చూశాను. ఏవైనా డిజైన్ల పుస్తకాలుంటే పంపమని వాళ్ళకు రాశాను. వారి జవాబు కోసం ఎదురుచూస్తూ ఆ డబ్బు అలాగే దాచుకున్నా. శారద త్వరగా యిస్తుందో లేదోననే భయంవున్నా దగ్గరవుండగా లేదనటం చేతగాక యిచ్చేశాను. తర్వాత వారంరోజులకు నాకు ఆ డిజైన కంపెనీవారి దగ్గర్నుండి వారి దగ్గరున్న రకరకాల డిజైన్ల పుస్తకాలతాలూకు లిస్టు వచ్చింది. అందులో నాకు కావలసినవాటిని సెలక్ట్ చేసుకొని పంపమని ఉత్తరం రాశాను; అది వి. పి. పి. వచ్చేలోగా శారద డబ్బిస్తుందనే ఆశతో. పార్సెలు వచ్చింది. కానీ శారద డబ్బివ్వలేదు. బహుశా అప్పుపుచ్చుకొన్నట్లుగూడా మరచిపోయినట్లుంది. డబ్బివ్వమని ఆవిడగారి సోగా అడగటమో తోచలేదు పైగా శారదతో నాకొస్టై పరిచయంగూడాలేదు. శారద చెల్లెలికీ నాకూ బాగా స్నేహం. అంచేత శారదను తిన్నగా అడగలేక ఆవిడ చెల్లెలికి చెప్పాను. ఆ అమ్మాయి వెళ్ళి వాళ్ళక్కనడిగింది. ఆ మర్నాడు శారద కందగడ్డలా మొహంచేసుకొని రుసరుసలాడుతూవచ్చి "ఏమమ్మా! నేను నీ దగ్గర అప్పు తీసుకున్నానని ఇంటిల్లిపాదికీ చెప్పి అడిగించాలా? నీకంత అవసరమైతే నన్నే అడగ్గూడదూ? రేపో ఎల్లుండో ఇచ్చేస్తాంలే, నేరక తీసుకున్నాంగాని!" అని వెళ్ళిపోయింది. నేను అసలువిషయం చెప్పటం చేతగాక గుక్కిళ్ళు మింగాను. ఆవిడ, తర్వాత వి. పి. పి. వెళ్ళిపోయిన రెండురోజులకు డబ్బు తెచ్చియిచ్చింది ఇలా వుంటాయి మొహమాటంతో బాధపడేవారి అవస్థలు.

పుస్తకాలవిషయం తీసుకున్నా అంతే! చదువుకుంటానికి పుస్తకాలు తీసుకోస్తే "అదేమిటిలే! మీ పుస్తకాలు మీ కెప్పుడైనా చదువుకోవచ్చు. నే నీరోజు చదివి రేపు తెచ్చిస్తాలే!" అని పట్టుకెళ్తారు. మరువాడు తెచ్చివ్వరు. పోనీ మనమడిగామంటే "ఏం? అంత తూచి తూచి అడగాలా? మీ పుస్తకం కొరుక్కు తినంలే. చివరికొచ్చాను. కాస్తావుంది. చదివి యిస్తాను" అంటారు. అలాగే కొన్నిరోజులపాటూ వాయిదా వేసుకుంటూపోయి చివరకు వారికి జాలికలిగి మనముఖాన పారేస్తారు. లేకపోతే ఎక్కడికో పారిపోయిందంటారు.

ఈమధ్య పత్రికలలో వచ్చిన డిజైన్లూ వ్యాసాలూ బైండుచెయించాను. ఆపుస్తకం చూసి మా ఫ్రెండు ముచ్చటపడి అడిగింది అందులో డిజైన్లూ ట్రేస్ తీసుకొని యిస్తానని. నేనూ అప్పుడే దిండుగలీబులకు గుడ్డ తెప్పించి డిజైన్లు కాపీ చెయ్యాలనుకుంటున్నా. కానీ నేను ఇద్దామా వద్ద అని ఆలోచిస్తుండగనే ఆమెగారు పుస్తకమంగుకొని మూడురోజుల్లో తెచ్చిస్తానండీ అని వెళ్ళిపోయింది. తర్వాత మూడురోజులకే పుస్తకం తిరిగివచ్చిందిగానీ పుస్తకం తెరిచిచూస్తే అందులో డిజైన్లు దాదాపు అన్నీ శిథిలమైవున్నాయి. ఒక్కోడిజైను ఎన్నిమార్లు ట్రేసుచేత్తారో కానీ అన్నీ చిరిగి చిల్లులు పడివున్నాయి. ఒక్క డిజైనూ యింకోమారు ట్రేసు తీసుకుంటానికి పనికొచ్చేలాలేదు. కళ్ళలో నీళ్ళు తిరుగుతూవుంటే గబుక్కున పుస్తకం మూసేసినా మొహమాటాన్ని తిట్టుకుంటూ కూర్చున్నాను.

మనకు బాగా తెలిసినవాళ్ళ దగ్గరయినా, బొత్తిగా తెలీనివాళ్ల దగ్గరయినా మనంసహజంగాఅంత మొహమాటపడటం ఎంచేతంటే బాగా పరిచయమున్న వాళ్ళయితే-వాళ్ళకు దాదాపు మనల్ని అర్థం చేసుకునే శక్తి వుంటుంది. మన అలవాట్లనూ, అవసరాలనూ విధిగా గుర్తించవలసి వుంటుంది. అంచేత అలాంటివారి ఎదట మనం మొహమాటపడినా, పడకపోయినా వచ్చేనష్టం ఏమీ వుండదు, బొత్తిగా తెలీనివాళ్ళయితే మనం మొహమాటం చూపించవలసినంత అవసరమైనా వుండదు. ఏదో ఊరుపోక ఎక్కడో ఓ సందర్భంలో ఒకాటి రెండుమార్లు పలకరించుకొని పరిచయం చేసుకుంటారే - మా ఫ్రెండు ఫ్రెండులాంటివారు - వారిదగ్గరే అసలు మొహమాట పడటమూ జరుగుతుంది దానికి తగినంత నష్టమూవుంటుంది.

పుస్తకాలూ- డబ్బూ- ఈ రెండు విషయాల్లో సాధ్యమైనంతవరకూ మొహమాటం మానెయ్యాలి. అలాచెయ్యటం యిచ్చేవారికీ పుచ్చుకునేవారికి గూడా లాభకరం. పుస్తకాల విషయంలో అయితే యిచ్చినవారికే మాత్రమే బాధ మిగులుతుంది. కానీ డబ్బు విషయంలో యిచ్చినవారూ, పుచ్చుకున్నవారూ యిద్దరూ బాధపడవలసి వస్తుంది. ఎదటివారి వస్తువులు తెచ్చుకున్నాక అవి శిథిలంకాకుండా అప్పగించే అలవాటు మన సమాజానికి అబ్బేదాకా ఈ మొహమాటం అనర్థదాయకంగానే వుంటుంది! ★


యజమాని :-"ఒరే, నువ్విక్కడే తగలడ్డావ్? ఇంట్లో ఎవరూ లేరనుకున్నానే!"

జీతం రాగానే

"ఏమండీ, మా బాకీ ఇప్పిస్తారా, అని అడుగుతున్న పెరుగమ్మాయికి, "జీతం రాగానే మొత్తంగా సర్దేస్తానమ్మా" అని చెప్తోంది పక్కింటి కుసుమ.

పక్కింటి కుసుమే కాదు. చాలా మంది గృహిణులు "జీతం రాగానే బాకీ సర్దుతాను" అని చిన్న చిన్న బాకీలవాళ్ళకు చెప్పటము సహజము. ముఖ్యంగా చిన్న చిన్న పాలు, పెరుగులాంటి బాకీలకు సర్ది చెప్పటానికి, ఇంట్లో ఆడవాళ్లకు తల ప్రాణం తోకకు వస్తుంది. ఈ పిడకలు, పాలు మొదలయిన చిన్న బాకీలు మొగాళ్లను అడిగేవి కావు. సహజంగా చాలా మంది మధ్య తరగతి కుటుంబీకులకు ఆ వచ్చే జీతమేదో చేతికివ్వ స్తేగాని ఈ బాకీలన్నీ సర్దటానికి వీలుండదు. మధ్య తరగతి కుటుంబాల్లో ఆడవాళ్లు ఫస్టు తారీఖు ఎప్పుడెప్పుడా అని కళ్ళల్లో వత్తులు పెట్టుకొని చూడటము పరిపాటి. ఒక పక్క లాగేవాళ్లు పీకేవాళ్ళ నందరినీ జీతము వచ్చేంతవరకు ఆపే టప్పటికి బ్రహ్మప్రళయమయినంతపని. ఇంట్లో ఆడవాళ్ళ బాధల్ని గుర్తించకుండా జీతము వచ్చిన తరువాత ఆడవాళ్లను నానా అప్పులు పెట్టిగాని ఒక పట్టాన జీతం చేతికి ఇవ్వని మహానుభావులు చాలామంది. అంతమాత్రాన సానుభూతితో ఇంట్లో ఆడవాళ్ళ బాధల్ని సహనంగా పరిశీలించి సహకారమిచ్చే మగవాళ్లు లేరని కాదు. కాని వాళ్ళు చాలా తక్కువమంది.

బోయిన సుశీల

తనకుమాలిన ధర్మం

మాకు తెలిసిన ఒకాయన వున్నాడు. ఆయన పెద్ద ఉద్యోగస్థుడు. ఆయన జీతం రాగానే చాలా వరకు దానధర్మాలు చేస్తాడు. కొంత అనాథశరణాలయానికి, కొంత మహిళా సంఘం అభివృద్ధి కార్యక్రమాలకు, ఇట్లా చందాలిచ్చేసి, మిగిలిన కొద్ది డబ్బు ఫస్టువెళ్ళిన ఏ పదిరోజులకో గాని భార్య చేతికివ్వడు. బాకీలన్నీ సర్దేటప్పటికి చేతిలో ఏమీ మిగలదని ఆమె ఒకటే గోల. ధర్మం చెయ్యొచ్చు. బీదలపై సానుభూతి చూపించవచ్చు కాదనను. కాని మన శక్తినిబట్టి ధర్మం చెయ్యాలి. ధర్మంచేస్తే అరణా. అణా. మహాఅయితే బేడ. అంతే కాని మనం లక్షాధికారులము కానప్పుడు, ఎంత బాధపడినా ఎగుగూ బొగుగూ లేని మధ్యతరగతి జీవితాలను భారంగా లాగే టప్పుడు, ఫస్టుతారీఖున జీతంనోట్లు కనపడగానే ముందు వెనుక లాలోచించకుండా రూపాయలు రూపాయలు దానం చేసేయడం భావ్యం కాదు. పైగా అది అనుచితము. అక్రమము మన ఇంట్లో వాళ్లను అన్యాయము చేసి బయట దానాలు చేస్తే ఏం? ధర్మాలు చేస్తే ఏం? తనకుమాలినధర్మం తగదుగదా. వల్లమాలిన ధర్మంవల్ల కాటితో సమానమనే మన ఆర్యోక్తి వుండనేవుంది.

ఇంకో ఆయనున్నాడు. ఆయన ఫస్టుతారీఖున జీతం పుచ్చుకోవటము ఆలస్యం, బట్టలకొట్టు కెళ్లి, తనకొక రెంటుసూటులు, భార్యకు ఒక నైలాన్ చీర, పిల్లలకు తలొక జతబట్టలు తీసేస్తాడు. "మొన్ననే గదండీ, పోయినఫస్టుకి అందరికీ బట్టలు తెచ్చారు. మళ్లీ ఇప్పుడందరికి బట్టలెందుకండీ. ఈ మిగిలిన డబ్బుతో బాకీలన్నీ ఎట్లాగు సర్దేదండీ", అని ఆమెగోల "నీకు తెలీదు లేవే. ఈ ప్రపంచములో డాబు సరిగా వున్నవాడే మనిషి. తక్కువగా వుంటే ఈ ప్రపంచములో మనం చలామణీ అవలేము." అని అంటాడాయన. "నా బొంద డాబుసరి, అని ఆమె పోరుతూనే వుంటుంది. ఆయనట్లా ఫస్టు ఫస్టుకి బట్టలు తెస్తూనే వుంటాడు. ఇక పాపమామె బాకీల వాళ్లందరికి సగం సగం సర్ది "మిగిలింది రేపు ఫస్టుకి జీతం రాగానే దాంతోకలిపి సర్దేస్తా" నని సమాధానం చెప్తుంటుంది. జీతం వచ్చేదాకా "జీతం రాగానే సర్దేస్తా. జీతం రాగానే సర్దేస్తా" అని చెప్పటము ఒకవంతు జీతం వచ్చిన తరువాత సగం సగం సర్ది చెప్పటము ఒకవంతు. చివరకి చిల్లరబాకీలవాళ్లు మిగుల్తారు. రూపాయకీ అర్ధకీ మాటపడాల్సి వస్తుంది. ఒకపక్కన "ఫలానావాళ్లు మాకింత ఇవ్వాలి" అని బాకీలవాళ్ళు గోల చేస్తుంటే మనం డాబుసరిగా, దర్జాగా వుంటేమాత్రం ఏం పరువు? దానికన్నా బాకీలన్నీ ఎప్పటికప్పుడు సర్దేసుకుని సామాన్యంగా వుండటమే అనేకరెట్లు నయం. అప్పుడు "ఏమండోయ్ ఇట్లా అయితే ఎట్లా అండీ?" అనే భార్యపోరూ వుండదు. "ఏమండీ మాబాకీ" అనే ప్రత్యక్ష యము


దినదినానికీ, దినదినానికీ...
రెక్సోనా
సబ్బు
మీచర్మమునకు
అతిసౌందర్యమునిచ్చును
రెక్సోనాతో మీ ముఖము కడుగుకొనే ప్రతీ
మాటూ...మీ చర్మము అతి మనుపుగాను, అతి
మృదువుగాను వుండును: ఎందుచేతననగా రెక్సోనాలో
కేడిల్ గలదు—మీ చర్మమును పోషించునట్టిన్ని.
చర్మసౌందర్యము గలిగించునట్టిన్ని మూనెల
ప్రత్యేక మిశ్రమము. రెక్సోనా యొక్క మీగడ
వంటి నురగను మీ చర్మములోకి బాగా రుద్ది
స్నానముచేసి, అది దినదినానికీ ఎంత అతి
సౌందర్యముగా నుండునో చూడండి,
మీ సౌందర్యం కోసం......రెక్సోనా
Rexona
Rexona
BLENDED WITH CADYL
ఆస్ట్రేలియాలోని రెక్సోనా ప్రొప్రయిటరీ లి., తరపున హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్ వారిచే భారతదేశంలో తయారుచేయబడినది.
RP. 158-X52 TL



సోదరి భార్గవి (మద్రాసు) గారు సన్నబడటానికి మార్గము ఎవరికైనా తెలిస్తే వ్రాయమని కోరారు. నా అనుభవము ఒకటి వనితాలోకంద్వారా వారికి తెలియజేస్తున్నాను. చాలమంది తిండిలో ఏమి ఉంది వళ్ళు వచ్చేది ఉంటే రాక మానదు అంటారు కానీ తిండిలోనే ఉంది అని నా అభిప్రాయము. అన్నము తినుటలో ఉల్లిపాయ ఒకటి ఎక్కువగా తినుట మానివేయాలి, పప్పు, నెయ్యి దుంప సరకులు ఎక్కువగా తినుట మానివేయాలి. కావలసినదానికన్న ఎక్కువ ... రన్నా తింటారా అని ప్రశ్నించవచ్చు. నా ఉద్దేశ్యములో కావల్సినంతకూడ తినకూడదు. బాగా తగ్గించమనే పూర్తిగా మానివేసినాకూడా పర్వాలేదు. ఉదయము సాయంత్రము తీసుకొనే టిఫిన్‌లలోకూడా బాగా జాగ్రత్తగా తినాలి. ఇవి చేయుట కొంత ఇబ్బందిగా ఉండును. కానీ చేస్తే ప్రయోజనము కనపడవచ్చు. ఇంకొకమాట చెప్పడము మరిచాను ఎప్పుడు ఒక చోట కూర్చుని ఉండడముకంటే సంతోషముగా తిరుగుతూకూడా ఉంటె మంచిది.

శకుంతల, నర్సాపురం.

* * *

వెనకట ఓ యాత్రికుడు కాశీ వెళ్లాలన్న నిశ్చయంతో బయలుదేరాడుట! తీరా వెళ్ళిన తర్వాత చూస్తే రామేశ్వరం చేరుకున్నాడు.

అలాగే బి. వి. కామేశ్వరిగారు "తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు, తవిరి మృగతృష్ణలో నీరు ద్రాగవచ్చు, తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు, చేరి మూర్ఖులమనసు రంజింపరాదు" అన్న భర్తృహరి అభిప్రాయంతో నడిచి తీరా చివరికి వెళ్ళే సరికి పైమూడే సాధ్యముకావనీ, చివరి నాల్గవదే (మూర్ఖుల మనసు రంజింపరాదు) సాధ్యమాతుందనీ తేల్చిపారేశారు. మొత్తం మీద వ్యాసమైతే రాశారుకాని అందు ఒక నిర్ణీతమైన ఉద్దేశంలేదు.

యం. యల్. పతి (మంచిర్యాల)

* * *

బి. వి. కామేశ్వరిగారు చక్కని ఉదాహరణముతో మూర్ఖుల స్వాభావములను వనితాలోకం ద్వారా మనకు తెలియజేసినందులకు వారికి నా అభివందనములు.

యం. లక్ష్మీదేవి, (ఉరవకొండ.)

* * *

కింకగులలాంటి బాకీలవాళ్ళ భాధావుండదు. అప్పుడు మన మనస్సు ప్రశాంతంగానూ ఆనందంగానూ కూడా వుంటుంది.

'ఉపాహార' మంత్రులు

ఇంకోరకం మనిషున్నారు. ఆయన బహు భోజనప్రియులు. ఫస్టుతారీఖున జీతం పుచ్చుకోగానే ఆయన సరాసరి కోమటి కొట్టుదగ్గరికి పరుగెత్తుతాడు. ఈ మస్య బ్రహ్మదేవుడు దిగొచ్చినాసరే, ఆయనలెక్క చేయడు. అక్కడ ఆయన సరుకుల జాబితా, ఆరుశేర్ల గోధుమరవ్వ, నాలుగువీశెల శెనగపిండి, ఇత్యాగులు. వారపత్రిక లవీ కొంటాడాయన. చదువుకుంటానికి అనుకుంటారేమో. పొరపాటు. పొరపాటున్నా ఒక్క కథ చదవడాయన. ఆయన పుస్తకము కొనగానే మొట్టమొదట తీసేది ఆడవాళ్ళ సెక్షను. అందులో ఆవారం కొత్తకొత్త పిండివంటలు ఏమిచెప్పారు? అనేది ఆయనకు కావలసినప్రత్యేకాంశము. ఒకవేళ ఆ వారం బహుతక్కువగా పిండివంటలు రాశారనుకోండి, ఇక ఆయన "చూశారూ, ఈ పత్రికలవాళ్లు పాపం బాగుపడి వనితాలోకం, ప్రమదావనం మొదలైన శీర్షికలు పెడుతుంటే పిండివంటలగురించి వ్రాయటానికి, దేశవాళీ పాకాలకు పేరుమోగిన ఆంధ్రదేశంలో పిండివంటలు తెలిసిన ఆడవాళ్లే కరువైనారా! దేశం రానూ రానూ ఎంత దిగజారుతున్నది?" అని ఒక ప్రత్యేక విమర్శ పారేస్తుంటాడు. ఆయనముందు, ఎంత నవ్వొచ్చినా ఆపుకోవాల్సిందే. కోపంవస్తే ఆయనసలే మనిషికాడు. ఇక ఇంటికెళ్లి రోజుకొకటి, రెండుచొప్పున పత్రికల్లో చెప్పినప్రకారము తు. చ తప్పకుండా కొత్తకొత్త పిండివంటలు చేయిస్తుంటాడు. పాప మాఇల్లాలికే సరిపోయింది. ఆయనకే సరిపోయింది. విసుగులేకుండా పొయ్యి దగ్గర కూర్చుని ఓపిగ్గా వండిపెడుతుంది. ఆ పిండివంట బాగా కుదిరిందా, అవ్రాసినామె గురించి ఆఫీసులోకూడా పొగిడేస్తుంటాడట ఆ పెద్దమనిషి. ప్రతిరోజూ సంచి పుచ్చుకు మార్కెటుకు బయలుదేరాల్సిందే కూరకు. భార్య ఎప్పుడన్నా "ఏమండీ ఈ తిండిఖర్చు కొద్దిగా తగ్గించకూడదూ?" అంటే ఆయన పకపకా నవ్వి "కాకిబతుకు కలకాలం బ్రతకాలేమే, హంసబ్రతుకు ఆర్నెల్లు చాలదూ?" అంటుంటాడు. పోనీ ఆయనేమైనా బట్టలు సరైనవి వేస్తాడా? అంటే అబ్బెబ్బె పరమ చింకిపాతలు. ఆయనచేసేది బంగారంలాంటి ఉద్యోగము, బోలెడంత జీతం. దర్జాగా హుందాగా వుండదగ్గ ఉద్యోగము. కాని జీతమంతా కలిపి ఆయన జాబితా ప్రకారము పదిహేనురోజుల వెచ్చాలకే సరిగా చాలదు. తిండి తినవల్సిందే. ఆహారము దగ్గర, వ్యవహారముదగ్గర మొహమాటం పనికిరాదన్నారు పెద్దలు. భోజనం విషయంలో డబ్బులు మిగల్చచూస్తే, అంతకు రెండింతలు డాక్టర్లకు పోయాల్సి వుంటుంది. కాని దానికీ ఒక మితముంది. మన అంతస్తులు దాటి, మహారాజుల్లాగా షడ్రసోపేతమైన భోజనము, నవరసపాకమైన పిండివంటలు, పూట పూటా కావాలంటే కుబేర గోపురాలూ కూడా చాలవు. నిజానికి ఆయన జీతానికి తినే తిండిలో సగం ఖర్చులుతగ్గిస్తే దర్జాగా, డాబుసరిగా మంచి బట్టలు కట్టవచ్చు. బట్టలు మొదలైన వాటి దగ్గర తక్కువతనంగా వుండి మనం ఎంత దర్జాభోజనం తింటే మాత్రం ఏం లాభం? ఆ ఇంటావిడ చిల్లర బాకీలవాళ్ళబాధలు పడలేక "ఈ అనవసరపు ఖర్చులు తగ్గించండో, బాబూ," అని ఎంతగోలపెట్టినా ఆయన చెవికెక్కదు.

ఇంట్లో ఆడవాళ్ళ బాధలు గుర్తించి జీతం సక్రమంగా ఇచ్చినపుడు ఈ అవస్థలుండవు. అవసరాలను బట్టి, సమయాన్ని బట్టి హాగుగా ఒక దాని కొకటి సమంగా సమకూర్చుకుంటే జీవితాన్ని ఆనందంగా గడిపివేయవచ్చు. తీరని క్లిష్ట సమస్యలంటూ వుండవు. అట్లా కాకపోతే "జీతం రాగానే ఈ బాకీలు తీరుద్దాం, ఈవస్తువులు కొందాం అని ఎంతో ఆశతో ఫస్టు తారీఖుకై ఎదురుచూచే ఆడవాళ్ళకు ఆశాభంగం తప్పదు.★

★ అన్వేషణ ★

17-వ పేజీ తరువాయి

వాళ్ళకి ఎదురువెళ్ళింది. ఏవో గుసగుసలు నడిచాయి. సాహెబు కిలాడీలా ఖంగున నవ్వాడు. ఓరచూపుతో కుర్రాడు కమల వైపు ఆశగా చూశాడు.

"కమలమ్మా! నేను మళ్ళా యిప్పుడే వస్తా!" ముసలిది సాహెబుతో తడికల సందులోంచి నిష్క్రమించింది.

ఇరవై ఏండ్ల ఆ కుర్రాడు మెల్లిగా అడుగులు వేస్తూ కమలదగ్గరకువచ్చికూర్చున్నాడు. లోలోపల ఆ పరిస్థితిఅంతా భయం గొల్పుతున్నా, ధైర్యంగా మొండిగా కూర్చుంది కమల.

'ఏవూరూ?' కుర్రాడు అడిగాడు.

'మద్రాసు!'

'క్రొత్తగా వచ్చావన్నమాట!'

మౌనంగా తలవూపింది కమల.

'ఎంత అందంగా ఉన్నావు?'

నిట్టూర్పు విడిచాడు ఆ కుర్రాడు, ప్రేయసిని చూసినట్లు.

ఆ మాటకు కమల కొద్దిగా త్రుళ్ళిపడింది.

"నువ్వుకూడా వ్యాపారం చేస్తావా?" కమల మాట్లాడలేదు.

ప్రక్కనే ఉన్న చీపురుపుల్లతీసి నోట్లో పెట్టుకు నములుతూ ఆలోచనలో పడ్డాడు కుర్రాడు. గచ్చునేల క్రింద పారుతున్న చిన్న మురికిగుంట కుళ్ళు వాసనలు చిమ్ముతోంది. దోమలు రొదచేస్తు వీరవిహారం చేస్తున్నాయి. తడికలప్రక్క గోడ అవతల పాకీదొడ్డి దుర్గంధం వ్యాపింపజేస్తోంది. ఆ వాతావరణమంతా అసహ్యంగా బీభత్సంగా కనిపించింది కమలకు.

కుర్రాడు కొంటెగా చీపురుపుల్లతో కమలచేతి మీద కొట్టాడు.

'ఏమిటి నువ్వనేది? ఎవరు నువ్వు?' చికాకుగా అరిచింది కమల.

'ఈ యిల్లు ఎవరిదో తెలుసా?' హేళనగా నవ్వాడు కుర్రాడు.

'సత్రవు!'

కుర్రాడు పకపక గట్టిగా నవ్వాడు.

'ఇప్పుడు తెలిసింది నీ స్థితి!' హఠాత్తుగా నవ్వు ఆపి ఆలోచనలో పడ్డాడు, కుర్రాడు.

మనస్సులోని అనుమానాలు స్థిరపరిచే ఆ కుర్రవాడి నవ్వుచూచి కమల కంగారుపడింది. వయసులో కొంచెం తనకన్న తక్కువగా కనిపించే ఆ కుర్రాడిని మచ్చిక చేసుకుని వాతావరణం అర్థంచేసుకొని జీవితాన్ని భద్రంగా నడిపించుకోవా లనుకుంది కమల.

'నీ పేరు!' అనునయంగా అడిగింది.

'రాముడు!'

'ఏం చేస్తుంటావు?'

'నీలాంటి వ్యాపార స్త్రీలకు సహాయం చేస్తుంటాను!'

'ఏం వ్యాపారం!'

'వ్యభిచారం!'

కమల భయంతో మౌనం వహించింది, శరీరంనిండా తేళ్ళు కుట్టినట్లయింది. ప్రయాణం బడలికతో ఆమెకు నీరసం అవహించింది. ఒక గ్లాసు మంచినీళ్ళు త్రాగితో(?)టుపాటు సర్దుకుంది!

'ఈ చీకట్లో నీ అందమైన కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయ్!'

ఆ కుర్రాడి మాటలు కమలకు ధైర్యం చేకూర్చాయి.

'అయితే ఇది భోగంకొంప అన్నమాట!'

'ఊఁ' నవ్వాడు కుర్రాడు.

'ఆ ముసలిది ఎవరు?'

కుర్రాడు సమాధాన మిచ్చేలోగా తడికల వెనుకనుంచి అయిదుగురు యౌవనవతులు, ముసలిది కిలకిల లాడుకుంటూ వచ్చారు. సిల్కు చీరల్లో శరీరాంత ర్భాగాలు విలికి వయ్యారంగా చూపిస్తూ, స్నో పౌడరు అద్దిన తెల్లటి ముఖాలు, రంగు పూసుకున్న పెదవులు, చెదిరిన జడలతో, ఘల్లుమనే గాజుల మోతతో ఏవో కబుర్లు చెప్పుకుంటూ కమలదగ్గరకు చేరారు.

'ఈ అమ్మాయి కమల. క్రొత్తగా వచ్చింది!' ముసలిది తాంబూలం బుగ్గను బిగించి, వక్రంగా దవడలు త్రిప్పి ఠీవిగా పరిచయంచేసింది తక్కిన అమ్మాయిలకు.

ఆ అయిదుగురు యువతులు కమల చుట్టూ మూగారు. ముసలిదాని సైగతో కుర్రాడు చీకటి సందులోంచి వెళ్ళిపోయాడు. కమలను ఆపాదమస్తకం ఆ స్త్రీలు పరిశీలించారు.

'ఎంత అందమైన ముఖం?'

'అరవు చుక్కలాంటి సుందరిని ముఖం!'

'మెరుస్తున్న కళ్ళు!'

'వెండి చేపల్లా!'

'అబ్బ! నాజూకైన కాళ్ళు, చేతులు!'

'తామర తూడుల్లా!'

'ఎంత పెద్దజడ!'

'నల్ల త్రాచులా వేలాడుతోంది!'

ప్రశ్నలు, సమాధానాలు ఒకరికొకరు చెప్పుకుపోతూ కమలను వర్ణిస్తూ కిలకిల నవ్వారు ఆ స్త్రీలు. ముదిరిపోయిన ముఖాలతో, లావెక్కుతున్న శరీరాలతో, తాంబూలంతో గారకట్టిన పళ్ళతో, అనారోగ్యంతో చెడిన శరీరాలు వెలిగ్రక్కే వాసనలతో చుట్టూ రాక్షస స్త్రీల్లా కూర్చున్న వాళ్ళని చూసి లోలోపల అసహ్యించుకుంది కమల.

"రేపటినుంచి మన వేరాలన్నీ దీనివైపు మొగ్గుతాయి కాబోలు!" ఒకతె పెదిమ విరుచుకుంది.

'రేపటి నుంచి మన బస మార్చుకోడం మంచిది!' ఒకతె వేళ్లు విరుచుకుంది.

'పోవే! ఎవళ్ళ అదృష్టం వాళ్ళది!' ముసలిది మధ్యన అడ్డుకుంది.

ఆ స్త్రీలు గదిలోకిపోయి, మాసిన బట్టలు ధరించారు. బయటికివచ్చి వరండాలో ప్రక్కలు వేసుకున్నారు. ఇద్దరు తడికల గదిలోకిపోయి పడుకున్నారు.

పదకొండుగంటలు దాటింది. ముసలిది కమలను తడికల గదులోకి తీసుకువచ్చింది.

'ఇదంతా మనదే!' ముసలిది సరదాగా

★ అన్వేషణ ★

నవ్వింది. ఇక్కడ పడుకో!' ముసలిది కమలకు ఒక పట్టెమంచం చూపించింది.

మరకలతో మలినంగావున్న తెల్లదుప్పటి, మాసిపోయి చమురుతో నల్లబడిన పాత తలగడ దానిమీద పడిఉన్నాయి.

'ఈ వేళకు పడుకో! రేపు నీకు తెలుస్తుంది అంతా' అంటూ ముసలిది తడికలు దాటి మునుపటి వరండాలోకి వెళ్ళిపోయింది.

కమల పట్టెమంచంమీద ఒరిగింది. ముసలిది విద్యుద్దీపాలు ఆర్పేసి, నూనె ప్రమిదలు వెలిగించింది. దోమలు గుంపుల్లా దండయాత్రకు వచ్చి, కమల శరీరమంతా కుడుతున్నాయి. మాసిపోయిన దుప్పటి ముఖంమీదకు కప్పుకుంది.

పట్టెమంచం అంటిపెట్టుకుని సంసారాలు గడుపుతున్న నల్లులు తమ కొంప ఆక్రమించిందనే కోపంతో అశుగునుంచి ఆమె శరీరాన్ని బాధిస్తున్నాయి.

వీధిలోంచి ఎవడో త్రాగి మైకంగా ఏదో పాడుతూ పోతున్నాడు. రిక్షా మువ్వలకదలిక శబ్దాలు ఘల్లుఘల్లున వినిపిస్తున్నాయి. గస్తీకాసే పోలీసువాళ్ళ ఈలలు అప్పుడప్పుడు గాలిని దూసుకుని కమలకు వినవస్తున్నాయి.

దుప్పటి ముసుగులో కమల వెక్కి వెక్కి ఏడ్చింది. దురదృష్టవశంవల్ల వ్యభిచారుల కొంపలో ప్రథమంగా ఆశ్రయం తీసుకోవలసి వచ్చినందుకు దుఃఖం ఆపుకోలేక పోయింది. గతించిన జీవితంలో పురుషుడు తన్ను మోసం చెయ్యడమేకాకుండా తన అందాన్ని అన్ని విధాల అన్యాయంగా ఆస్వాదించి తన్ను కులటగా చెయ్యాలని ప్రయత్నిస్తూనే వున్నాడు. ఎన్నో కష్టాలు దాటి క్రొత్త జీవితం గడపాలని మరో మహానగరానికి పయనమైవస్తే దైవంకూడా తనకు వ్యభిచారుల కొంపనే ఆశ్రయానికి చూపించాడు. తన జీవితం ఇకముందు కులటగా గడుస్తుందా? మోసం చేసిన పురుషుడిపై వ్యభిచారిణి జీవితం ప్రతీకారం తీర్చుకుంటుందా? కాముకులైన పురుషుల విషయ వాంఛలకు బలియై, శరీరారోగ్యం చెడగొట్టుకున్నాక ఏ స్త్రీ మాత్రం జీవితంలో ఏ ఘనకార్యం సాధించగలదు? బ్రతుకు తెరువుకు కులటవృత్తికన్న మరో ఉత్తమమార్గం స్త్రీకి దొరకదా? సమాధానాలు దొరకక సంఘర్షణపడి సతమతమైంది కమల.

ఉన్న నాల్గురూపాయలలో ఒక పావలా రిక్షావాడికి యిచ్చింది కమల. మిగిలిన సొమ్ముతో ఎలా జీవితం గడపడం! ఒకసారి చెడినశీలం, జీవితంలోని ఒక లక్ష్యంకోసం మరొకసారి చెడితే నష్టమేముంటుంది? ఇక్కడే ఉండి ధనం సంపాదించుకుంటే?.. అనాకారులుగా, అసహ్యంగా ఉన్న ఆ కొంపలోని స్త్రీలు కమలకంటిముందు కదిలారు. కోరమీసాలరౌడీ ... బట్టతల ముసలాడు...ఇరవయ్యేళ్ళ క్రొత్త కుర్రాడు... పళ్ళూడిన తాత . . కుంటి కాలు యువకుడు .. త్రాగితూలే నీచులు ... పురుషులను తెచ్చే బ్రోకర్లు...ఎర్రటోపీల అధికారులు ...ఇల్లు కాపలాకాసే వస్తాదులు ... తమ కరాళకరాలు సంకెళ్ళలావేసి ఆమె శరీరాన్ని మలిచి మలిచి ముద్దచేసినట్లు అనుభూతి గల్గింది కమలకు. 'ఆ జీవితం దుర్భరం! ...ఇక్కడనుంచి పారిపోవాలి రేపు...పట్టపగలు...ముసలిదానితో నిష్కర్షగా చెప్పెయ్యాలి, ఇక్కడ ఉండదల్చుకోలేదని...' ఒక నిశ్చయానికి వచ్చిన కమల బాధగా, బెంగగా ఏడుస్తూ కళ్ళు మూసుకుంది.

మగత నిద్రలో పడుతున్న కమలకు తన శరీరంమీద ఎవరో చెయ్యివేసినట్లనిపించింది. బయటికి చూచింది. రాత్రి తన ప్రక్కన కూర్చున్న కుర్రాడు! తన శరీరం మీద దుప్పటి తొలగిస్తున్నాడు. భయంతో కెవ్వున అరిచింది, కమల. 'భయపడకు... నేను...' మెల్లిగా ఊదాడు కుర్రాడు.

ఆమె కేకకు ముసలిదానికి మెలుకువవచ్చి లేచింది. మరేమి మళ్ళీ గడబిడ వినపడనందువల్ల, వీధిలోంచి ఎవరో అరచి ఉంటారనుకొని ప్రక్కమీద ఒరిగింది ముసలిది.

'ఎందుకు వచ్చావు?'

'నీసంగతి.....తెలుసుకుందామని!....'

రాముడు నసిగాడు.

'తెలుసుకుని...?'

'సాయం చెయ్యాలని...నువ్వు యీ యింట్లోకి పొరపాటునవచ్చావనుకుంటా?'

'ఊ! సత్రవు యిదేనని రిక్షావాడు తీసుకు వచ్చాడు!'

'దొంగపీనుగ!' రాముడు నవ్వాడు.

'ఇక్కడనుంచి రేపు వెళ్ళిపోతా!'

'ఎక్కడికి?... అలా వెళ్ళనివ్వదు ముసిలిది...పోలీసులు, రౌడీలు దానికి అండకూడా!...'

'మరి ఎలాగ?'

'నే సహాయంచేస్తా... నేను చెప్పినట్లు చెయ్యి...' రాముడు కమలచెవిలో గుసగుసలాడాడు చెవులవద్దచేరిన రాముడి పెదవులు కమలముఖాన్ని స్పృశించి, చుంబించకుండా వెనుతిరగలేక పోయాయి. రాముడు తనకు ముందుముందు సహాయకారి కాగలడనే ఆశతో కమల ఆతడి చుంబనాన్ని మౌనంగా ఆమోదించింది.

'ముసలిది చూస్తే ఏమన్నా అంటుంది.'

'రేపువస్తా!' రాముడు మెల్లిగా శబ్దం చెయ్యకుండా అడుగులువేస్తూ వెళ్ళిపోయాడు.

రాముడు చెప్పిన సలహావల్ల కొంచెం ధైర్యంకలిగి కమల నిద్రపోయింది.

—ఇంకా వుంది)

★

విధివిలాసం

(24 వ పేజీ తరువాయి)

వచ్చేవారు. వచ్చి ఒకటి రెండురోజు లుండ గానే అక్కడ సంసార మేమైపోయిందో నన్న ఆదుర్దాతో హడావిడిగా బయల్దేరేసేవారు. మనిషొకచోట వుంటే మనసొకచోట వుండిపోయేది. ఈ వేరుపాటువల్ల కలిగిన ఆందోళన ఆరోగ్యానికి ఆఘాతంలా సోకి ఆయన ఎండవడి తగిలిన నల్లికళ్ళ పాములా నానాటికీ సలచబడి పోసాగారు.

"ఈ వృద్ధాప్యంలో లేనిపోని అలతలతో సతమతం గావడం మంచిదిగాదు. కృష్ణా రామా అనుకుంటూ మీ రిక్కడే వుండండి. అంతగా అవసరమైతే నెల కొకటి రెండు సార్లు గ్రామానికి వెళ్లొస్తాను" అని అల్లుడు మామగారికి చెప్పి చూచాడు గూడా! కానీ శరీరంలో లేచి నడిచేపాటి ఓపిక వున్నంత వరకూ ఆ మామగారు ఈ అల్లుడి హితవును పాటించలేకపోయారు.

తీరా జవసత్వా లుడిగి, రోగశయ్యపైకి ఒరిగిపోయిన తర్వాత వెంకటనరసయ్యగారి తలపులన్నీ తనకు గాకుండాపోయిన కుమారుడిపైకి ప్రసరించాయి. తమప్రాణం గుటుక్కుమనే లోపల ఏదో అజ్ఞాత శక్తి అతణ్ణి తీసుకొచ్చి తమ ఎదుట నిలుపుతుందనిగూడా ఆయన ఆశించారు. ఆ ఆశగూడా అడియాసే అయింది. తెల్లవారు జామున అంతిమశ్వాస వదలిపెట్టబోతున్నారనగా క్రితం రోజు సాయంత్రం ఆయన అల్లుణ్ణీ కూతుర్నీ దగ్గరికి పిలిచి చెరోక వైపున కూర్చోబెట్టుకున్నారు. చంద్రమౌళి వైపు చూస్తూ, జీవితంలో మొట్టమొదటిసారిగా అతడితో మాట్లాడుతున్నట్టు "నా కొక కొడుకున్నాడు బాబూ! వాడి కోసం వేచి చూచీ చూచి నాకళ్లు కాయలు గాసిపోయాయి. వాడున్నాడో పూడాడో తెలియదు. నా గ్రుక్కలోకి నీళ్ళు పోయని వాడు వాడున్నా ఒకటే, పూడినా ఒకటే! నా కల్లుడివైనా, కుమారుడివైనా నువ్వే! అమ్మాయి కంట్లో కన్నీళ్లు రాలకుండా చూచుకునే భారం నీది!" అంటూ జోట జోట కన్నీరు కార్చారు.

వెంకటనరసయ్యగారు చనిపోయిన తర్వాత రెండు మూడు మాసాలకు ఓరోజు రాత్రి మళ్ళీ డాబాపైన పుచ్చపువ్వులాంటి వెన్నెలకాస్తోంది. చాపపైన ప్రక్కవాటంగా పడుకుని శ్రీలక్ష్మి చందమామలోని కుందేలు వైపు చూస్తోంది. చంద్రమౌళి పిట్టగోడ కానుకుని పట్టణ దృశ్యాలను పరికిస్తున్నాడు.

ఉండి వుండి శ్రీలక్ష్మి ప్రారంభించింది—

"ఏమండీ! ఓమా టడుగుతాను..."

"అడుగు. సందేహ మెందుకు?"

"భార్యాభర్తల మధ్య రహస్యా లుండ గూడదంటారు..."

"నిజమే మరి! ఎందుకుండాలి లక్ష్మీ! రహస్యాలున్నంతవరకూ ఆ దాంపత్యంలో ఏదో లోపముందన్న మాట!"

"అంతమా టనకండి! నాన్నగారు పోయినప్పటినుంచీ చెప్పాలనుకుంటున్నాను. అనుకోడం, మళ్ళీ మీ రేమనుకుంటారోనని తటపటాయించడం, పెదవి దాకా వచ్చిన మాటను అలాగే త్రుంచివేయడం, యిలాగే గడచి పోయాయి రోజులు..."

"పోనీ యిప్పుడైనా చెప్పు లక్ష్మీ! అదెలాటి రహస్యమైనా నే నేమీ అనుకోను," అంటూ చంద్రమౌళి చాపపైన కూర్చున్నాడు.

"మరి.. మరి. ఆ నాడు..."

"ఏనాడు?"

"ఐదారేళ్ళకు మునుపు దారికడ్డంగా రాళ్ళున్నందువల్ల మా వూరి దగ్గర రైలాగి పోయిందిగదూ?"

"అవును, యిప్పుడా ప్రసక్తి ఎందుకూ?"

"అక్కడలా రాళ్ళుంచింది మీరేనను కుంటున్నారు నిజానికది మీరు చేసిన పని గాదు..."

"నేను గాదూ? కాదని నువ్వెలా చెప్ప గలవు లక్ష్మీ?"

"నాకే కాదు. మరికొంతమందికి గూడా నిజం తెలుసు. ఐతే నాన్నగారంటే వున్న భయంవల్ల నిజం బయటికి పొక్కిందిగాదు. ఆ పోలీసులైనా కాస్త ఆలోచించి వుండవలసింది. పిచ్చివాడు ఎంతటిపనైనా చేయగలడనుకున్నారే గానీ, యిద్దరు ముగ్గురు చేతులు కలిపితేగానీ ఆ రాళ్ళు కదలి వుండవన్న విషయం వాళ్ళకు తోచిందిగాదు. అసలు నాన్నగారు వాళ్ళు రాకముందే ఈ నేరాన్ని ఎవరిపైకి త్రోసవేయడమా అని ఆలోచించారు. ఆయన కళ్ళకు దిక్కూమొక్కూ లేకుండా తిరుగుతూ సమయానికి మీరొకరు కనిపించారు—"

చంద్రమౌళి తెల్లబోయాడు. ఆశ్చర్యంగా భార్యకేసి చూస్తూ "మీ నాన్నగారికి నాపైన అకారణ వైరమా లక్ష్మీ?!" అన్నాడు.

"కాదు. నేరస్థుల్ని కాపాడాలన్న తాపత్రయం"

ఇంతకూ నేరస్థు లెవరో చెప్పావుగావు"

"ఎవరైతే నేమి! వాళ్ళకు నాయకుడు మా అన్నయ్య అగేంచిత్రమోగానీ దారిలో గోతులు తీయడం, రైలుకడ్డంగా రాళ్లుంచడం, పచ్చటి చెట్లను మొదలంటా నరికి వేయడం-యిలాటివన్నీ వాడికి వినోదాలు!"

చంద్రమౌళి అయిదు నిమిషాలసేపు మౌనంగా స్తబ్దుడై వుండిపోయాడు. ఆ తరువాత కాస్త కోలుకుని "కన్నకొడుకుపైన తండ్రికెంతటి మమకారం వుండంలో విడ్డూర మేమీ లేదు లక్ష్మీ! కానీ అలాటి కొడుకు తండ్రికెందుకూ వుపకరించకపోవడం, చివరకు ఎవరిపైన నేరం మోపబడిందో, ఆ నేరస్థుడే ఆయన గ్రుక్కలో నీళ్లుపోయవలసిరావడం — యిదే విధి లీలలోని విడ్డూరం — కాకపోతే వినోదం" అన్నాడు, మెల్లగా చాపపైకి వ్రాలిపోతూ. ★

బాల సాహితి

దారి తప్పిన కోడి

అనగా అనగా ఒక ఊరు. ఆ ఊరు పేరు విహంగపురి. ఆ విహంగపురిలో ఒక రైతు ఉన్నాడు. ఆ రైతు పేరు దొడ్డయ్య. పేరుకు తగ్గట్టు దొడ్డయ్య మహా దొడ్డవాడు. దొడ్డయ్య పేరుకు రైతు కాని, వృత్తికి వ్యాపారి. మంచి వ్యాపారజ్ఞానం కలవాడు.

పొలంలో పంటపండించడానికి బదులు దొడ్డయ్య కోళ్లను పెంచేవాడు. కోళ్ల పెంపకంలో మంచి అనుభవశాలి. వాటికి ఏ రోగం వచ్చినా తనే సొంతంగా మందు, మాకు వేసి నయంచేసేవాడు.

తన పెంపుడు కోళ్లలో ఒక చిన్నకోడి ఉండేది. ఆ చిన్నకోడి పేరు 'టక్కరి'. పేరుకు తగ్గట్టు ఆ చిన్నకోడి టక్కరితనంలో మంచి నేర్పరి. ముక్కు మొదలుకొని తోక వరకు టక్కరి దేహంఅంతా వంకర టింకరలే. దేహమేకాదు — దాని వెంట్రుకలు కూడా వంకరటింకరలే. టక్కరి తన అన్నదమ్ములతోను, అక్క చెల్లెలతోను పొలంలో ఆడుకుంటూ, పాడుకుంటూ హాయిగా కాలం గడుపుతూవుంది.

ఒకరోజు తెల్లవారుజామునే దొడ్డయ్య కోళ్లపొలంలోకి వచ్చి "ఈరోజు సంత. వీటిలో బాగా బలిసినవాటిని ఎంచి సంతకు తీసుకు వెళ్లాలి" అని అనుకుంటూ చూడ్డానికి మంచి పుష్టిగా ఉన్నవాటిని ఎంచాడు. వాటిని కోళ్లగంపలో పెట్టాడు. సంతకు అన్నీ సిద్ధంచేసుకున్నాడు. తన అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు కొంతమంది తనను విడిచి సంతకు వెళ్లిపోతున్నారని టక్కరి కోడి గ్రహించింది. గబగబ దొడ్డయ్యదగ్గరకు వెళ్లింది. వెళ్లి "నేనుకూడా వస్తా సంతకి—నన్ను కూడా తీసుకువెళ్లండి" అని అడిగింది టక్కరికోడి దొడ్డయ్యను.

"నీవు చాలా చిన్నదానవు. నీవు రాకూడదు. ఇంకా కొన్నిరోజులు గడిస్తే అప్పుడు నీవు అడగకుండా నేనే తీసుకువెడతానుగా!" అన్నాడు దొడ్డయ్య లౌక్యంగా.

ఆర్. శ్రీశైలం

కాని టక్కరికోడి ఎలాగైనా సంతకు వెళ్లాలి అని కుతూహలపడింది. దొడ్డయ్య అక్కడనుండి కదలి వెనక్కి తిరిగాడు. వెంటనే టక్కరి బహు నేర్పరితనంగా వంకర టింకర దేహంతో మెలికలు తిరిగి కోళ్లగంపలో దూరిపోయింది. తరువాత కొంతసేపటికి దొడ్డయ్య మూటాముల్లా కట్టకున్నాడు. కోళ్ల గంపలను రెండెద్దులబండిలోకి ఎక్కించాడు. వాటన్నిటినిసంతకు తోలుకు వెళ్లాడు.

చెట్లనీడలతో చీకటిగా ఉన్న రోడ్లమీద కోళ్లగంపలు బండిలో ప్రయాణం చేశాయి. టక్కరి కోడి "నేను సంతకు వెడుతున్నాను" అని మురిసిపోయింది. 'సంత చూడ్డానికి ఎంతో ముచ్చటగా వుంటుంది' అనుకుంది పాపం టక్కరి కోడి.

కొంతసేపటికి రెండెద్దులబండి పెద్ద పెద్ద ట్రంకురోడ్లమీద ప్రయాణం చెయ్యడం మొదలుపెట్టింది. టక్కరి కోడి గంపలోనుండి బయటికి తొంగి చూచింది. మోటారుకార్లు కనిపించాయి. హారన్‌ల శబ్దం వినిపించింది. పల్లెటూరి వాతావరణం ఒక్కసారిగా మాయమైపోయింది. పట్టణ వాతావరణం వచ్చింది. నిజానికి ఈ పట్టణవాతావరణం టక్కరి కోడికి నచ్చలేదు.

సంత సమీపించేసరికి మోటారు కారులు, రిక్షాలు, మోటారులారీలు బస్సులు, యింకా ఎన్నో ఎన్నో ఎదురయ్యాయి. వీటన్నిటిని చూచి టక్కరి కోడికి అసహ్యం వేసింది. "సంతకు వెళ్లడం నాకు ఇష్టంలేదు. నేను తిరిగి ఇంటికి వెళ్లిపోతాను," అని నిశ్చయించుకుంది.

నెమ్మదిగా గంపపైన మూతకు కట్టిన దారాలను ముక్కుతో కొరికి నరికింది. లోపలనుండి బయట పడింది. అప్పటికి దొడ్డయ్య ఎద్దుల బండి ఒక పెద్దతూము సమీపానికి వచ్చింది. ఈ తూములోనుండి రెండెద్దులబండి ప్రయాణంచేసి సంత చేరుకోవాలి.

మోటారు కార్లకు, బస్సులకు, లారీలకు, ఎద్దులబండ్లకు, రిక్షాలకు, బాటసారులకు అందరికీ ఒకటే త్రోవ. ఈ తూము పొడుగు ఎక్కువ. వెడల్పు తక్కువ. వచ్చే పోయే కార్ల హారన్‌లతో తూము ప్రతిధ్వనించింది. కార్లు, బండ్లు ఒకదాని వెనుక ఒకటి నెమ్మదిగా జాగ్రత్తగా ప్రయాణం చేస్తున్నాయి.

కోళ్లగంపలో నుండి బయటపడ్డ

టక్కరి కోడికి ఈ హారన్ల మోతకు చావుతప్పి కన్ను లొట్టపోయింది. వెలుతురులేని ఈ పొడుగాటి తూములో అదురు బెదురులో బయటపడింది టక్కరి కోడి. కాని దారి కనుపించలేదు. ఇంటికి వెళ్లిపోవాలని ఒక్క గంతువేసింది.

దొడ్డయ్య రైతు ముందుభాగాన కూర్చొని బండితోలుతున్నాడు. వెనుకనుండి బయటికి గంతువేసిన టక్కరి కోడిని చూడలేదు.

మోటారుకార్లు, బండ్లు నెమ్మదిగా జాగ్రత్తగా కదులుతూ ప్రయాణం చేస్తున్నాయి. గంతువేసిన టక్కరికోడి మోటారుకార్ల మధ్య యిరుక్కుపోయింది. ఎలాగు వెళ్లాలో, ఎక్కడికి వెళ్లాలో తెలియలేదు. ఇంచుమించు కారు చక్రాల క్రింద పడిపోయినట్టే టక్కరి కోడి. పడిపోయి చక్రాల క్రింద నలిగిపోయే సమయానికి గాలిలో ఎగిరిపోయింది-టక్కరి టక్కరి తనంగా. వెనుక నుండి వస్తున్న మోటారుకారులో పిల్లా జల్లాతో ఒక ఆఫీసరుగారి కుటుంబం ప్రయాణం చేస్తున్నారు. అందులోని పిల్లలంతా కలసి ఒక్కసారిగా "అయ్యో! అయ్యో! కోడి చచ్చిపోయింది," అని గట్టిగా అరిచారు. డ్రైవరు కారు ఆపాడు. ఒకదాని వెనుక ఒకటి అన్నీ ఆగిపోయాయి. కారులోని పిల్లలంతా క్రిందికి దిగి టక్కరి కోడిని పట్టుకున్నారు. దాని ప్రాణం రక్షించారు. కారులో వారితో బాటు కూర్చోబెట్టారు. వెళ్లేత్రోవలో సంతకు దగ్గరవున్న పోలీసుస్టేషనులో అప్పగించారు. జరిగిన కథ అంతా చెప్పారు. వాళ్ల త్రోవన వాళ్లు ఇంటికి వెళ్లారు.

దొడ్డయ్య సంత చేరుకున్నాడు. బండిలోని కోళ్లగంపలను దింపాడు. గంపలోని కోళ్లను లెక్కపెట్టాడు. తన లెక్కకు సరిగ్గా సరిపోయాయి. తెచ్చిన కోళ్లను అన్నిటినీ సంతలో అమ్మేశాడు.

ఖాళీగంపలను బండిలో వేసుకొని తిరిగి ఇంటికి ప్రయాణమయ్యాడు. కోళ్లగంపలను చూచి "నీ బండిలో నుండి ఏదైనా కోడి తప్పిపోయిందా?" అని పోలీసు పోలయ్య దొడ్డయ్యను ప్రశ్నించాడు.

దొడ్డయ్య 'లేదు' అన్నట్టు వికటంగా నవ్వాడు. పోలీసు పోలయ్య మళ్లీ అడిగాడు. 'నేను తెలివితక్కువవాడిని అనుకున్నారా?" అని గదమాయించి ఎదురు ప్రశ్న వేశాడు దొడ్డయ్య.


"ఇదిగో — చూడు!" అని టక్కరికోడిని దొడ్డయ్య ఎదుట పెట్టాడు పోలీసు పోలయ్య. దొడ్డయ్య ఆశ్చర్యపోయాడు. తన కళ్లను తనే నమ్మలేకపోయాడు. ఇది కలా, నిజమా అని ప్రశ్నించుకున్నాడు తనలో తాను.

"నేనే—నేనే"—అంది టక్కరి కోడి తల పైకెత్తి చూపిస్తూ.

"నువ్వెలాగు వచ్చావ్ ఇక్కడికి?" అని ప్రశ్నించాడు దొడ్డయ్య.

టక్కరి జరిగిన కథ అంతా చెప్పింది. దొడ్డయ్య నోరు నొక్కుకున్నాడు. పోలీసు పోలయ్యకు క్షమాపణ చెప్పుకున్నాడు.

రంగులరాట్నం-7. వాల్ట్‌డిస్నీ



"ఎలావుంది? మీకు నచ్చిందా?
అర్గండీ జాకెట్ లెండి"

బాలల సంఘం

కొందరు సభ్యుల పేర్లు

బొబ్బిడి రవిచంద్రిక (మద్రాసు) గుంటూరు శేషారావు (విశాఖపట్నము) ముక్కాల వెంకటకృష్ణయ్య శెట్టి (కురుగొండ నెల్లూరుజిల్లా) చావలి శ్రీరామకృష్ణ (పెద్దాపురం, తూ.గో. జిల్లా) చావలి రమణి (విశాఖపట్నం)

బొట్ట శ్రీహరి(సాలూరు, శ్రీకాకుళం జిల్లా) సంపతిరావు వరహా నరసింహమూర్తి (విశాఖపట్నము) కర్రిసుబ్బారావు (రూర్ కేలా సుందరఘర్ జిల్లా) జయంతి కృష్ణమూర్తి (లక్ష్మీపురం అగ్రహారం విశాఖజిల్లా) బి. శోభాదేవి (హైదరాబాదు) డి. శారద (దావులూరు, కృష్ణాజిల్లా) సుంకర లక్ష్మీనారాయణమ్మ (కోరుమిల్లి, తూ. గో. జిల్లా) పెుక్కపాటి దుర్గాప్రసాదరావు (గుడివాడ, కృష్ణాజిల్లా) బండా సుబ్రహ్మణ్యం (విజయవాడ) శ్రీఘాకోళ్ళపు నాగేశ్వరరావు (నర్సాపురం, ప.గో. జిల్లా) హెచ్. ఎస్. వి. రామకృష్ణ (కదిరి, అనంతపురంజిల్లా) పేకేపు పూర్ణచంద్రరావు (గుడూరు, నెల్లూరుజిల్లా) ఎస్. ఎస్. నిర్మల (బండేపల్లి నెల్లూరుజిల్లా) అంగర పద్మభారతి (కర్నూలు) కటికనాసు దేవరావు (సికింద్రాబాద్) బొమ్మా జగన్నాథశర్మ (నిడదవోలు, ప. గో. జిల్లా) కొణకంచి విజయకుమార్ (విజయవాడ) పైడిశెట్టి సుజాత (సాంపేట, (శ్రీకాకుళంజిల్లా) హిమకుంతల రఘునాథశాస్త్రి జంగంపల్లె, కడపజిల్లా) యజ్ఞమూర్తి నాగేశ్వరి (నెల్లూరు) మురకొండ నాగన్న (వజ్రకరూరు) (అనంతపురంజిల్లా) ఘట్టమరాజు సత్యనారాయణరావు (అనంతపురం) కన్నెగంటి కస్తూరిబాయి (దుగ్గిరాల, గుంటూరుజిల్లా) బి. వేదవల్లి (తెనాలి) కొవ్వలి కమలకుమారి (ముండూరు, ప. గో. జిల్లా).

భానుమతిదేవి [నేరేడుపల్లి, వరంగల్] బుద్ధనాగేశ్వరరావు [అనకాపల్లి, విశాఖ జిల్లా] కునుకూరు ప్రభాకరరెడ్డి [కణేకల్లు అనంతపురం జిల్లా] బులుసు వెంకటకృష్ణశర్మ [బరంపురం గంజాం జిల్లా] జి. వెంకట్ రావ్ [నిజామాబాద్] చింతలపూడి సూర్యప్రకాశరావు [పాలకొల్లు ప. గో. జిల్లా] ఎ. సుబ్రహ్మణ్యం [మార్కాపురం, కర్నూలుజిల్లా] మెులవరపు వేణుగోపాల సత్యనారాయణమూర్తి [సామర్లకోట తూ. గో. జిల్లా] ద్వారం రామసుబ్బారెడ్డి [పరమటూరు గ్రామం, కర్నూలుజిల్లా] నూనె మీరాబాయి [గుంటూరు] గోళ్ళమూడి పూర్ణేందుశంకర్ [గుంటూరు] కూచిమంచి రాజశేఖర్ [పలివెల, తూ. గో. జిల్లా] చింతలూరి వెంకట రామమోహనరావు [రాజమండ్రి, తూ. గో. జిల్లా] పరిమి పట్టాభిరామశాస్త్రి [గునుపూడి, ప. గో. జిల్లా[ఉద్దవోలు కన్నతల్లి]ఉద్దవోలు, శ్రీకాకుళంజిల్లా] చావలిరఘు నాథరావు [చావలి, గుంటూరుజిల్లా] సూరపనేని సరస్వతీదేవి [పెనుగంచిప్రోలు, కృష్ణాజిల్లా] తణుకు సోమసుందర జనార్దన్ [నందివెలుగు, గుంటూరు జిల్లా] పరిమిసుబ్బారావు [జగన్నాథపురం, ప. గో. జిల్లా] బసవరాజు రామేషుబాబు [తాడిపత్రి, అనంతపురంజిల్లా].

పిసపాటి శారదాదేవి [టంగుటూరు, గుంటూరుజిల్లా] పాతూరు దాశరథి [గుంటూరు] అవసరాల పద్మావతీనాంచారీదేవి [కాకినాడ] పర్వతం రామలింగేశ్వరరావు [డిప్పకాయలపాడు, ప. గో. జిల్లా] ఎస్. సరస్వతి [సన్యాసిపల్లె చిత్తూరుజిల్లా] మల్లాది వెంకటసుబ్బారావు [ఆచంట ప.గో. జిల్లా] ఎస్. యశోద [సన్యాసపల్లె చిత్తూరు జిల్లా] ఉపాధ్యాయుల వెంకటరమణమూర్తికుమార్ (పోడూరు. ప. గో. జిల్లా) కర్లపూడి పద్మావతి (బాపట్ల, గుంటూరుజిల్లా) గద్దం నరసింగరావు (ఛత్రపురం గంజాంజిల్లా) కోట అప్పారావు (పార్వతీపురం (శ్రీకాకుళంజిల్లా) పెన్మెత్సరంగరాజు (రేలంగి, ప. గో. జిల్లా) న్యాయపతి శ్రీనివాసరావు (రాజమండ్రి) శివకోటి జానకీరూపవతి (విజయవాడ) వరజాపుసత్యనారాయణప్రసాద్ (ఏలూరు) రెంటాల శ్రీమహాలక్ష్మి (అత్తిలి ప.గో. జిల్లా) గోపిశెట్టిఉమామహేశ్వరరావు (అగిరిపల్లి కృష్ణాజిల్లా) యం. నీరజ (ఏలూరు) వారణాసి సత్యప్రకాష్ (విజయవాడ) ఆకెళ్ళ వెంకటసుబ్బారావు (రాజమండ్రి)

ఎమ్. మహాలక్ష్మి (విజయనగరం) మండపాక కృష్ణకుమారి (సికింద్రాబాదు) పెనుమాక మోజెస్ (విజయవాడ) రాతుల సత్యనారాయణమూర్తి పామర్రు (కృష్ణాజిల్లా) గుగ్గిలం సుగుణకుమారి (ఒంగోలు) మాడభూషి శేషాచారి (నర్సాపురం ప.గో.జిల్లా) ఎం. లింగాగౌడ్ (అంకాపూర్ నిజామాబాద్ జిల్లా) ద్వారంపూడి కనక వెంకటరెడ్డి (పెనుమంట్ర ప. గో. జిల్లా) గట్టు ఉమాదేవి (విజయనగరం) సుసర్ల వెంకటేశ్వర్లు (బరంపురం గంజాంజిల్లా) మంగనపూడి ధనలక్ష్మి తాయారమ్మ (పెద్ద ముక్కెన గుంటూరు జిల్లా) రొయులుగుల దివాకర్ (సికింద్రాబాదు) మేడికొండూరు హనుమంతరావు (జొజ్జూరు నందిగామ తాలూకా) ఆంధ్ర కమలాదేవి (విశాఖపట్నం) రగ్ మహమ్మద్ ఖుతుబుద్దీన్ అనే డాక్టరు (బిక్కవోలు తూ.గో. జిల్లా) సి. వసంతరాజకుమారి [వజ్రకరూరు, అనంతపురంజిల్లా] గాదిరాజు వెంకటరాం [గుంటూరు] ఆర్. ఎస్. వి. సుబ్బారావు [హైదరాబాదు] ఎ.రఘుపతిరెడ్డి[హుజూరాబాగు, కరీంనగర్ జిల్లా] గుబ్బాసీతారామారావు [తెనాలి].

చిట్టూరి సీతారామయ్య [కాకినాడ] పి. ఎస్. రమామణి [శ్రీకాకుళం] వి. రాజేంద్రబాబు [విజయవాడ, కృష్ణాజిల్లా] కంకుమర్తి వెంకట్రావు [పలివెల, తూ. గో. జిల్లా] నాగళ్ళ శివరాంప్రసాద్ [మొగరాజపురం, కృష్ణాజిల్లా] చిల్లరిగె వెంకటరామాయమ్మ [కూచిపూడి, కృష్ణాజిల్లా] మూలిన సోమరాజు [మేడపాడు, తూ. గో. జిల్లా] సోమయాజుల మురళీకృష్ణశర్మ [కూచిపూడి, కృష్ణా జిల్లా] బొల్లెపల్లి విజయలక్ష్మి [హైద్రాబాగు]


★

...సమూపణ ఒక్కటేకాదు, అభివందనాలు కూడా అర్పించాడు.

ఇంటికి వెళ్లిన తరువాత టక్కరికి మేత వేశాడు. "ఇకముందైనా ఎక్కడికి వెడుతున్నావో తెలుసుకొని బయలుదేరు" అని హెచ్చరించాడు దొడ్డయ్య టక్కరి కోడిని.

టక్కరి కిక్కురు మనకుండా మేత మేసింది. "బాగా బుద్ధి వచ్చింది" అని లెంపలు వేసుకుంది. 'తెలియనిచోటికి ఎప్పుడు వెళ్లకూడదు' అనుకుంది. "సంత సరదా తీరింది," అనుకుంటూ హాయిగా ఆ రాత్రి నిద్రపోయింది. ★


కొద్ది సన్‌లైట్
చాలా బట్టలను ఉతికింది
-అట్లు చేసినట్టిది దాని అధిక నురగ
కళ్లారా చూస్తే నమ్మకం! శంకరం చీర ఉతికిన తరువాత తెల్ల వర్ణను చూసి చాలా సంతోషించినట్లున్నాడు. తెల్లగాను, కాంతిగాను, ఉతుకబడిన ఈ బట్టల దొంతర, దుప్పట్లు, తువ్వాళ్లు, చూడండి—ఇవన్నీ అంత కొద్ది సన్‌లైట్‌తో ఉతుకబడినవి!
సన్‌లైట్ యొక్క గుణవంతమగు సమృద్ధమైన నురగ బట్టలను చాలా శుభ్రముగా ఉతుకును మరియు బాదక్కాలేకుండానే బట్టలోగల ప్రతి మురికి అణువునూ తొలగించివేయును! దీనిని మీరే స్వయంగా ఋజువు చూసుకోండి!
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు బట్టలను తెల్లగాను కాంతిగాను ఉతుకును



పగటి కలల వలలు

"చిత్రమైనా! కథనాయెనా!" అంటూ నేపథ్యగాయకుడు తార స్థాయిలో ఆరంభించి, ప్రేక్షకుని ఇంకా ఆ పైకి పోతూ జనాన్ని సమష్టిగా దుఃఖపడాల్సిందని వలపోయిన్పుడు మొదలు పెట్టేసరికి, ప్రేక్షకులు నిమిషపని విశ్రాంతికి ఉపక్రమించారు. కొందరు ఇంటి గొడవలు మాట్లాడుకుంటున్నారు.

"ఇంతేనా! కథ ఇంతేనా! సినిమా కథ ఇంతేనా! తెలుగు సినిమా కథ ఇంతేనా!" అన్నాడు ఒక కుర్రాడు [illegible] విసుగ్గా.

"ఇంతేలే. కథ ఇంతేలే. మనకి ఇంతేలే" అన్నాడు రెండో కుర్రాడు [illegible]

ఇద్దరూ ఎవరి విట్టుకి వాళ్లు ఎవరి నవ్వుకు వాళ్లు పగలబడి నవ్వుతున్నారు. నేపథ్యగాయకుని కంఠధ్వనిలో నవ్వు వినపడక, వరండాలోకి వెళ్ళి మళ్ళీ నవ్వుతున్నారు.

* * * *

సినిమాకథకి కొండగుర్తులైన నాటిలో ఇది ఒక సన్నివేశం. నాటికి చాలా వాటిలో ఇదీ, ఇలాంటివి చాలా ఉన్నాయి. కథని తెరమీద చిత్రించడంలో మెళకువలు ఇవే. వీటినిబట్టి (లేదా వీటికి అనుకూలంగా) పాత్రల రూపకల్పన, దానినిబట్టి కథా తయారవుతున్నాయి. ఎలాంటి భావమునైనా సరే, పుట్టిన కొత్తలో ఎంత కొత్తగా ఉన్నా సినిమా దగ్గరికి [illegible] నటీనటులు(?) [illegible], ఈ కొండగుర్తు మెళకువలతో అలంకరించుకు వేసరికి మామూలు పాతకథగానే తయారవుతోంది. ఏనాడో ఏ బాక్సాఫీసు సూత్రకారుడో భాష్యకారుడో తెలిసో తెలియకో కట్టినసూత్రం పుణ్యమా అని జీవితాన్ని కృత్రిమంగా రూపిందడం, కష్టసుఖాల మీద మరీ పెద్దపెద్ద భూతద్దాలను—అత్యద్భుతం [illegible] వేస్తే తగకానివి—పెట్టడం ఈ కథలకు పరిపాటి అయిపోయింది.

అనేక సన్నివేశాలను స్వయంగా ప్రేక్షకుని విప్పించే(?) సన్నివేశంలో శక్తి పోయినందువల్ల అని నేపథ్యగాయకులనూ, బాక్ గ్రౌండ్ మ్యూజిక్‌నూ, సాయం తెచ్చుకుంటున్నాయి. అదికూడా పరిపాటి అయిపోయి, ఈ రెండువలనూ కూడా హాస్యాస్పదం అవుతున్నాయి.

* * * *

"అందువల్ల తెలుగుసినిమాలో మరీ సన్నివేశాలుగా వస్తున్న సినిమాలన్నిటికీ కలిపి కథలు రెండే. ఒకటి కామెడీ, రెండు ట్రాజెడీ. రెండోరకం అనేవి కాలేదు గాని, మొదటిరకం ఎన్ని వచ్చినా అన్నీ ఒక్కలాగే ఉన్నాయి. అందువల్లనే సినిమాకథల కథ ఒక పెద్ద ట్రాజెడీ అని చాలామంది అంటారు.

మరి సన్నివేశ్యచిత్రం కథ ఇంకోలా ఉండేది. అప్పట్లో చాలా మంచిచిత్రాలు వచ్చాయి. అవి అనేక సమస్యలను చిత్రించాయి. అంటరానితనం, విధవావివాహం, మద్యపానం, సమాజంలో పెద్దమనుషులు చేసే వంచన, దొంగ—దొరతనం, కట్నాలూ, దేశభక్తి, మొదలైన సమకాలిక విషయాలను వర్ణించాయి. కాలంతోపాటు కలిసి నడిచాయి.

అలా నడుస్తు నడుస్తున్న చిత్రాలు—జానపదాలు పుంజుకున్న తరువాత ఆగిపోయాయి. జానపదాలవల్ల పరిశ్రమ పరిమాణం పెరిగినా, ప్రమాణం ఆగిపోయింది. జానపదాలకి డబ్బు రావడం వల్ల, సాంఘికాలు తీసేవారుకూడా, వాటికి జానపదాల రంగులు పూసి అమ్ముతున్నారు. ఆ పద్ధతే ఈనాడు ఖాకీఎత్తున(?) అమలు జరుగుతోంది.

* * * *

సినిమాకి పనికొచ్చే కథలు లేవడం హాలీవుడ్ నించి అరవసినిమాదాకా అందరికీ సమస్యే. అక్కడ పెద్ద నాటకరంగం ఉంది. కాగా [illegible] నాటకాలు తీస్తారు. అసలైన సమకాలిక జీవితాన్ని పరిశీలించే నవలలు నాటకాలూ కొంటారు. వాటిని ఎలా ఖూనీచేస్తారన్నది వేరే విషయం. ఏంచేసినా కొంత కొత్తదనం ఉంటుంది. కొత్త తరహా మనుష్యులు కనిపిస్తున్నారు. యూరప్‌లో—ముఖ్యంగా ఫ్రాన్స్, (ఆ మధ్య ఇటలీ) కొత్తకొత్త ఇతివృత్తాలతో చిత్రాలు తీస్తున్న(?) మనం మరీ అంత వేటు ముందుకి వెళ్ళకపోయినా, కొంత ఆశ పెట్టుకుని కూడా ఈనాటి చిత్రాల కథలు, ధోరణి మారవు(?) అని ధైర్యంగా చెప్పటం లేదు. [illegible] కావలసిన కథలూ, మన నవల [illegible] చిత్రాలు [illegible]



[illegible] '[illegible]'లో నాయిక [illegible]

పై వారం ప్రత్యేకాకర్షణ:

"మీ కేం కావాలి?"

★

నేటి తెలుగు సినిమా కథల తీరు తెన్నులపై సచిత్ర వ్యాసం

రచయిత: డి. వి. నరసరాజు

అవతల పారేస్తోంది.

సినిమాలో గొప్పవాళ్ళకి చెప్పరానంత డబ్బు ఉంటుంది. అది ఎక్కడిదో ఎవడికీ తెలీదు. ఉంటుంది అంతే. అయిపోతే ప్రొడక్షన్ మేనేజరు సప్లయి చేస్తాడు.

వందరూపాయల జీతగాడు లక్షాధికారులుండే ఇల్లు సెట్ మీద ఉంటాడు. లక్షాధికారి డబ్బున్నట్టు మనకి అనుమానం కలిగే పాత్ర, జానపదకథలలో మహారాజ ప్రాసాదాలకి సాంఘికానువాదాలు అనిపించే బ్రహ్మాండమైన తలా తోకా తెలీని సెట్లమీద ఉంటుంది. అక్కడ వాళ్ళు వేసే వేషాలూ, (డ్రెసింగ్ గౌనులదగ్గర్నించి) పోయే బడాయిలూ సినిమా కథలలో మనుషులే తప్ప, భూమ్మీద పుట్టి బతికినవాళ్ళెవరూ పోలేరు. మీరూ మేమూ ఎరిగున్న గొప్పవాళ్ళెవరూ అలా ఉండరు. ఉంటారా అని అడిగితే, 'ఛీ సిగ్గెయ్యదూ అలా ఉంటే ఒళ్లు దచ్చిపోయినట్టుంటుంది' అంటారు. వాళ్ళ మాటలు తీరుకూడా అదేతరహాలో జాలి కలిగించేలా ఉంటాయి.

"మనీ! ఈ పదివేలూ అందాకా ఉంచు. అవసరమైతే ఇంకో పదివేలు పట్టికెళ్ళు. మొగమాటపడకు."

'ఇప్పుడే మేడమీద ఎయిర్‌కండిషన్ గదిలోంచి బయటపడి, వెండిగ్లాసులో ఓవల్టిను తాగి గోల్డ్ ఫ్లేకు ముట్టించి క్రొత్త లీపాడ్ మీద పార్కరు పెన్నుతో కొంచెం రాసుకుని, అలా బ్యూక్ మీద ఎక్కి కాస్మాపాలిటన్ క్లబ్‌కి వెళ్ళి ...' అన్నది నేటి సినిమాలో గొప్ప పాత్రల వేషభాషలను వర్ణించగల చిన్న అతిశయోక్తి!

* * *

కార్మిక చిత్రాలు అనబడే వాటిలో ప్రొప్రయిటరు, మానేజరు సాధారణంగా "ఆర్. నాగేశ్వరరావు" అయి ఉంటాడు. అందుకోసం ఆర్. నాగేశ్వరరావు చూట్టానికే విలన్‌లా ఉండడం చేస్తున్నాడు. ఇందులో విలన్‌కు ఆట్టే తెలివితేటలుండవు. కార్మికుడు గాబర్డీన్ లాగుతో ఉక్కునరీ ధర్మంకోసం పోరాడుతాడు.

ఇళ్ళలో పనివాళ్లు పాతపోసిన స్వామిభక్తులు. నిజమైన స్వామిభక్తులంటూ ఉంటే సినిమాలో నౌకర్లలా కనపడడానికి సిగ్గుపడతారనిపిస్తుంది.

అసలు సినిమాలో విలన్ తప్ప, మిగతా వాళ్ళంతా బంగారు తండ్రులే అయినా, వీళ్ళలో మనీ మంచివాళ్లు అని కేవలం ఒక జాతి వాళ్ళు ధగధగ మెరిసిపోతూ ఉంటారు. వీళ్ళ మంచితనం గురించి తాయుచ్చానికి ఒక క్రింద పేరాబుడ్డి ప్లాటినం నిబ్బుగల పార్కరు పెన్ను, ఒక గోల్డుమౌంటెన్ ఒక పెద్ద ఈగిల్ ఫ్లాస్కు నిండా ఓవల్టిన్ ఉన్నా చాలవు.

సినిమావాళ్లు ఇవంతా ఎందుకు చూపిస్తున్నట్టు? సహజత్వం కృత్రిమంగా కనిపించడం కొన్ని సందర్భాలలో సహజమే అయినా మరీ ఇంత కృత్రిమంగా కనిపిస్తుందనిపించదు. సినిమాలో అలా చూపించడానికి కారణం, ప్రేక్షకుడు వినోద కాలక్షేపమే సినిమాకి ప్రధానం కాబట్టి, పనిలో పనిగా ప్రేక్షకుడికి పగటికలలు అల్లి ఇవ్వడం కూడా గిట్టుబాటు అయిన పని అని తేలింది. ఈ విధంగా పగటికలలవలనన్ని, పెద్ద పెద్ద మేడలూ, కార్లూ ఇతర వైభోగాలూ పుష్కలంగా చూపిస్తే 'పాడు' వాటిలో మునిగి తేలి మైమరచిపోతాడనీ ఈ 'మత్తుకోసం' మళ్ళీ మళ్ళీ వచ్చి పావలా ఇచ్చి ఈ పగటికలలు కొనుక్కుంటాడనీ సినిమావారి అభిప్రాయమైనట్లు విదితం అవుతుంది.

సినిమా సామాన్యజనులకు అందమైన దృశ్యాలు చూపి, తియ్యని పాటలు వినిపించి కొంతసేపు వారి చింతలు మరిపించి సంతోషపెట్టడం మంచిదే కాని, అందుకు ఇదే పద్ధతి కాదు. ఈ పద్ధతిలో అప్పుడప్పుడు చిత్రాలు వస్తే ఫరవాలేదు కాని అన్నీ అలాగే వస్తే మంచిది కాదు. ఇలా ప్రేక్షకుడిని పగటి కలలవలలో బంధించడం, ఈ విషయమై సుదీర్ఘంగా విచారించిన కొందరు ప్రేక్షకుల మాటల్లో చెప్పాలంటే—చాలా క్రూరమైన పని. ఇది హోటలు కాఫీలు తాగి తాగి మంచి కాఫీ రుచి మరిచిపోవడం, తాగినా మంచిది బాగులేదనిపించే స్థితికి రావడంలాంటిది.

లక్షల పెట్టుబడితో వ్యాపారం చేసేవారు డబ్బు గురించి ఆలోచించుకోవడం ధర్మమూ, సహజమూ, తప్పనిసరి అయినప్పటికీ ఈ పద్ధతి ఇలా కొనసాగడం భావ్యం కాదు. కళాకారులు, ప్రజలను జీవితం మీద విహారానికి తీసుకువెళ్ళి అందులో కొండలను, లోయలను, మంచిని, చెడ్డను చూపించి దారి చూపగలిగినవారు. ముందు నడిచి దారిచూపడం అందరికీ అన్నివేళలా సాధ్యం కాకపోవచ్చు. కనీసం పక్కగా నడుస్తూనైనా అటు కాదు ఇటు అని చెప్పవచ్చు. ప్రేక్షకుడే తెలివైనవాడై ఇటు కాదు అటే అని వాదిస్తే సందర్భాన్ని బట్టి తప్పు దిద్దుకోనూవచ్చు. కాని ప్రేక్షకుడు వచ్చేది మీరు చెప్పేది విని చూపేది చూసేందుకే. అందువల్ల సాధ్యమైనంతవరకు ముందరో, పక్కనో నడవాలిగాని, వెనకాలే వస్తాను పద అనడం తగవు కాదు.

దినదిన ప్రవర్ధమానమైన సినిమాపరిశ్రమ, జీవితంలో గాఢంగా అల్లుకుంటుంది. దాని ప్రభావాన్ని తమ బాధ్యతను ఎరిగి, మిగతా వారుకూడా వాటిని గుర్తించాలి. వారు ఈ విషయాలను శ్రద్ధగా ఆలోచించాలి. ★

'గొప్పింటి అమ్మాయి'లో పద్మిని





మద్రాసు చలనచిత్రాభిమానుల సంఘం బహుమతులందుకొన్న ముగ్గురు నటులు:
ఎన్. టి. రామారావు, శివాజీగణేశన్, ఎస్. వి. రంగారావు

వార్తావరణం

చలన చిత్రసీమలో ఎన్నదగ్గ ప్రమాణాలు అందుకొనే కళాకారులను ఏటేటా సత్కరిస్తున్న మద్రాసు చలనచిత్రాభిమానుల సంఘంవారు 1958 వ సంవత్సరం ఎన్నికచేసిన కళాకారులకు బహుమతి ప్రదానోత్సవం మే 27న విజయాగార్డెన్స్‌లో జరిపారు. మద్రాసు ఆర్థిక విద్యాశాఖల మంత్రి, శ్రీ సుబ్రహ్మణ్యం సభకు అధ్యక్షత వహించి, బహుమతులు పంచిపెట్టారు. సభకు నాలుగు ఖ్యాతుల మేటినటులూ దర్శక నిర్మాతలూ వచ్చారు.

ఈ యేటి విశేషాలు రెండు. మొదటిది ఈ సంఘం వారు తొలిసారిగా సినిమాలో కథ ప్రాముఖ్యాన్ని గుర్తించి, కథా రచయితలకు బహుమతి ఇవ్వడం. మద్రాసు గవర్నరు విష్ణురాం మేధీ ఈ సూచన చేసి, తమిళ కథారచయితలకై ఒక రోలింగ్ షీల్డును విరాళం ప్రకటించారు. తెలుగు రచయితలకు బహుమతికై మరొక రజితఫలకాన్ని ఎస్. వి. రంగారావు విరాళం ఇచ్చారు. ఈ బహుమతులను తమిళంలో 'తై పిరందాల్ వళి పిరక్కుం' చిత్రానికి కథ వ్రాసిన ఎ. కె. వేలన్, తెలుగులో 'పెళ్ళినాటి ప్రమాణాలు' చిత్రానికి కథ వ్రాసిన (మాటలూ, పాటలూకూడా ఆయనే వ్రాశారు) పింగళి నాగేంద్రరావుగారూ అందుకొన్నారు.

రెండవ విశేషం, ఉత్తమ చిత్రాలకు బహుమతి ఇచ్చేటప్పుడు, దర్శకుడికి కూడా ఇవ్వాలన్నది. ఈ సూచన నటి రాజసులోచన చేసింది. ఇందుకై ఈ యేటినుండి ఒక షీల్డును విరాళం ఇవ్వగలనని ఆమె ప్రకటించింది.

అధ్యక్షుడు శ్రీ సుబ్రహ్మణ్యం కూడా తమ ప్రసంగంలో సినిమా అభివృద్ధికి కథ ప్రాముఖ్యాన్ని ప్రస్తావించి, ఇందుకై పరిశ్రమలో వారంతా కలిసి ఒక సంఘాన్ని ఏర్పాటుచేయాలనీ దాని ద్వారా మంచి కథావస్తువులు ఎన్నిక చేసుకోవడం, కథలు తయారు చేసుకోవడం జరగాలనీ సూచించారు. ఈ నాడు సినిమా సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినా, కథల విషయంలో ముందడుగు వేయకపోవడం సరిగదా వెనకడుగు కూడా వేస్తోందని చాలామంది అంగీకరిస్తారు. ఒప్పుకోని వాళ్ళకి వరసగా పది తెలుగుసినిమా కథలుగాని, తమిళకథలుగాని చెప్పినా చూపినా దారికి వస్తారు అని చాలామంది నమ్మకం.

1958 లో ఉత్తమ చలనచిత్ర కథారచయితగా ('పెళ్ళినాటి ప్రమాణాలు') బహుమతినందుకొంటున్న శ్రీ పింగళి నాగేంద్రరావు, అందిస్తున్న మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం



రామరావణయుద్ధం

బహుమతులు అందుకున్న తరువాత (వివరాలు ఇదివరకే ప్రకటించాము) ఆయా కళాకారులంతా కృతజ్ఞత తెలుపుతూ మాట్లాడారు. ఏ. వి. ఎం. వారి 'భూకైలాస్' లో రావణపాత్ర ధారణకు ఉత్తమ నటుడుగా ఎన్నిక అయిన ఎన్. టి. రామారావు అదే సంవత్సరంలో రాముడి పాత్రను కూడా నిర్వహించి ప్రశంస లందుకోవడం విశేషం. కొందరు మిత్రులు ఈమాట అంటుంటే అన్నారట. ఇలా విరుద్ధతత్వాలుగల పాత్రలను నిర్వహించడం తనకా అని నటుడికి రాముడూ, రావణుడూ, నరసింహారావు, జగదల ప్రతాపన్ అందరూ ఒకటే. కొత్తదనం, ప్రత్యేకతగల పాత్రలు దొరకాలని ప్రతినటుడు ఆశిస్తాడు. మన పరిశ్రమలో ఒకనటుడు ఒకతరహా పాత్రను బాగా ఒప్పిస్తే అతని సినీజీవితాంతం

(52-వ పేజీ చూడండి)

రేలంగి - వెంకటరామయ్య

'తులాభారం' లో సంఘటన ఇప్పటికీ రేలంగి మరచిపోలేదు. మరతనవు చేసే అలాటిది అంటాడాయన విచారంగా.

అక్కడ ఒకరోజున డైరెక్టరుకీ రేలంగికీ కంపెనీ కారు గురించి చిన్న తగాయిదా వచ్చింది. మాటా మాటా పెరిగింది. 'కారు' మాటలుదాటి కథ ముదిరేవరకు, రేలంగి ఒకమాట విరాసి చెయ్యి విసిరాడు మాటడుగా. ఆ దెబ్బకి కంపెనీ రెండైపోయింది. రేలంగి తిరిగి ఈలపాట పాడుకుంటూ (అప్పటికి ఆయన పాటలు పాడడం బాగా నేర్చుకున్నాడు. ఆ క్రితం సంవత్సరమే వెంట కూడా వెళ్ళి చింతామణి నాటకానికి రికార్డులుకూడా ఇచ్చాడు.) తెనాలి వచ్చేశాడు. రంగస్థలంమీద ఆయనను వెంట తిప్పుకోవాలని ఉబలాటపడిన స్వజనులూ (కొన్నవిత్తుల, కపిలవాయి రామనాథ శాస్త్రి ప్రభృతి పేరు పేమీలు) ఉన్నారు; రేలంగి నటించే స్త్రీ పాత్రలను చూస్తున్నవే, అప్పట్లో అప్పుడప్పుడు వేస్తూ అప్పుడే పుంజుకుంటున్న హాస్యనటనమీద ఆశలు పెట్టుకున్న సుజనులూ ఉన్నారు. ఆ సినిమా వాలికి పోకులే అన్నారు ఆత్మీయులు. విజాది తిరిగేలోగా మళ్లీ కబురువచ్చింది కలకత్తానించి. వందకి తక్కువైతే రాను అన్నాడు రేలంగి బింకంగా. సరే అంది తిరుగు టపాలో జాబు.

రేలంగి కలకత్తా వెళ్లి సి. పుల్లయ్యగారి జంటచిత్రాలు ధ్రువ, అనసూయలలో పనిచేశాడు. తరవాత జీవనం కొన్నాళ్లు ఉత్తర దక్షిణాలమధ్య షటిల్ సర్వీసులా టకటక సాగిపోయింది. తెలుగు సినిమా పరిశ్రమ చెన్నపట్నంలో స్థిరపడిన వేళకు రేలంగి షటిల్ సర్వీసు ఆగిపోయింది.

సినిమా తీయడం ఇంకా పూర్తిగా వ్యాపారం కాని రోజులు అవి. సినిమా చుట్టూ ఒకవిధమైన గ్లామర్ ఉండేది. డబ్బు తిరిగినా ఇంత భారీ ఎత్తున తిరిగేది కాదు. శోభనాచల స్టుడియోని అంతా ఆంధ్రా హాలీవుడ్ అని అభిమానంగా పిలుచుకునేవారు. హాలీవుడ్ మధ్యన ఉండే ఆ స్టుడియో, ఆ మనుషులూ అప్పటి మనసులూ వాతావరణం అంతా ఈనాడు తలుచుకుంటే స్వప్నసీమలో దృశ్యంలా కనిపిస్తుంది. మీర్జాపూర్ రాజాగారు అక్కడ 'కీలుగుర్రం' తీస్తున్నారు. నాగేశ్వరరావు హీరో, కెమెరా అంటే ఇంకా బెరుకుతో, సిగ్గుపడుతూ ఉన్న రోజులు. ఆ చిత్రంలో రేలంగికి చిన్న ఛాన్సు దొరికింది. సరే, నిర్మాత కృష్ణవేణి ఆనాడు ఆ అవకాశం ఇప్పించి ఆదుకుందని రేలంగి ఇప్పటికీ గొప్పగా చెబుతాడు. అందులో రేలంగికి ఒక హీరోయినునుకూడా ఇచ్చారు. ఇద్దరూ ఒక డ్యూయెట్ (ప్లేబాకు కాదు) పాడారు. బాగుందన్నారు నలుగురూ.

నలుగురూ ఆ మాట గట్టిగా అనుకోడానికి రేలంగి 'వింధ్యరాణి' వరకూ ఆగాల్సి వచ్చింది. ఆలోగా అతడు బాగా నాటకాలు వేస్తు ఉండేవాడు. ఆడవేషాలు వదిలేసి, హాస్యనటుడుగా—సుబ్బిశెట్టి, వసంతకుడు వగైరా పాత్రలలో—స్థిరపడిపోయాడు. 'వింధ్యరాణి'లో నటన, అంతవరకు ఉన్న పేరుకు తోడై, పైకి ఒక్క తోపుతోసింది. రాకెట్ గ్రౌండువదలి ఎగరడం మొదలు పెట్టింది. జీవితం సెకండ్ గేర్‌లో నడుస్తోంది.

'పల్లెటూరి పిల్ల'లో వేషంకూడా బాగుందన్నారు. పుల్లయ్యగారి చిత్రాలు - వరవిక్రయం, మాలతీమాధవం వగైరాలు జీవికకు తోడ్పడుతున్నాయి.

'గుణసుందరి కథ'కి, కె. వి. రెడ్డిగారు రేలంగిని తీసుకోవడంతో కథ పుంజుకుంది. అది విడుదల కావడంతో రాకెట్, తొలి సాకెట్‌ను వదలివేసి పైకి తన్నింది. జీవితం థర్డ్ గేరులోపడి ఝామ్మని ముందుకు సాగింది. నాటికీ నేటికీ రేలంగి ఎక్కడా ఆగడం జరగలేదు. ఆగవలసిన వేళల్లో సంసారం, స్త్రీసాహసం, పాతాళభైరవి వంటి చిత్రాలు పేరులో పెట్రోలు పోశాయి.

* * * *

ఇంతదూరం 'రేలంగిని' నడిపించుకువచ్చిన 'వెంకటరామయ్య', ఈ ఘట్టంలో పేచీలు పెడుతూ ఉండేవాడు.

"ఇలా గురూ" అంటాడు రేలంగి; "కాదు అలా బ్రదర్!" అంటాడు వెంకటరామయ్య. ఇలా వాళ్ళిద్దరు తరచు మాట్లాడుకునే వారట.

"అబ్బాయి! నీకు పేరు వస్తోంది. జాగ్రత్త" అని హెచ్చరించేవాడు వెంకటరామయ్య.

* * * *

నిజంగానే రేలంగి జీవితంలో—అందరిలాగే, పేరు వాడుకుని ప్రజ్ఞను వదలిపెట్టే ఘట్టం వచ్చినప్పుడే ప్రమాదం ఏర్పడింది. 'బాక్సాఫీస్ హిట్' అన్నమాటకి సినీవర్గాలవారు ఆర్ ఇ ఎల్ ఎ ఎన్ జి ఐ అని స్పెల్లింగు చెబుతున్నారు. రేలంగి నటించిన మూడుచిత్రాలలో కొన్ని ఈ కోవకు చెందినవే. వ్యాపారార్థులకు పేరు తప్ప ప్రజ్ఞతో పని ఉండదు. ఇది కూడా వాడుకోవడమూ అన్న 'ఎందుకు?' అందుకు తీరుబాటు లేదు. 'పేరూ వాడో' అంటారు. అన్ని రంగాలలోనూ చాలమంది కళాకారులు ఈ వ్యాపారం వల్లనే దెబ్బతిన్నారు. రేలంగి లొంగినంతవరకు లొంగినా, మరో వంక బిగించి తనపాత్రకూ కల్పన, దానికమారినా పెనుభావలా వగైరాలగురించి పోరాలు చేసుకోవలసి వచ్చింది. ఆత్మరక్షణకోసం చేసే ఆ పనికూడా పొగరు అనీ, కామన్ల్ మంలచాయని దానికి నిదర్శనమనీ అనుకోడం సహజం. ఆ స్థితిలోని కళాకారుడి చర్యలలో పైతరహా వ్యాఖ్యానాలు కొంత నిజం అయినా కావచ్చు. మొత్తానికి 'అతిగా నటించకూడదు' అన్న నియమంలాగే, పాత్రల స్వరూపస్వభావాలుకూడా చూసుకోవాలి అన్న నియమం రేలంగి పాటించ ప్రయత్నించాడు. అయినా కొన్ని చిత్రాలలో అతని పాత్రకు కథతో చుట్టరికం లేకపోవడం, 'గ్రాండ్ డబుల్ ప్రోగ్రాం' లో రెండో కథలా సాగిపోవడం కూడా జరిగింది. మిగతా వాటిలోమటుకు చాలా మంచిపాత్రలూ వచ్చాయి. వాటిని రేలంగి చాలా మధురంగానూ పోషించాడు. అతను దాదాపు అన్ని రకాలపాత్రలూ ధరించాడు. పక్కింటి అమ్మాయిలో హీరో, 'పల్లెటూరు'లో విలన్, పాతాళభైరవిలో హాస్యగాడు, 'వెంకిపెళ్ళాం'లో తండ్రి, 'ఇలవేల్పు' 'మాంగల్యబలం' వంటి వాటిలో విద్యార్థి ...

'పెదమనుషులు' చిత్రంలో అతను నటించిన 'తిక్క శంకరం' తెలుగు సినిమా కథలో ఒక మైలురాయి. పాత్రస్వరూప స్వభావాలే చాలా గొప్పగా తీర్చిదిద్దినవి. సులభంగా ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేవి. అలాటివి దొరికినప్పుడు, నటుడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయి వాటిని ధ్వంసం చేయగల స్థితిలో ఉంటాడనీ, అందువల్ల వాటిని నటించడం దాదాపు తేలాతో కాలేని పాత్రలకు ప్రాణం పొయ్యడం అంత కష్టమూ అనీ నటులకు బాగా తెలుసు. తిక్కశంకరం నటనలో తిక్కవేషాలు వెయ్యకుండా, అతిగాపోకుండా కె. వి. గారు, వెంకట్రామయ్య కలిసి రేలంగికి కళ్ళెం వేసి నడిపారు.

ఇలాగే స్మరణీయమైన మరొక పాత్ర 'వెంకిపెళ్ళాం'లో తండ్రివేషం. మామూలుగా అదేమంత క్లిష్టమైనపని కాకపోయినా, హాస్యగాడుగా అందరికీ తెలిసిన రేలంగి ఆ వేషం వేసి ఒప్పించడం మటుకు చాలా కష్టమైనపని అని అతడూ, మిగతావారుకూడా భయపడ్డారు. అతను ఏంచేసినా నవ్వే జనం, నటాక పన్ని వేళలో కూతురును చెంపకాయకొట్టి ఆమె జీవితాన్ని మార్చివేయవలసి ఉన్న నీతివాక్యం చెప్పినప్పుడుకూడా నవ్వితే ప్రమాదం ఉంది.

రేలంగి వెంకట్రామయ్య

అందుకోసం రేలంగి చిత్రం ఆరంభంనుండీ కృషిచేసి, ప్రేక్షకులను ఆ సన్నివేశానికి ఆయత్తపరచాడు.

సంతానం, శోభ, దొంగల్లోదొర చిత్రాలలో రేలంగి ధరించిన తండ్రి పాత్రలూ పల్లెటూరు, రోజులు మారాయి చిత్రాలలో దుష్టపాత్రలూ, విప్రనారాయణలో శిష్యుడు, ఎత్తుకు పైయెత్తులో బిచ్చాలుపాత్ర ధరే అమాయకులవంటి వాటిలో పోకిరీవేషాలూ రేలంగి బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనాలు. పక్కింటి అమ్మాయిలో రేలంగి సర్వజనరంజకంగా నటించాడు. సీమచిత్రాలలాగే, ఇక్కడా రేలంగి హీరోగా హాస్యప్రధాన చిత్రాలు తీస్తే అందరికీ నచ్చుతాయని ఋజువు చేశాడు. దొంగరాముడులో ఉత్తిభద్రయ్య వీరభద్రయ్యల గురించి హాస్యంమాట వచ్చినపుడల్లా అందరూ ఇప్పటికీ చెప్పుకుంటారు. ఇవన్నీ ఒక ఎత్తుకాగా, అనేక చిత్రాలలో చిత్రాలలో చూసపోసిన వేషాలను (పాత డైలాగులు సహా) కూడా ఆ సమయానికి అందరినీ నవ్వించగల తరహాలో నటించగలిగినందుకు రేలంగి ప్రత్యేకం అభినందనీయుడు. అవన్నీ ఆయనలోని అసాధారణ ప్రజ్ఞకు గొప్ప నిదర్శనాలు. ఒక నటుడు అన్నట్టు, ఈ విధంగా అనేక సాధకబాధకాలను, బాక్సాఫీసు సూత్రాల బంధాలను నిగ్రహించుకుని "తెరమీద రేలంగి నూరు చిత్రాలు మన్నగలిగాడంటే, వెయ్యిచిత్రాలలో నటించేందుకు అర్హత సామర్థ్యం గల ఒక నటుడు తెలుగు సినిమాకి దొరికాడన్నమాట. ఎటొచ్చీ చలనచిత్రకారులు, "ఇంకా తొమ్మిదివందలున్నాయి కాబట్టి ఫరవాలేదు" అనుకుని రేలంగిని దుర్వినియోగం చేసుకోకుండా ప్రజ్ఞని తీరుబాటుగా వాడుకోవచ్చు, పేరువాల్యూని స్టార్ వాల్యూని వాడుకుందాం అన్న తరహాలో కాకుండా వ్యవహరించడం శ్రేయస్కరం. ఈ బాధ్యతలో తనకీ భాగం ఉందని రేలంగికి తెలుసు.

* * * *

తెలుగు సినిమామీద రేలంగి హాస్యం చెప్పుకోదగ్గ ప్రభావాన్ని చూపించింది. ఆ మధ్యవరకు రెండర్థాల, మూడర్థాల మాటలు లేకుండాలేవి సినిమాలలో. "నిస్సార రూపత్రయం"లో మదిర, మదవతి, తరువాత పెద్ద సమస్యను తెచ్చిపెడుతూవచ్చినవి ఈ డైలాగులే. ఎవరైనా పెళ్లాంబిడ్డలతో సినిమాకి వెళ్తే చాలా అవస్థపెట్టేవి ఇవే.

రేలంగి పలుకుబడి కొంచెం పెరగడంలో అతడుచేసిన మొదటి పని, యీతరహా 'పలుకుబడి' ని తగ్గించి తొలగించ ప్రయత్నించడమే. హాస్యం మామూలు మాటల్లోకూడా పలుకుతుందని కొందరు మిత్రులతోపాటు వాదించి, చూపించాడు. అది ఎక్కడో ఆకాశ మార్గాన వుండదనీ, ప్రతివాడి జీవితంలోను కష్టాలతో దిగుళ్లతో కలిసిపోయిఉంటుందనీ, ఇళ్లలో ఆడా మొగా పిల్లలూ, నీతి కాని మాటలు వాడకుండానే నవ్వుకుంటూ, ఒకళ్లనొకళ్లు నవ్వించుకో గలుగుతున్నారనీ నమ్మి నమ్మించాడు. ఎలా నవ్వించాడూ అన్నది, తెరమీద రేలంగి ప్రదర్శించే చిన్న చిన్న హావభావాలూ, వాటిలో రకాలరంగులూ చూసి ఇన్నాళ్ళూ నవ్వుతున్న వాళ్లందరికీ తెలుసు

* * *

రేలంగికి ఒక్కగానొక్క కొడుకు. ఆ అబ్బాయి చదువుకుంటున్నాడు. కొంతకాలంక్రితం ఒక సినిమాలో వేషంకూడా వేశాడుగాని, ఇప్పుడు తండ్రి మాటప్రకారం ఆజోలికి పోవడంలేదు.

"నేను ఎలాగా చదువుకోలేదు. నువ్వు బాగా చదవాలి నాయనా" అంటాడాయన.

* * *

చదువుకోవాలని మనసుండి సదుపాయం లేనివాళ్లందరికీ, శక్తివంచన లేకుండా సాయం చేస్తూనే ఉన్నాడు. గత సంవత్సరం తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి పాతిక వేలువిరాళం ఇచ్చాడు. మొన్న కేసరీ పాఠశాలలో ఒక తరగతి గది కట్టించడానికి విరాళం ప్రకటించాడు. ఇవి కాక గుప్తదానాలు చాలా చేస్తా-యన. పెళ్ళిళ్లు చేయించడం ఆయనకో హాబీలా అయింది.

తెరమీద రేలంగి పదిమందినీ సంతోషపెట్టినట్టే, తెరవెనక రేలంగి కూడా సదా అదే ప్రయత్నంలో ఉంటాడు. ఇంకో విశేషం ఉంది. సాధారణంగా హాస్యగాడి, ముఖంమీద నవ్వు తెరతొలగిస్తే విషాదవదనం కనిపిస్తుందంటారు.

రేలంగి దగ్గరకు వెళ్ళి నవ్వు మాస్కు తీసిచూస్తే ఆ వెనకాల "వెంకటరామయ్య" కూడా రేలంగి అంత కులాసాగానూ సుఖంగానూ హాయిగానూ నవ్వుతూఉంటాడు. ఇద్దరూ కష్టాలూ చిక్కులే తప్ప దిగులు ఎరగరు. అతడు సృష్టించే హాస్యం గురించి మధనపడి, జీవితంలో విషాదాన్ని పరిశీలించే అసలు రేలంగి మూడో పొరలో ఉంటాడు. ఉన్నా ఆయనను రేలంగి మనకు కనబడనీయడు. అంతమాత్రాన రేలంగిది లోతులోని హాస్యం అని ఈరోజున ఎవడూ అనలేదు. అతనిలోని తపనూ, ఎప్పుడూ ఎదటివాళ్ళను సంతోషపెట్టాలన్న ప్రగాఢమైన ఆకాంక్ష, నిన్నటి విట్టు రేపు వెయ్యకూడదన్న నియమం—ఇవే రేలంగి నూరు చిత్రాలు మనడానికి కారణం. ఇంకో నూరు చిత్రాలలో జయప్రదంగా వెలగడానికి కూడా అవే కారణం కాగలవు. ★

వార్తావరణం

(50-వ పేజీ తరువాయి)

అవనే అతనికి ఇవ్వడం పరిపాటి. రామారావుకు పౌరాణికాలలో రాముడుగా కృష్ణుడుగా మంచిపేరు వచ్చింది. మామూలుగా పాత్రమీద గౌరవం ఉన్న నటుడికి, ఆ పాత్రను అర్థం చేసుకుని ఫలానా విధంగా అది నడవాలని నిర్ధారణ చేసుకోడానికి మనసులో రామరావణయుద్ధం జరుగుతుంది. రాముడిగా పాత్రకు అలవాటుపడి, రావణుడిగా నటించిన రామారావుకు మామూలు రామరావణయుద్ధం కాకుండా, అతురాలా మరో రామరావణయుద్ధం కూడా జరిగి ఉండాలి.

"అంతకన్నా కావలసినదేముంది. అవకాశం ఉంటే, రామరావణ భూమికలు రెండింటినీ ఒకే చిత్రంలో నటించడానికి కూడా నేను సిద్ధమే" అని రామారావు కృతజ్ఞత తెలుపుతూ అన్నాడు. సినిమా నటులకి డబ్బు చాలా నే వచ్చినా, చేసిన కృషిని పదిమందీ హర్షించి మెచ్చుకుంటేనే నిజమైన సంతృప్తి సంతోషం లభిస్తాయని రామారావు అన్నారు.

ఉత్తమ తమిళ నటుడుగా ఎన్నిక అయిన శివాజీ గణేశన్, ఉత్తమ తమిళ నటిగా ఎన్నిక అయిన సావిత్రి, తెలుగు నటిగా ఎన్నిక అయిన రాజసులోచన, నటులు అనేక చిత్రాలలో ఒకసారి నటించరాదన్న సుబ్రహ్మణ్యంగారి సలహాకు సమాధానంగా, తగినంతమంది నటులు లేనందువల్లనే, ఉన్నవారు ఇష్టమున్నా లేకపోయినా చాలాచిత్రాలలో వేషాలువేయడం జరుగుతోందన్నారు. లేదా మద్రాసు ప్రభుత్వంవారు ఒక చట్టం కనక చేసేట్టయితే ఒక్కొక్కరు రెంటికన్న ఎక్కువ చిత్రాలలో నటించరని శివాజీ గణేశన్ ఛలోక్తి విసిరారు.

ఉత్తమ సహాయనటుడు (పెళ్లి నాటి ప్రమాణాలు)గా ఎన్నిక అయిన రంగారావు ఆలోచించదగిన ఒక విషయాన్ని ప్రస్తావించారు. ఉత్తమ నటుడు అనేబిరుదు, బహుమతి హీరో వేషంవేసి డ్యూయెట్లు పాడేవాళ్లకే చెందుతాయన్న భావం ఒకటి చెలామణిలో ఉన్నదనీ ఇతర పాత్రలు నటించేవారుకూడా 'ఉత్తమ' నటను ప్రదర్శించడానికి అవకాశం ఉందని గుర్తించాలని ఆయన అన్నారు. ఈ వాదంలో న్యాయం లేదనడానికి సుతరామూ వీలు లేదని సరసులంతా అంగీకరిస్తారు. ★

విదేశ చిత్రాలు

ది టెన్ కమాండ్‌మెంట్స్

సిసిల్ బి. డిమిల్ రంగుచిత్రం 'ది టెన్ కమాండ్‌మెంట్స్' మద్రాసు ఓడియన్ సినిమాలో మేటినీలతో 25 వారాలు ఆడటం పూర్తిచేసి రజతోత్సవాలు జరుపుకొంది. ఒక విదేశీచిత్రం ఇక్కడ ఎప్పుడూ ఇన్నాళ్లు ఆడలేదు. ప్రపంచావధిని దేశదేశాలా ఈచిత్రం ఇలా కొత్త ప్రమాణాలు నెలకొల్పుతునే ఉంది.

ఈచిత్రం డిస్ట్రిబ్యూటర్లు పారమౌంట్ పిక్చర్స్‌వారు గత వారం రజతోత్సవాన్ని పురస్కరించుకొని మైలాపూర్ వుడ్‌లాండ్స్ హోటలులో విందుచేసి, ఓడియన్ సెజ్ అధిపతులు సాహ్నీ బ్రదర్సును, ఇక్కడ ఈ ప్రదర్శనాన్ని విజయవంతంగా నిర్వహించిన ఓడియన్ మానేజరు రఘుపతి చిట్టిబాబును అభినందించారు.

14 మిలియన్ డాలర్ల ఖర్చుతో పాతికవేల నటులతో మూడేళ్ల ప్రయాసతో తయారైన ఈచిత్రంలో చార్లటన్ హెస్టన్, యూల్ బ్రైనర్, ఎడ్వర్డ్ జి. రాబిన్సన్, విన్సెంట్ ప్రైస్, సర్ సెడ్రిక్ హార్డ్‌విక్, జాన్ డెరిక్, అన్‌బాక్స్టర్, నినాఫోక్, జుడిత్ ఆండర్సన్ మొదలగువారు నటించారు. సంగీతం విక్టర్ యంగ్.

మరో మరో ప్రపంచం

మంచిరిస్లు, చల్లటిగాలి పువ్వులు తరువాత 'ఫెయిరీటేల్' అనేది దేవుడు మనిషికిచ్చిన గొప్పవరాలలో గొప్పది. సగం స్వప్నంగా సగం సత్యంగా కనిపిస్తూ వింతగా కన్పుగాడుంటే ఈ చిక్కని కథలను ఏనాడో ఏ మహానీయులో అల్లి అందరికీ పంచిపెట్టారు. అవి ఏ దేశంలోనైనా కొత్తవు. అన్ని దేశాలజానపదకథలూ ముఘుముఘురంగానే ఉంటాయి. [illegible] వయసుమళ్లి, పంచాంగాన్ని బట్టి అవి తట్టిలేపుతూ మరో ప్రపంచాన్ని, మనకు అంది అందనివాని అందాన్ని అందిస్తూ ఉంటాయి. దేవుడిచ్చిన వరాలను మనుషులు అందరికన్న అందంగా ఎక్కువగా జట్టుగా చేసిపెట్టిన వారిలో గ్రిమ్‌బ్రదర్స్ ముఖ్యులు. వాళ్లు చెప్పిన వాటిలోఒకటి చక్కదనాల కథ 'టామ్‌థంబ్' ను ఎం. జి. ఎం. వారు విస్టావిజన్ తెరమీద కంటికి నదరైన రంగులలో చిత్రించారు.

కథ కొంత పరిచయం. [illegible] మనుషులూ, వనదేవత, అడవిని కాంతితో పంచిపెడుతున్న చిన్నవాడూ, [illegible] టామ్‌థంబ్ పిల్లడూ (టామ్‌థంబ్) — [illegible] అంటూ ఉంటాడు — (మనకి కథచెప్పేందుకు వీలుగా [illegible]) వాడి [illegible] ప్రపంచమూ, దరిద్రులైనా మంచి అవనిలను తొలగించి, ఈ టామ్‌థంబ్ పిల్లడు దొంగల్ని పట్టివ్వడం కథాంశం.

పిల్లవాడి ఇంత చిన్నవాడుగా చూపటానికి ట్రిక్ ఫోటో గ్రఫీ ఉపయోగిస్తారని జనులకి తెలిసినా, చూస్తున్నప్పుడు ఆ మాట అనిపించదు విస్మయంగా, అదంతా నిజమే అని నమ్మేలా తీశారు. అదేకాదు. కథకూడా జరుగుతుందనిపించి మనం అందులో కలిసి కలిసిపోయేలా తీశారు. [illegible] పిల్లల్నీ [illegible] కూడా తీసుకెళ్లవలసిన చిత్రం.

గోడవిరాద నీడ

పింక్ వాడ్, వార్నర్ బ్రదర్స్ (అపూర్వ నటనొంగులకు పెట్టిందే పేరు) మొదలయిన సాహస కథా చిత్రాల హీరో, జన.బి ఫియర్ బాంక్స్ జూనియర్, నిర్మించిన అపరాధ పరిశోధక చిత్రం "చేజ్ ఏ క్రుకెడ్ షాడో" ను వార్నర్ బ్రదర్స్‌వారు మద్రాసు న్యూగ్లోబ్ సినిమాలో జూన్ 6 న విడుదల చేస్తున్నారు. మే 23 న పత్రికలవారికి చూపించారు. పోస్టరూ, పేరూ, సినిమా హాలుకు రావాలనిపించేలా తీశారు. [illegible]



వార్నర్ బ్రదర్స్‌వారి 'చేజ్ ఏ క్రుకెడ్ షాడో'లో ఒక సన్నివేశం

ఇటీవల [illegible] పోలీసులాంటి పత్రికల్లో ఎక్కడా తిండిలో ఉన్నంత ఉత్కంఠ లేదు. ఇందులో కథ చిత్రీకరించడంలో పాటి అద్భుతాన్ని, సంభ్రమాన్ని ఈమధ్య మనం చూడలేదు. [illegible] అనే అమ్మాయి జీవితంలో, తప్పిపోయిన అన్న మరణించిన తర్వాత ఒక చిన్నవాడు వస్తాడు. 'నా అన్న ఏనాడో మరణించాడు' అంటుంది ఆమె. 'నేను తప్పిపోలేదు. బ్రతికే ఉన్నాను' అంటాడు ఆ అబ్బాయి. అందుకు తన ముద్దు పేరు, ఇతర గుర్తులు చెప్తాడు. [illegible] ఆమె అన్నగారిలా ప్రవర్తిస్తూ, చిన్నప్పటి చిన్న చిన్న విశేషాలు, [illegible] ఇతర వివరాలు చెప్తాడు. పాస్‌పోర్టు, ఫోటోలు అన్నీ చూపిస్తాడు. ఎన్ని చూపినా ఆమె నమ్మదు. [illegible] పోలీసులు కూడా అతని పక్షానే ఉన్నట్లు కనిపిస్తుంది. అయినా, ఆమె మాత్రం అతన్ని అన్నగా ఒప్పుకోదు.

ఈ చిక్కుముడి ఎలా విప్పారన్నది ఈచిత్రం కథలో ఆసక్తికరమైన అంశం. అది చెప్పడానికి వీల్లేదు. ఫియర్ బాంక్స్ [illegible] అందరూ మాట వినకపోతే, మాయమైపోతారు. అందరిని [illegible] ఆ పోలీసు చిత్రాలలో ఉంటుందని ఊహించవచ్చు. అందరూ అనుమానంలో ఉంటారు. [illegible] అన్‌బాక్స్టర్ (టెన్ కమాండ్‌మెంట్స్‌లో నెఫ్రెటారీ), ఆమె "అన్నయ్య"గా రిచర్డ్ (రాబిన్‌హుడ్) టాడ్, పోలీసు ఇన్‌స్పెక్టరుగా 'వార్ అండ్ పీస్' చిత్రంలో నెపోలియన్ వేషం వేసిన హెర్బర్ట్ లోం నటించారు. కట్టుదిట్టమైన కథాసంవిధానంగల ఈ చిత్రంలో ఉత్కంఠను అద్భుతంగా పోషించటానికి సంగీతం [illegible] చేసింది.

ప్రత్యేక లక్ష్యంతో చలన చిత్రాలు

ప్రస్తుతం ప్రజలకు శ్రవణ, దృశ్య సౌకర్యాలతో విద్య గరపటం కోసం తక్కువ విడివిగల చలన చిత్రాలను విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇలా చలన చిత్రాల్ని విద్యా విషయాల కోసం ఉపయోగించుకోటంలో ఎక్కువ శ్రద్ధ చూపటం రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జరిగింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత చలన చిత్రాల విలువను గుర్తించి యుద్ధ ప్రచారం కోసం అప్పటి భారతీయ ప్రభుత్వం ఒక చలన చిత్ర శాఖనో సంఘం స్థాపించి తద్వారా ప్రచారం కోసం చిత్రాలు తయారు చేశారు. తర్వాత కొన్ని డాక్యుమెంటరీ చిత్రాలు తీయటం ప్రారంభించారు. ధరిమిలాను ఈ బోర్డును రద్దుచేసి భారత సమాచార చిత్రాలు అంటూ స్థాపించారు. 1946 మే నాటికి అదికూడా విరమించారు.

నూతన వ్యవస్థ

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాతీయ ప్రభుత్వం ఒక ఫిలిం సంస్థను నెలకొల్పారు. దానిలో 1948 జనవరి 20వ తేదీ నాటినుండి కేంద్ర సమాచార, రేడియో ప్రసారశాఖ మంత్రిత్వశాఖలో ఫిల్మ్స్ డివిజన్ ఒక భాగంగా ఏర్పడింది. ఈ శాఖ ముఖ్య కర్తవ్యం ఏమిటంటే వ్యాపార, వ్యాపారేతర కృత్యాల్లో, తక్కువ నిడివిలో డాక్యుమెంటరీ, కార్టూను, వార్తా చిత్రాలను తయారుచేసి వాటిని దేశమంతటా సరఫరా చేయటం. ప్రస్తుతం పూర్తి నిడివిలో పంచరంగుల్లోను, తెలుగుభాషలోను డాక్యుమెంటరీ చిత్రాలను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం డాక్యుమెంటరీ చిత్రాలు జీవితంలో చూసే ప్రతి విషయాన్ని గూర్చి వున్నాయని చెప్పొచ్చు. కోయినా ప్రాజెక్టు అభివృద్ధికి ఇనుమే ప్రధానంలాంటి పంచవర్ష ప్రణాళికకు సంబంధించిన చిత్రాలే కాక, కళలు, వ్యవసాయం, శాస్త్రం, సంగీతం, విద్య, పరిశ్రమలు వాణిజ్యం, సాంఘిక నిర్మాణం మొదలైన విషయాలను గురించి కూడా డాక్యుమెంటరీలు తీస్తున్నారు. "పర్వతాల పిలుపు" డాక్యుమెంటరీలో హిమాలయ పర్వతారోహణ దృశ్యాలన్నీ చూడొచ్చు. అడివాసులు డాక్యుమెంటరీలో బస్తర్ ప్రదేశంలోని ఆదివాసుల జీవితాన్ని చక్కగా చూపించారు. "పరిశ్రమల్లో ఆరోగ్య విధులు", అనే చిత్రంలో పారిశ్రామిక కేంద్రాల్లో ఆరోగ్యం ఎలా ఎంత దెబ్బ తినేదీ చూడొచ్చు. "శక్తి కథ" డాక్యుమెంటరీ అణుశక్తి అభివృద్ధిని చాటుతుంది. మెట్రిక్ మానం డాక్యుమెంటరీ మెట్రిక్ మానంలోని తూనికలు, కొలతలన్నీ గూర్చి, వివరిస్తుంది. "భారత భూమి" అనేది భారత వ్యవసాయ పరిశోధనా సమితి చేసే వ్యవసాయ పరిశోధనల్ని గూర్చి చర్చిస్తుంది.

అంతర్జాతీయ ప్రశంస

డాక్యుమెంటరీ చిత్రాలు, సంఖ్యలోనే కాకుండా నాణ్యంలో కూడా పూర్తిగా అభివృద్ధిని చూపెట్టింది. దీనికి జాతీయ, అంతర్జాతీయ బహుమతుల్ని పొందిన డాక్యుమెంటరీ చిత్రాలే నిదర్శనం. ఈ మధ్య 'ఐశ్వర్యంలో మూడు,' 'అస్సాంలో కొన్ని తునకలు' 'జీవిత స్మృతి' వంటి అనేక డాక్యుమెంటరీ చిత్రాలు అంతర్జాతీయ బహుమతి పొందాయి. 1958 సంవత్సరంలోనే డాక్యుమెంటరీ చిత్రాలకు అంతర్జాతీయ బహుమతులు వొచ్చాయి. 'ఆనంద నగరం' మూడు చిత్రానికి ఏప్రిల్ 1958 లో ఢిల్లీలో యిచ్చిన రాష్ట్రపతి బహుమతుల్లో సన్మాన పత్రం లభించింది. కారెనా అంత్రీజియా—ఇటలీ—లో జరిగిన 14వ అంతర్జాతీయ పోటీలో 'ఖైద్దా కృషి'—(వినుగల్ని పట్టే ఒక పద్ధతి)—కి ఒక సన్మాన పత్రం, దాని విశిష్టతకు ఒక కప్పు, బహుమతులుగా వచ్చాయి. రోములో జరిగిన అయిదవ అంతర్జాతీయ పోటీలో "సనత్ చిత్రాలు" మానవ సృష్టి చిత్రంలో కన్పించే సాంకేతిక, కళాసౌందర్యాలకు కప్పు బహూకరించారు. ఈ సంవత్సరం రాధా కృష్ణ డాక్యుమెంటరీ చిత్రానికి రాష్ట్రపతి బంగారు పతకం 'డా కార్వే కథ'కు 'పర్వతాల పిలుపు' అనే చిత్రాలకు అఖిల భారత ప్రశంసా పత్రాలు, బహుమతులు వచ్చాయి.




1958 కి ఉత్తమ తెలుగునటిగా మద్రాసు ఫిలింఫాన్స్ బహుమతినందుకొన్న రాజసులోచన

ఎలా నిర్మిస్తారు ?

ఈ చిత్రాలు ఎలా నిర్మిస్తారు? అన్న ఆతురత ప్రతిఒక్కరికీ వుంటుంది. ప్రతి ఏటా డాక్యుమెంటరీ శాఖవారు ఏయే చిత్రాలు ఏయేలా తయారు చేయాల్సిందీ ఒక జాబితా తయారు చేసుకుంటారు. అన్ని శాఖల మంత్రివర్గాలు చేరి ఏ అంశాలపై చిత్రాలు తయారు చేయాల్సిందీ నిర్ణయిస్తారు. తర్వాత ఆయా అంశాలను ఆయా చలనచిత్రశాఖ దర్శకులకు పంపుతారు. కొన్ని డాక్యుమెంటరీలను ప్రత్యేక సంస్థలకు కూడా అందజేస్తారు.

— పరేశం.

ఆరుద్ర - గళ్ళనుడికట్టు-4



ఆధారాలు

అడ్డం

1. రేపే రానక్రీడ అనే భావనలో ఆశాభంగం జనిస్తుంది.
4. ఆకారం కనబడ్డాక "ఆహా! ఏమా! నా భాగ్యం!"
7. భరతుని పట్టంకాదు. అందరూ కలలుకనే పరిపాలన.
10. సాయిబాబా? బాలయోగా? మహనీయుడైతే మధ్య మనకే కనబడతాడు.
12. అంతట ముని నదీతీరమును స్పృశించును.
13. పట్టు, ప్రావు, ఊం! తదుపరి ఇందులో మీకే తెలుస్తుంది.
14. కుతుక చివర శూన్యం వుంటే కుతూహలం.
16. కొలువుకూటములో కాలకూటములో సావిడి.
17. సిపాయిలు తొక్కిడి కద! ముఖ్యంగా.
18. మొదట పోడిగా ఉండని మతుగు సాధనం కాబోలు.
19. సమయము; తీరిపోతే చావు.
21. స్వప్నం. తరువాత; నిదుర ముందు అప్పుడప్పుడు అది పట్టకపోతే ఉంటుంది.
23. గడ్డికుప్ప కడుపునొప్పికి మందు.
24. సంపదను కనులముందుంచు కొన్నప్పుడు కొంతవరకు కనబడుతుంది.
26. సీమను నిప్పలమధ్య సాధువు.
27. ప్రముక్కిన వెల్పిచ్చేది చివరన కలుపుకొంటే పాముల పట్నం.
29. కార్యములో యావత్తూ పోతే సోరుమంట.
8. గత కాలమును తృచ్ఛకొంటే అదే దొరుకుతుంది.

నిలువు

2. దుర్యోధనునికి నీచమైన అవమానం ప్రారంభమైంది.
3. భాందనమతములోనూ న మానత్వముంది.
4. అగ్నిలో పోయునది.
5. సాములారు మొదలెట్టే వ్యాయామం.
6. పోగాకు చివర బాకు ఉంటుంది.
8. స్వాతంత్ర్య పోరాటములో చరఖా ఉంది.
9. ఉద్యోగస్థులు జీవితములో వికారం లేకుండా కోరేది.
11. దీనితో కోడిగాని మరే పక్షిగాని లిఖించదా?
13. దీనిలో సిరా ఊరుతుంది.
15. ఈ పద్యము మొదట బచ్చలికి లేనిదురదగలదుంపకనబడుతుంది.
16. ఒకటే రెండూ కూడి కర్చుచేయ నప్పుడు సంచలనం.
19. అవసరముంటే ఇలాగ ప్రశ్నించండి.
20. రెండో కొమ్ము విరిగిన ధేనువు.
22. అతని విలాసాలలో తృప్తి లేక పోలేదు.
24. దర్పణములో కనబడే గర్వం.
25. ఇది భీకరము! ఇందులో చెయ్యి చేసుకోండి.
27. సరస్సు చివరకు యింకిపోయింది.
28. 30 అడ్డంలో కానలేకపోయినా అర్థానికి అడ్డంకాదు.

3-వ నుడికట్టుకు జవాబులు.

■	1 వం	2 ద	■	3 న	4 ర	క	ము	■
5 సం	■	6 ని	7 గ	■	మా	■	■	8 వ
గ	■	9 యా	య	వా	ర	10 ము	■	ర
11 తొ	12 ల	లు	■	■	13 మ	రి	14 యా	ద
■	ల	■	15 తా	ర	ణ	■	చ	■
16 ము	న	17 గా	ల	■	■	18 మ	న	19 దే
ద	■	20 ది	వ్య	చ	21 క్షు	వు	■	వి
ము	■	■	ము	■	22 ధ	న	■	డి
■	23 వి	డా	లు	కు	■	24 ము	డి	■

పుస్తక సమీక్ష

"కవీంద్ర"నాథ్ టాగూర్

టాగూర్ జయంతి-మద్రాసు, టాగూర్ అకాడమీ (16, వెంకటరత్నం రోడ్, మద్రాస్-18) వారు టాగూర్ జయంతి, అఖిలభారత సాహిత్య సమాలోచన సందర్భంలో ప్రచురించిన 'సావనీర్'. వెల: 1 రూ.

టాగూర్ రచనల ప్రభావానికి, టాగూర్‌పై దేశంలోని భక్తి, అనురక్తి తగ్గిపోకుండా ఉండటానికి, ఉద్యమస్థాయిలో ఈ అకాడమీ చేస్తున్న కృషి మెచ్చదగినది. ఒకప్పుడు భారతీయ సాహిత్యానికి టాగూర్ ముకుటంలేని మహారాజుగా వెలిగాడు. క్రమంగా ఆయన సాహిత్య ప్రభావం తప్పిపడి, కొత్తతరీకుల గీతులు, కొత్తసంగీత భావాలు ప్రబలి ఆయనవాణి వినబడటం చాలవరకు మానేసింది. టాగూర్ శతవార్షికోత్సవాలు దగ్గరవస్తున్నకొద్దీ, ప్రభుత్వాధికారంలో ఉన్న పెద్దల శ్రద్ధ కూడా తోడుకావటంవల్ల మళ్ళీ టాగూర్ ఉద్యమం పుంజుకోవటం మొదలైంది.

వెన్నెల, మబ్బులు, పువ్వులు, లతానికుంజాలు, కోకిలలు, వేణుగానం, తోట్లు, ప్రియురాళ్లు మొదలైన మధురసామగ్రితో మెరుపు మెరిపించేటంత తియ్యని పండి పంటలు పండిన కవితా సాగరుడు టాగూర్ కాళిదాసంతటివాడని ఆయన అనుయాయులు, అభిమానులు అనటం అతిశయోక్తిగా తోచేమాట నిజమేగాని, జాతీయత, అంతర్జాతీయత, వైష్ణవకవుల మధుర భక్తి, జయదేవుని లలితకోమలకాంత పదావళి, సూఫీ కవిత్వం, విట్‌మన్ వైశాల్యం ఉపనిషత్తులు, వైష్ణవ (సామ్) గీతలూ—ఇన్ని ఉపప్రవంతులు కలిసి మహావాహినిగా రూపొందిన టాగూర్ కవిత్వం ఎన్నటికీ ఎండిపోని జీవనది.

ఈ సంచికలో ఇంగ్లీషు, తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, ఉర్దూ, హిందీ, బెంగాలీ భాషలలో టాగూర్ ప్రశంసలూ, అనువాదాలూ ఉన్నాయి. తెలుగు భాగంలో వి. వి. రంగాచార్య అనువదించిన మూడు గీతాంజలి గీతాలు, శ్రీ వాత్సవ, కుమ్మలపల్లి సీతారామారావు, ప్రొ॥ కె. ఎస్. రామగార్ల వ్యాసాలు, సి. నారాయణరెడ్డి "త్యాగభావన" అనే గీతం ఉన్నాయి. ముద్రణ చక్కగా ఉంది. టాగూర్ అభిమానులకు ఆదరణీయమైన సంపుటి. —ఎస్

మంచు బెబ్బులి

(టెన్సింగ్ చెప్పిన ఆత్మకథ)

[అనువాదం: శ్రీ బెల్లంకొండ రాఘవరావు (ఇంగ్లీషునించి తెలుగులోకి) ప్రకాశకులు: ది ఓరియంట్ పబ్లిష్ కంపెనీ (రిజిష్టర్డు) తెనాలి వెల: ఒకరూపాయి డెబ్భై అయిదు నయాపైసలు. పేజీలు: 146.]

ఈ పుస్తకంపేరు చూచి ఇది పుస్తకమా లేక పెనుభూతమా అని అనుకోవచ్చు. అటువంటిదేమీ కాదు. పర్వతారోహణని గురించి రాసినగ్రంథం. మంచులో కష్టాలు భరించి తిరిగాడు కాబట్టి మంచుపులి అన్నారు, టెన్సింగ్‌ను. మామూలుభాషలో మంచుబెబ్బులి అయినాడు. ఇట్టి విషయాలకు సంబంధించిన పుస్తకాలు మనదేశంలోనే తక్కువ. అంగులో మన తెలుగులో అసలే లేవు! ఈ రకమైన పుస్తకాలు వెలువడటానికి చదివే "సరుకు" వుండాలి. మనం మనవూరు కదిలివెళ్ళం. ఇక మనని అడవులు, పర్వతాలు వాటిని గురించిన యాత్రల సంగతి ఎందుకు కనుక్కుంటాం? టెన్సింగ్ "ఒక సామాన్యవ్యక్తిగా ఎవరెస్టు ఎక్కాను. ఒక సాహసికుడై దిగివచ్చాను." అని జేమ్స్ రాంసే ఉల్మన్ పీఠికలో రాశారు ఈ రిమార్కు ప్రముఖంగా వుంది.

ఇటీవలవరకు పర్వతారోహణకు కేవలం పాశ్చాత్యులే సాహసించేవారు. ఇక మన దేశీయులు ముందంజ వెయ్యాలి. దీనికి టెన్సింగ్ దారి చూపించాడు. ఈ పుస్తకంలో టెన్సింగ్ తను బాల్యదశనించి ఇంతవరకు ఎన్నిఘట్టాలు దాటి ఇవ్వాళ్ళ కథానాయకుడైనాడో విశదంగా వివరించాడు. చిన్నతనం విషయాలు ఏమీ మరిచిపోలేదు కనుక ఎక్కువగా పట్టేవారికి మంచువలన బాధకలుగుతుందన్న విషయం తెలుసుకోవలసిందే. వాళ్ళ దేశాన్ని గురించి విపులంగా చెప్పాడు. మనకు దీపావళిలాగానే వాళ్ళకు పుల్లగడ్డల పంట ముఖ్యమట. వాళ్ళ సంబరం విచిత్రంగా వుంటుంది. వయస్సు నక్షత్రాల స్థితినిబట్టి నిర్ధారణ చేస్తారు. ఇంకా మనదేశంలాగా [illegible] వున్నట్టుగా తోస్తున్నది. ఊరంతా, మన ఇళ్ళల్లో ముసలివారిని వయస్సడిగితే ఎందరు గాలివానకు కొన్నేళ్ళు ఇట్లా అట్లా చెప్తారు. పర్వత దేశాల భూగోళం మన కళ్ళకు కట్టినట్టుగా తెలియచేశాడు. వాళ్ళు ఎలా నివసించేది తెలుస్తుంది. యాత్రికులకు స్థలాలు చూపించటం, పంటలు జీవనాధారాలట, సంసారాలు, వివాహాలు, ఆచారాలు, విశ్వాసాలు ఇటువంటి వాటిని చక్కగా దిద్ది చెప్పాడు.

ఆచార్య "టుచీ"కి శిష్యుడైనాడు. ఆయన మీద టెన్సింగుకు అమితమైన భక్తి, ప్రేమ, గౌరవం. విదేశీయులు విజ్ఞానార్జన కోసం ఏ విధంగా పాటుపడుతూ వస్తారో, వాళ్ళ ఆసక్తి ఇంతంత కాదని తెలుస్తుంది. మనం అనుకుంటాం ఎవరెస్టు ఎక్కడం అపాయకరమని, కాని అనుభవంవల్ల టెన్సింగ్ ఏమని తేల్చాడంటే [illegible] అపాయకరమని.

పాపం, ఈ చదువురాని టెన్సింగ్ ప్రపంచంలో గొప్పవాడైనా బంధువులను, మిత్రులను మరచిపోలేదు. అపారమైన కీర్తిగడించినా నిరాడంబర జీవిగానే వున్నాడని తెలుస్తుంది. అతని కథ జేమ్స్ రామ్సే ఉల్మన్‌కు చెప్పేటప్పుడు చిన్నతనం విషయాలు మరిచిపోకుండా అవసరమైన విషయాలను సమయస్ఫూర్తిగా చెప్పాడు—పూసగుచ్చినట్లుగా. ఉల్మన్ చక్కగా ఆ టెన్సింగ్ చెప్పింది అవగాహన చేసుకొని విపులంగా రాశాడు. కథానాయకుడైన తరువాత ఇతర దేశాలకు వెళ్ళినా మనిషి పాత టెన్సింగ్‌లాగానే వున్నాడు. మార్పులేదు. గొప్పవాళ్ళ లక్షణం కాబోలు! ఇండియా అన్నా, నేపాల్ అన్నా మంచి ప్రేమ, భక్తి.

ఏడుసార్లు ప్రయత్నించినా, విసుగుచెందక విజయం సంపాదించాడు. కోరిక ఫలించేదాకా ఆందోళన పడుతూనే వున్నాడు. చివరకు సాధించాడు. ఎవరెస్టుఎక్కిన నిమిషంలో మనశ్శాంతి ఎంతగా వుందో రాయడం కష్టం. పుస్తకం చదువుతూవుంటే మనంకూడా హిమాలయ పర్వతాలను ఎక్కి ఎందుకు ఆనందించకూడదనిపిస్తూవుంటుంది. కొన్ని కొన్ని ఘట్టాలు చదువుతూ వుంటే మనం ఆ పర్వతాలను ఎక్కుతున్నట్టుగానే ఉంటుంది. ఇంగ్లీషులో ఎంత చక్కగా రాశారో అంత హాయిగా తెలుగులో అనువదించబడింది.

పుస్తకం అట్ట, అచ్చు బాగానే వున్నవి. యువకులకు తగిన పుస్తకాన్ని అచ్చువేయించినందులకు దక్షిణ భారత పుస్తక సంస్థవారిని ప్రశంసించాలి. —రాశ

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1 Editor S Sambhu Prasad.



బాలింతరాలు

—చిత్రకారుడు కేతినీడి భాస్కరరావు

Regd No. M. 4479 Andhra Patrika Illustrated Weekly.

